
ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
4 అణాలు
28-5-'52



రుక్మిణీసందేశం.—చిత్రకారుడు : శ్రీ గూడూరి నారాయణమూర్తి.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 38
28-5-52

నందన జ్యేష్ఠ శుద్ధ పంచమి బుధవారము

వ్యాఖ్యలు, విమర్శలు :

కేంద్రప్రభుత్వ బడ్జెటు

కేంద్రప్రభుత్వ ఆర్థికమంత్రి చింతామణి దేశముఖ్ గారు యీ 23 న పార్లమెంటులో బడ్జెటు అంచనాలను ప్రతిపాదించారు. 1952-53 సంవత్సరపు తాత్కాలిక బడ్జెటు నొకదానిని యీయనే గత ఫిబ్రవరిలో ప్రతిపాదించి వున్నారు. వయోజన వోటింగ్ హక్కు అమలులోనికివచ్చి, ప్రజలు ఎన్నుకొన్న సభ్యులతో పార్లమెంటు తొలి సమావేశంలో మళ్ళీ యీ సంవత్సరపు బడ్జెటు అంచనాలను తిరుగతోడి క్రొత్త బడ్జెటును దేశముఖ్ గారు సమర్పించారు ఫిబ్రవరినాటి బడ్జెటుకు యిప్పటి బడ్జెటుకు పెద్ద వత్యాసం ఏమీ లేదు తాత్కాలిక బడ్జెటు అంచనాల ప్రకారం ఆదాయం రు 424 కోట్ల 98 లక్షలు. ఇప్పటి బడ్జెటు ప్రకారం రు 404 కోట్ల 98 లక్షలు తాత్కాలిక బడ్జెటులో వ్యయం అంచనా రు. 406 కోట్ల 25 లక్షలు. ఇప్పటి బడ్జెటులో రు 401 కోట్ల 25 లక్షలు. తాత్కాలిక బడ్జెటులో మిగులు రు 18 కోట్ల 73 లక్షలు. ఇప్పుడు రు 3 కోట్ల 73 లక్షలు. ఆదాయపు అంచనాలలో 20 కోట్లు తగ్గింది. వ్యయం అంచనా 5 కోట్లు తగ్గింది. ఎగుమతి సుంకాల తగ్గింపుమూలంగా ఆదాయం కొంతమటుకు తగ్గింది. ఈ బడ్జెటు ప్రతిపాదన జరిగేటంతవరకు ఆహారధాన్యాలకు సబ్సిడీలు యిచ్చే విధానం పునరుద్ధరింప బడవచ్చుననే ఆశ ముఖ్యంగా కార్మికవర్గాల వారికి వుండేది. సబ్సిడీలు తిరిగి ఏర్పాటు చేయించే వుద్దేశంతోనే బొంబాయి, పూనావంటి నగరాలలో కొన్నిరోజులపాటు కార్మికులు ప్రదర్శనలు జరిపారు కూడాను అయినప్పటికీ, దేశముఖ్ గారు యీ బడ్జెటు ప్రతిపాదనలలో సబ్సిడీల పునరుద్ధరణకు అవకాశం యిచ్చి వుండలేదు. ఇందుకుగాను ప్రభుత్వం కేటాయించదలచిన రు. 25 కోట్లలోనూ 15 కోట్లు మాత్రమే యీయన కేటాయించారు ఆవిధంగా ఆయన చేయటానికిగల కారణాలను పేర్కొంటూ, పట్టణాలనూ పారిశ్రామిక కేంద్రాలలోనూ వుండేవారికి మాత్రం ఆహారధాన్యాలకు సబ్సిడీలు యిచ్చి, పల్లె ప్రాంతాలలో వారికికూడా యిట్టి వుసులుబాటు కల్పించకపోవటం అన్యాయం అవుతుందనీ, అందరికీ న్యాయం చేయాలంటే కేవలం యీ సబ్సిడీల కోసమే దేశ ఆదాయంలో రు 90. కోట్లదాకా వ్యయం కాగలదనీ, అంత భారీ మొత్తాన్ని తక్షణావసరాలకోసం వినియోగించే ఆర్థిక స్తోమత మనదేశానికి లేదనీ అన్నారు అంతే కాకుండా ఆహార ధాన్యాల సబ్సిడీలు నిలుపుచేసి ఆ మొత్తాన్ని దేశంలో ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించి, దూరపు చూపుతో వ్యవహరించినందువల్ల యితోధికమైన ప్రయోజనాన్ని సాధించి, దేశానికి స్వయం పోషకత్వం ఆపాదించగల వారమౌతామనీ, ముందు రాబోయే మేలుకోసం వర్తమానంలో ప్రతివక్కరూ వీలైనంత త్యాగం చేయాలనీ యీయన కోరుతున్నారు. సబ్సిడీల వుపసంహరణ మూలంగా తిండిగింజల వెలలు పెరిగినమాట వాస్తవమేనని ఆయన ఒప్పుకొంటూ అపరాలు తదితర జీవితావసరవస్తువుల వెలలలో వచ్చిన తరుగుదలవల్ల వినియోగదారులకు తగినంత వూరట లభించగలదని కూడా ఆయన అన్నారు.

దేశవిభజన జరిగినపుడు మన వంతుకు వచ్చిన రు. 200 కోట్ల నగదు నిల్వలోనూ 1953 మార్చి నాటికి రు. 88 కోట్లు మాత్రమే మిగలబోతున్నది ఈ మొత్తమునైనా భారత ప్రభుత్వం యిక ఎంతమాత్రం వినియోగించకుండా వూరుకోవలసివున్నది.

ఈపై అన్ని అంశాలనుబట్టిచూస్తే మన దేశంలో యిక ఏ అభివృద్ధి ప్రణాళికను తలపెట్టినా అందుకు అవసరమయ్యేడబ్బు ఎప్పటికప్పుడు ప్రజలవద్దనుండి పన్నుల ద్వారా వసూలు చేయవలసివుంటుంది. లేదా [illegible] విదేశీయులైనా ధనసహాయం చేయాలి. ఈ ఏడాదికి క్రొత్తపన్నుల ప్రసక్తి లేకపోయినా అభివృద్ధి ప్రణాళికలు ఎన్నో తలపెట్టివున్నందువల్ల పై ఏడాదినుంచైనా క్రొత్తపన్నులు తప్పకపోవచ్చును.

ఈబడ్జెటును గురించి వివిధ రాజకీయ పక్షాలవారు అనేక రకాల విమర్శించారు. ఈ బడ్జెటువల్ల మధ్యతరగతి వారికి, కార్మిక కర్షకులకు యేమాత్రం ప్రయోజనం లేదు పొమ్మని కమ్యూనిస్టు ప్రముఖుడు ఎ. కె. గోపాలన్ అన్నారు. క్రొత్తపన్నులు లేవు అంతేచాలని శ్రీమతి సుచేతా కృపాలనీ (కె. ఎం. పి) అన్నారు. ఇంతకంటె ఎవరుమాత్రం చేయగలిగిందమీ లేదని కాంగ్రెసు సభ్యులు అన్నారు. ఆహారధాన్యాల సబ్సిడీల విషయంలో మాత్రం యించుమించు అందరూ సబ్సిడీల

ఈవారం ముఖ్యవిషయాలు

కొంత కాకపోతే కొంతైనా అమలులోకి తెచ్చివుండవలసిందన్నారు.

రైల్వే బడ్జెటు

కేంద్రప్రభుత్వంలో రైల్వేశాఖ కొత్త మంత్రి లాల్ బహదూర్ శాస్త్రిగారు యీ 22 న సమర్పించిన సరికొత్త రైల్వేబడ్జెటు కూడా యిలాగే చప్పగా వున్నది. దేశ్ ముఖ్ సమర్పించిన బడ్జెటులో క్రొత్త పన్నులు లేనందుకు సంతోషించినట్లే రైల్వేబడ్జెటులో కూడా ప్రయాణీకుల చార్జీలు పెంపుచేసే ఆలోచనా, సరుకుల రవాణా చార్జీల పెంపుచేసే ఆలోచనా లేనందుకు కూడా సంతోషించవలసి వున్నది.

ఫిబ్రవరిలో గోపాలస్వామిఅయ్యంగారు సమర్పించిన బడ్జెటుకు లాల్ బహదూర్ శాస్త్రిగారు యిప్పుడు సమర్పించిన బడ్జెటుకు ఏమీ తేడాలేదు. రైల్వేసిబ్బంది సౌకర్యాలను అభివృద్ధిచేసేందుకు ఒక కోటి, సరుకు రవాణా శీఘ్రంగా జరిగేందుకు అక్కడక్కడా వున్న ప్రతిబంధకాలను తొలగించేందుకు యింకొక కోటి రూపాయలు కేటాయించటం మాత్రం విశేషమే. కార్మికులు కరువుబత్తేన్ని జీతంతో కలిపివేయమని చేస్తున్న ఆందోళనకు ప్రభుత్వ పక్షంగా యింతవరకు సమాధానం లేదు. ఈ విషయంలో పరిశీలనైనా ఎంతవరకు జరిగిందో మంత్రిగారు వివరించలేదు. ఇక పోతే రైల్వేల మూలంగావచ్చే 112 కోట్ల ఆదాయంలోనూ 99 కోట్లుకు పైగా చెల్లించే మూడవతరగతి ప్రయాణీకుల అసౌకర్యాలన్నీ అల్లాగే వుండబోతున్నందుకు విచారించవలసి వున్నది.

ఆంధ్రదేశంలో వర్షాలు

నీటిచుక్క కోసం తపించిపోతున్న ఆంధ్రులకు గడచిన ఆదివారంనుంచీ అనేక ప్రాంతాలలో కుంభవృష్టిగా కురిసిన వర్షం ఆహ్లాదకరమైంది. ముఖ్యంగా ఈ ఏడాది చెన్నపట్టణంలో ఏర్పడ్డ నీటి సమస్యను చూచి పౌరులు పట్టణాన్ని విడిచిపెట్టిపోక తప్పదనీ, యీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కావాలంటే కృష్ణా-పెన్నారు ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమనీ ఎందరో భయపెట్టారు. ఆ ప్రాజెక్టు మాట ఎల్లావున్నా, ప్రస్తుతం, నీటిబాధ పడలేక మాత్రం ఎవరూ వూరువిడిచి పోనక్కరలేదు. 8 రోజుల్లో 36 దుక్కుల వాన కురిసింది. ఇంత పెద్దవాన యిదివరకు ఎన్నడూ పడలేదు. రెడ్ హిల్స్ చెరువులో 12 అడుగులకు పైగా నీటిమట్టం పెరిగింది. మద్రాసుకు మంచినీళ్లు యివ్వటంకోసం కృష్ణా-పెన్నారు ప్రాజెక్టు కట్టనక్కరలేకుండా నగరానికి దక్షిణపు భాగంలో రెడ్ హిల్స్ చెరువువంటిదే మరొక చెరువుకూడా త్రవ్వితే సరిపోతుంది. ప్రాజెక్టులకోసం గొనుగులాడడం ఫేషన్ గా తయారైన యీ రోజుల్లో, చిన్నదే అయినప్పటికీ శాశ్వతప్రయోజనానికి చాలామటుకు పనికివచ్చే యీ సూచనను అధికారులు ఎంతవరకు పాటిస్తారో అనుమానాస్పదమే.

నీటిబాధకు మరీ ఎక్కువగా గురిఅయిన రాయలసీమలో కూడా వర్షించింది. ముఖ్యంగా బళ్లారి, కర్నూలు, తిరుపతి, కడప, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల్లో బాగా వర్షించింది. ఆ ప్రాంతాలలో అలముకొన్న క్షామం యింతటితో వెనుకకు పట్టుతుందని ఆశించవచ్చు. ★

కొత్త సీరియల్

డాన్ క్విక్ సెట్

స్పెయిన్ నవలారచయిత సెర్వాంటీజ్ (1547-1616) రచించిన "డాన్ క్విక్ సెట్" అనే నవల అనువాదం ఆంధ్రపత్రిక (సచిత్ర వారపత్రిక) బొమ్మరిల్లు శీర్షికలో 4-6-52 బుధవారం నుండీ సీరియల్ గా ప్రకటింపబడుతుంది. మధ్యయుగాలనాటి వీరులను నవీనయుగంలోని చాదస్తుడొకడు అనుకరించబోయి అడుగడుగునా బోల్తాకొట్టిన వైనం ఈ నవలలో చక్కని హాస్యంతో వ్యంగ్యంగా చిత్రించబడింది. మొట్టమొదటి యూరపియన్ నవలలలో ఒకటైన ఈ నవల ప్రపంచ సారస్వతానికి డాన్ క్విక్ సెట్ అనే అపూర్వ విచిత్రపాత్రను సృష్టించి ఇచ్చింది. జగత్ప్రసిద్ధమైన ఈ నవల అనువాదాన్ని మా పాఠకలోకం సమాదరిస్తుందని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు.

సీలుఆన్నరు
మడతను
ప్రిమియర్‌బాక్సు‌కిలారు

బహుమతి రూ 10,000

MURALI CROSS WORDS

మురళి,1,2,క్రాసు వర్డ్సు
GOVT REGD NO 1894

ముగింపుతేది
5-6-52

వరుస 1 కి
నాలుగు
అణాలు

మొదటి బహుమతి రూ.7000

MURALI

ఇతర బహుమతి రూ.3,000

Closing Date 5-6-52 (Subject to Rules and Conditions.)

		జవాబులు 1	2
1	మురళి క్రాసువర్డ్సు పోటీలలో గెలుపుపొందుటకు యిది కొంచముగ-వినియోగించినచాలును	మనసు	మెదడు
2	బుద్ధిమంతులు యేయొక్క కార్యమున్న ——— గానే చేయుగురు	నిదానము	న్యాయము
3	స్త్రీ ఈర్ష్యచే పీడింపబడుచున్నట్లు సాధారణముగా ఆమె — వలన చెప్పవచ్చును	చూపు	రూపు
4	ఇది గల కుటుంబమునకు సంఘములో గౌరవము మెండు	ధనము	మానము
5	మనకు తెలియకనే ఒకొకప్పుడు మనలనుగురించి యిలాంటి వాక్యములు వెలువడును	భూషణ	దూషణ
6	సున్నితమైన మనస్సుగలవాళ్లు విపరీతమైన—కు గురికాబడిన అనారోగ్యులగుదురు	ఆలోచన	ఆవేదన
7	లౌకికజ్ఞానం తెలిసిన మానవుడు ఎప్పుడు యిలాంటివాడని చాలామంది నమ్ముతారు	అవకాశవాది	అశావాది
8	సూక్ష్మముగా పరిశీలించినగాని గీనివిషయం బోధపడదు	రంధ్రము	గ్రంధము
9	మధ్యతరగతి భూస్థితిగల రైతులకు యిది తప్పకవుండును	వనము	ఋణము
10	ప్రజలకు—బోధనకొరకే పలువిధములైన పురాణకథలు చెప్పియున్నారు పెద్దలు	భక్తి	బుద్ధి
11	యే దేశములోనైనను దీనిని పవిత్రముగ యెంచబడుచున్నది	దాతృత్వము	మాతృత్వము
12	మహాత్ములు ప్రపంచమునకు———ని ప్రసాదించుతారు	కాంతి	శాంతి
13	కొన్నింటికిది ప్రధానం	బుద్ధి	శుద్ధి

మీ జవాబులు ఈ ఇండ్లయందు 1.2 మూలముగాపూర్తి చేయుడు

1
2
3
4
5
6
7
8
9
10
11
12
13

పైనుండి క్రిందవరకు జవాబులవరుస | కి 4 అణాలుమాత్రం రూపాయికి 4 వరుసలపూర్తిచేయుడు

13

1 2 1 2 2 1 2 1 2 2 2 2 2

పేరు...

అడ్రసు...

P. O. or M. O. No.........Col No.........మొత్తము రూ........ మొత్తం వరుసలు...C. V. No..............

In entering the Competition I agree to abide by the Competition Rules & Conditions and to accept the Competition Manager's decision as final and legally binding.

No. 16

Address Entries to: **MURALI CROSSWORDS, PALMANER.** (CHITTOOR DIST)

ఋణానుబంధం

"నేను చావడానికే నిశ్చయించుకొన్నాను. చద్దామనే ఇక్కడికి వచ్చాను..." అంటూ మధ్యలో కొంచెం నసిగి అలా చూస్తూ ఊరుకున్నాడు అతను.

అది మెరీనా బీచ్. పబ్లిక్ కన్వీనియన్స్ దగ్గరనుంచి అలా లాగ్‌హౌస్ పోయేవైపు, బీచ్‌రోడ్ సరసనే వరుసగా చెట్లు ఉన్నాయి. ఆ పక్కనే ఉన్న కొలి బాట్లలో ఇసుకమీద కూర్చుని ఉన్నాము. సమయమేమో మధ్యాహ్నం 2 గంటలు. అతని మాటలు నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. అలాగే వింటున్నాను. నా వైఖరిలో కొంత నిర్లిప్తత, సానుభూతిలేనితనం, కొంత నిర్లక్ష్యంకూడా గోచరించాయేమో అతను మాట్లాడడం మానేసి చూస్తూ ఊరుకున్నాడు. సముద్రపు ఒడ్డున, అందులోనూ మధ్యాహ్నంపూట అలా ఎందుకు సమావేశమయ్యామో, అతని మాటలు నాకు ఎందుకు ఆశ్చర్యం కలిగించలేక పోయాయో ముందు చెప్పడం అవసరం.

*　　　*　　　*

నేను, మా నరసింహం కడుపు చేత్తో పట్టుకుని ఉద్యోగప్రయత్నంకోసం మద్రాసు చేరుకున్నాము. ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. స్నేహితులందరి ఆతిథ్యం ఏమాత్రం మిగలనివ్వకుండా స్వీకరించేశాం. ఇక ఉండలేము. ఉండకుండా ఉండలేము. ఇంటికి తిరిగిపోలేము. ఆ స్థితిలో రామస్వామి సత్రం చేరుకుని మా జెండా ప్రతిష్ఠించాం.

ఆ సత్రంలో మూడురోజులకన్న ఎక్కువగా ఉండకూడదనే నియమం ఒకటి ఉంది. అయినా మేము దాని నంతగా పట్టించుకోగలిగిన స్థితిలో లేము.

మా ముఖాలు కనపడితే చాలు తెలిసినవారంతా పలాయన మంత్రం పఠిస్తున్నారు. ఒకరిద్దరు తిరిగి కనపడడంవల్ల ప్రయోజనమేమీ లేదని చెప్పారుకూడా. మరొకరిద్దరు పుణ్యాత్ములు అడపా తడపా మాకో రూపాయ అర్ధ పారేస్తూనే ఉన్నారు.

వాల్‌టాక్స్‌రోడ్‌లో అరున్నర అణాలకే భోజనం పెట్టే హోటల్ ఉన్న పుణ్యదినాలవి. రూపాయ కళ్ళచూసినప్పుడల్లా భోజనం చేస్తున్నాం. లేనప్పుడు కుళాయి నీళ్ళు కడుపులో పట్టిస్తున్నాము. ఆరోజుల్లో దిన దినం సత్రంలో ప్రవేశించే కొత్తముఖాలను పరీక్షించడం నా కార్యక్రమంగా ఉండేది. పోనీ ఎవరైనా తెలిసినవారు, ఆ మాటికి అదృష్టం ఉంటే మా ఊరివారే కనపడితే వాళ్ళతో పాటు జెండా పీకేసి మా ఊరు పోవచ్చునేమో అని ఆశ. - లేకపోతే అధమం ఆపూటకి నాలుగు డబ్బులయినా లభిస్తాయని తాపత్రయపడేవాణ్ణి. మానరసింహం మాత్రం ఇలాంటివేమీ పట్టించుకోకుండా నిర్లిప్తంగా ఈ కష్టసుఖాలతో తన కేమీ నిమిత్తం లేనట్లు సత్రం వసారాలో పక్క పరుచుకుని నవరంధ్రాలు బిగించి, యోగనిద్రలో మునిగి ఉండేవాడు.

మేము సత్రంలో చేరిన వారం పదిరోజులకే కాబోలు అతనుకూడా అక్కడ చేరాడు. ఎవరితోటీ కలిగించుకోకుండా ఒక మూల కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. అయినా అతనితో మాకు ఏలాంటి సంబంధము లేకపోనేమో. కాని ఆతరువాత మా పరిస్థితి విషమించింది. ప్రాణాలు కడంటాయి. మూడురోజులపూటగా తిండి లేదు. కాఫీ కూడా లేదు. ఆఖరికి ఒక సిగరెట్ ముక్క అయినా లభ్యం కాలేదు. నరసింహాన్ని నమ్ముకుంటే చావే గతి. మా ఇరువురి ప్రాణాలు కాపాడుకొనవలసిన గురుతరమైన బాధ్యత నాపైనే ఉంది. నా ప్రాణాలు కడంటినా మా నరసింహాన్ని రక్షించేవారు ఉండరు.

అంతకుముందు కాఫీ త్రాగడానికి ఒకటి రెండు పర్యాయాలు హోటల్‌కి వెళ్లినప్పుడు అతను . డా మా వెంట వచ్చాడు. ఒకే సత్రంలో ఉంటున్నాం కనుక, ఎప్పటికైనా అవసరం రాకపోతుందా అనీ నేనుమాత్రం అతనివైపుచూసి చిరునవ్వుబాణాలు కూడా విసిరిఉన్నాను.

అతని జేబులో పెద్ద పర్సు ఉంది. అయిదురూపాయల నోట్లు నాలుగుఅయిదు నేను చూస్తూఉండగా మార్చాడు కూడా. ఒకవిధంగా అతనితో వ్యవహారానికి కొంత పునాది వేసిఉన్నాను.

నెమ్మదిగా మా నరసింహాన్ని కదిలించి చూచాను. "చంపకు బాబూ, నన్ను శాంతంగా నిద్రపోనిమ్మ"న్నాడు మా నరసు. "నిద్రపోవడానికి కావలసినంత టైమ్ ఉందిలే. కొంచెం సలహా ఇమ్మ"ని అడిగాను. "సలహా ఇచ్చేపాటి తీరిక లేదు. అయినా చెప్పు, వింటాను" అన్నాడు, మావాడు అలాగే కళ్లు మూసుకుని.

"చూడు. కొంచెం పెద్ద మనిషిలాగే ఉన్నాడు. ధర్మాత్ముడులా కనపడుతున్నాడు. చదువుకున్నవాడు కూడా. ఎవరితోటో ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడడం విన్నాను. అన్నిటినీ మించి డబ్బు ఉంది. మన పెద్దమనిషితనం, మన తెల్లటి లాల్చీలు, పైజామాలు, కళ్ళజోళ్ళు చూపి ఒక్కపూట తిండికయినా పాటుపడలేమా" అని అడిగాను. మావాడికి నా సంగతి క్షుణ్ణంగా తెలుసు. కంగారు పడలేదు. "ఇదివరకే పునాది వేసినట్లున్నావు. అయినా ఇంత స్వల్పమైన విషయానికి నా సలహా దేనికి? నా కేమో ఈ లంపటం లేదు. నీకు కావాలంటే కానీ..." అన్నాడు.

నెమ్మదిగా లేచి అతని దగ్గరికి వెళ్లాను. అతను హోల్‌డాల్ పరుచుకుని పడుకుని సత్రం పైకప్పు వాసాలు కాబోలు లెక్కపెట్టుతున్నాడు. నా రాక కూడా గమనించలేదు. "మీతో కొంచెం పనిఉండి వచ్చాను" అని గంభీరంగా అంటూ కొంచెం దగ్గి ఊరుకున్నాను. ఆ వ్యక్తి నా వంకకు తిరిగి అలాగే అర్థంలేని చూపు చూస్తూన్నాడు. పారిపోతున్న ధైర్యం చిక్కపట్టుకుని, "పాపం మీ ఆలోచనలకి అంతరాయం కలిగించాను కాబోలు. మళ్ళీ వస్తాను" అంటూ వెనక్కి తిరుగుతున్నట్లు నటించాను. అతను లొంగి

"తూలికాభూషణ్"

పోయావేమో లేచి కూర్చుని "అబ్బే పరవాలేదు. రండి, కూర్చోండి" అన్నాడు.

నేను కూర్చుంటూనే "మీతో ఏమాత్రం పరిచయం లేకపోయినా, ఏదో ఒకచోట ఉంటున్న కారణంచేత ఆత్మీయులుగా తోచి వచ్చాను. ఏమీ అనుకోకండి" అన్నాను.


నేను గాంభీర్యం మరికొంత హెచ్చించి, నా సోది వెళ్ళబెట్టాను—"మనియార్డరు రావడం ఆలస్యమైంది. అదైనా పల్లెటూరినుంచి రావాలి. పైగా ఈ పోస్టాఫీసువాళ్లు కూడా ఒక్కొక్కప్పుడు తగని ఆలస్యంచేస్తూ ఉంటారు. నాతో ఉన్న ఆయన (మా నరిసిగాడు) పెద్దకవి. రచయిత. కొంచెం అస్వస్థతగా ఉంటున్నాడు. మందుకి మాకుకి కూడా డబ్బు అవసరం. మొదట లెక్కలేకుండా ఖర్చుచేయడం వల్లను, అనుకున్న వేళకి డబ్బు రాకపోవడంచేతను ఆకస్మికంగా ఈ చిక్కులో పడ్డాము. అందుకని......అంటూ తతిమ్మాది ఆయన ఊహాశక్తికే విడిచిపెట్టాను.

అయ్యో, అలాగా పాపం! నేను కూడా ఒకప్పుడు ఇలాంటి బాధలు పడ్డవాణ్ణే, మీరేమీ సందేహించకండి. అయిదు రూపాయలు ఇస్తాను. తీసుకోండి. అంతగా కావలసివస్తే మళ్ళీ తరువాత ఇస్తాను. నాదగ్గరకూడా డబ్బు అయిపోతోంది. లేకపోతే మీకు మరికొంత ఇప్పుడే ఇవ్వగలిగి ఉండేవాణ్ణి అంటూ అతను అయిదురూపాయల నోటొకటి నాచేతిలో పెట్టాడు.

సత్రాలలో ఎక్కువ అనుభవంలేని అమాయకుడు. మంచివాడు. ఒకప్పుడు ఇలాంటి కష్టాలు అనుభవించానని చెబుతున్నాడు. మొగమాటం నటిస్తూనే నోటు మడతపెట్టి జేబులో భద్రపరిచి 'భోజనం టైమ్ అయింది. మీరు కూడా రండి' అంటూ బలవంతంచేసి, ఆయన వద్దంటూ ఉన్నా మొత్తంమీద ఆయన్నూ కూడా లేవదీశాను. దారిలో తెలుసుకున్నాను. అతని పేరు శంకరరావు.

ఆరోజు మధ్యాహ్నం అతని భోజనం టిక్కెట్టుకూడా నేనే కొన్నాను. అతను ఎంత వద్దన్నా వినిపించుకోక నేనే డబ్బులిచ్చి టిక్కెట్లు కొన్నాను.

మావాడు ఇదంతా ఓరకంటితో కనిపెట్టి అతను చేతులు కడుక్కుంటున్న



సమయంలో "నీఉద్యమం సఫలమగుగాక" అని నన్ను ఆశీర్వదించాడు. 'నిండు మనంబు, నవ్య నవనీతసమానము..."

మరొక రెండు రోజులపాటు ఒంటిపూటే భోజనం చేస్తూఉన్నా మొత్తంమీద మా పరిస్థితి సౌఖ్యంగానే ఉంది. కడుపులో కొంత స్థిమిత పడింది. ఈలోగా అతను ఇరవై నాలుగు గంటలు మాతోనే కలసి ఉండేవాడు. అంతవరకు అతని ఉదంత మేమిటో మాకు తెలియదు. ఆ మాటకి మా నిజమైన ఉదంత మేమిటో అతనికి ఈనాటికీ తెలియదు.

ఆ రోజు సాయంకాలం. రాత్రిళ్లు ఫలహారం మాత్రం చేసి తేలికగా పడుకుని, ఆరోగ్యం కాపాడుకుంటున్నాం. ఆ వేళ అతను భోజనానికి వెళ్ళడం మానేశాడు. పక్కమీద పడుకుని కదలనన్నాడు. బలవంతం పెట్టడం మంచిదికాదనుకున్నాను. అతనిచ్చిన అయిదు రూపాయలు అయిపోయే సమయం వచ్చింది. మళ్లీ కొంత పుచ్చుకోవలసిన అగత్యం ఏర్పడుతుంది. అతని మాటప్రకారమే అతన్ని విడిచిపెట్టి కాఫీ త్రాగివచ్చాం నేను, మా నరసింహం.

అప్పటికి అతను ఇంకా పడుకునే ఉన్నాడు. దుప్పటి ముసుగు పెట్టుకొని ఉన్నాడు. లోపల్లోపల కుమిలి కుమిలి ఏడుస్తున్నట్లు తోచింది. అది చూస్తూనే ఏమాత్రం చలించకుండా నరసింహం తన పక్కవద్దకు చేరుకుని మళ్ళీ సమాధిలో పడ్డాడు. నేను మా ఉభయుల భవిష్యత్ క్షేమందృష్ట్యా శంకరరావు దగ్గరికి పోయి కొంచెం ఓరడించి, నెమ్మదిగా సంగతి సందర్భాలు తెలుసుకొనడానికి ప్రయత్నించాను. శంకరరావు కొంచెంసేపు తన దుఃఖానికి కారణం ఇదనీ, అదనీ, ఏమీ లేదనీనటించి తప్పించుకొనడానికి యత్నించాడు. సానుభూతి చిప్పిలుతున్న నా స్వరం మాహాత్మ్యమో లేక దుఃఖం అతిశయించిందో ఏమో కాని "ఇక్కడ కాదు. బీచికి పోదాం రండి. మాట్లాడుకుందాం" అన్నాడు. కాలినడకనే మెరీనా బీచికి పోయాం. అప్పుడు ఎనిమిది ఎనిమిదిన్నర అవుతుందేమో నా దృష్టిమాత్రం శంకరరావుమీదనే ఉంది.

బీచ్ చేరుకున్న తరువాత అతను నెమ్మదిగా తన కథ అంతా బయటపెట్టాడు.

తండ్రి స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు. తనకి బియ్యే పరీక్ష తప్పింది. సెప్టెంబరుకి పోతున్నాడు. విపరీతంగా చదివేసి, మంచి పకడ్‌బందీగా తయ్యారయ్యాడు. పెళ్లికూడా అయింది. భార్య ప్రసవించే సమయంకూడా సమీపంలోకి వచ్చింది. ఈ పర్యాయమైనా పరీక్షలో పాసయ్యేయోగ్యత ఉందా లేదా అని తండ్రి ప్రశ్నించాడు. కష్టం కలిగింది. మొదటిమాటు భర్త పరీక్ష తప్పడం తనకే అవమానకరంగా ఉందని భార్య ఎవరితోనో అనగా విన్నాడు. కొంచెం కలిగినవారి బిడ్డ కావడం భార్యకి గర్వకారణం. ఆపైన వేళాపాళా లేకుండ తనను హాస్యంచేసి, వెర్రి ఎత్తిస్తూఉంటుంది. ఆ తరువాత భార్యతో చాలా రాద్ధాంతం జరిపాడు. చివరికి భార్య పుట్టింటికి పంపేయండి పోతానంది. ఇంకా ఆ భార్యాభర్తల మధ్య ఏమేమి రాద్ధాంత సిద్ధాంతాలు జరిగాయో అతను చెప్పలేదు. కాని మొత్తంమీద కొంప విడిచిపెట్టి తండ్రితో చెప్పకుండా డబ్బు తీసుకుని పారిపోయివచ్చాడు. అప్పుడే పక్షంరోజులకి పైగా అయింది.

మద్రాసు వచ్చిన నాలుగయిదు రోజులకి కాబోలు మరొక సంఘటన జరిగింది. దగ్గరబంధువే మామగారి తోడల్లుడు ఒకాయన కనిపించాడు. బలవంతపెట్టి ఇంటికి తీసుకుని వెళ్ళాడు. మర్యాదగా భోజనం పెట్టారు. ఆ తరువాత తండ్రితో చెప్పకుండా పారిపోయివచ్చినందుకు, ముఖ్యంగా భార్యని విడిచివచ్చినందుకు సన్నసన్నగా చివాట్లు పెట్టాడు. ఆ ఇంటిల్లిపాదీకూడా అదే ధోరణిలో మాట్లాడారు. ఇంట్లోనే ఉండిపొమ్మని బ్రతిమాలారు. "తండ్రికి ఉత్తరమైనా, టెలిగ్రామ్, అయినా ఇచ్చి రప్పిస్తాం. పరీక్షకి వెళ్ళడం మానేయకు నాయనా. నీ జీవితం, నీభార్య జీవితంకూడా ఎందుకు పాడుచేసుకుంటావు" అని హితవు చెప్పారు. తరువాత కనపడతానని హామీ ఇచ్చి, ఎలాగో వారిని వదుల్చుకుని, వెంటనే అడ్రసు మార్చుకుని, సత్రంలో చేరుకుని ఇలా కాలం గడుపుతున్నాడు.

ఈ సంఘటనలన్నిటితో విరక్తి మరింత ఎక్కువయింది. తనువు చాలించుకొనడానికి మొదట తీసుకున్న నిర్ణయం మరింత బలపడింది. అంతవరకు తన ఆచూకీ ఎవరికీ తెలియకుండా సత్రంలో ప్రచ్ఛన్నంగా ఉంటున్నాడు.

ఇదంతా నా చెవిని పడవేసి, మొదట తన ఆచూకీ మాత్రం ఎవరికీ తెలియపరచవద్దని కోరాడు శంకరరావు. నాస్తికుణ్ణి అయినా అవసరానికి దేవుడిమీద ఒట్టు వేసుకుని అతనికి నమ్మకం కలిగించాను.

అతని ఉదంతమంతా వింటున్నప్పుడే ఇందులో నాకర్తవ్యం ఏమిటని ప్రశ్నించుకున్నాను. ఒకటికాదు, ఏకంగా మూడు కర్తవ్యాలు గోచరించాయి. మొదటిది మహా ప్రధానమైనది. మా (నేను, మా నరసింహం) పరిస్థితి విషమంగా ఉంది. ప్రాణదాతలా ఇతను కనపడ్డాడు. మరొక ఆపద్బంధువు ఎవరైనా తటస్థపడి, మమ్మల్ని ఊరినుంచి పంపేసి మమ్మల్ని ఉద్ధరించేవరకు మాకు కొంత డబ్బు అవసరం. అందుకని శంకరరావుని కూడా మా దగ్గరే ఉంచుకుని, అతని డబ్బుకి కూడా బాధ్యత వహించి, కాలం గడపడం.

రెండవది చావడానికి నిశ్చయించుకున్నాడు. చస్తానని చెప్పాడు. బంధువులు హితబోధచేసిన తరువాత జీవితంపై విరక్తి మరీ అధికమైంది. ఈ స్థితిలో "వద్దు నాయనా" అంటే విరక్తి హెచ్చి నిజంగానే చచ్చిపోవచ్చు. అందుచేత కాదు కూడదు అని చెప్పడం మంచిదికాదు.

ఇక మూడవది. చూస్తూ ఊరుకున్నప్పటికీ అదే పరిణామం సంభవించి, అతను నిజంగా చచ్చిపోవచ్చు. అలాంటి అవాంతరం రాకుండా చేయడానికిముందు అతని సానుభూతిసంపాదించి, చచ్చే మార్గం ఉపదేశించగలిగిన దేశికుడుగా, మిత్రుడుగా నటించాలి.

నెపోలియన్ చక్రవర్తిలా యుద్ధవ్యూహం పన్నాను. అప్పటికి అతను మాట్లాడడం కూడా పూర్తి అయింది. కార్యరంగంలో ప్రవేశించడానికి సూచనగా ఒక సుదీర్ఘమైన నిశ్వాసం విడిచాను. అయినా ముందు నా ధర్మం నిర్వర్తించుకోవాలనుకున్నాను. "మీతో చెప్పకూడదుకాని, నా ధర్మం. ఒకమాట అంటాను. మీరు యువకులు, భవిష్యత్తు అంతా మీ చేతుల్లో ఉంది. కష్టం వచ్చింది. రాలేదనే టంతటి మూర్ఖత్వం లేదు నాకు. అదేమో తక్కువ కష్టం అనికూడా అనను. అయినా కొంచెం తొందర పడి ఇలాంటి నిర్ణయానికి వచ్చారేమో అనే భయం కలుగుతోంది" అని అతనివంక సాభిప్రాయంగా చూచాను. శంకరరావు మొదట చెప్పిన విధంగానే తిరిగి తన నిర్ణయం గురించి చెప్పాడు. చిరుకోపం కూడా వచ్చిందేమో అనుకుంటాను.

"ఏమైనా చావడానికే నిశ్చయించుకున్నాను. ఇంక మీరు ఈ విషయంలో ఏమీ చెప్పబోకండి. మీతో మాట్లాడడమే మానేయవలసివస్తుంది" అన్నాడు శంకరరావు కఠినంగా. నా ఊహ సరిఅయిందే అనుకుని అతని కోపం తగ్గించి ఓరడిం

చాను. ఇక మనిషిని దగ్గరకు తెచ్చుకోవాలి. మళ్ళీ మొదలుపెట్టాను.

"మీవిషయంలో పెద్ద అన్యాయం జరిగింది ఇలాంటి సందర్భాలలో తనవారిపై ప్రతీకారం తీర్చుకోలేని వ్యక్తి—అసలు మానవత్వం ఉన్నవాడెవడూ అలాంటి పని చెయ్యలేడు— అవమానం మరచిపోలేనివాడు— ఇదుగో మీరు అవలంబించిన మార్గమే చూసుకుంటాడు. అందుకే నేను మీ కథ విని విచారపడడానికి బదులు—ఒక రకంగా - అదేమిటో సరిగా చెప్పలేక పోతున్నాననుకోండి— మీ రంటే ఒక రకమైన గౌరవం కూడా కలుగుతోంది" అన్నాను. అతను తల పంకించి అలాగే వింటున్నాడు.

ఆ వెంటనే తిరిగి అందుకుని ఇలా అన్నాను—"మీ కో విషయం చెప్పాలి. వాతో ఉన్నాడే? మా నరసింహం-కవి, మంచి రచయిత అని కూడా మొన్న మీతో చెప్పాను. వాడు కూడా ఒకప్పుడు సరిగ్గా ఇలాంటి అవస్థలోనే పడ్డాడు. ఎటొచ్చీ ఒక టే తేడా. పరీక్షమాత్రం తప్పలేదు. తతిమ్మాదంతా మీకు జరిగినట్లుగానే జరిగింది. తండ్రి కొడుకుని కసిరి, పనిలేని వెధవకి తిండి పెట్టడం శుద్ధదండగ అని ఇంట్లోంచి పొమ్మన్నాడు. అప్పటికే మా నరసింహానికి పెళ్ళి అయింది. పెద్దవాడు కూడా పుట్టాడనుకుంటాను. (ఇది విన్నట్లయితే మా నరసింహం తన యోగనిద్రలోంచి లేచి, నా ప్రాణం తీసి ఉండును. వాడికి అప్పటికి కాదు, ఇప్పటికి కూడా పెళ్ళి అవలేదు.) అంటే ఇల్లు విడిచిపోయాడు మా నరిసింహం. ప్రాణం మీద విరక్తి పుట్టింది. చచ్చిపోను దేశానికి తీరని నష్టం వచ్చిఉండును. అదృష్టవశాత్తూ ఆ స్థితిలో నా కంటపడ్డాడు. వాడి జీవితం మళ్ళీ వెలుగులోకి వచ్చింది. అదంతా ఒక పెద్దగాథ. మిమ్మల్ని విసిగించడం నాకు ఇష్టంలేదు. ఈ సమయం కూడా అందుకు తగిందికాదు. ఇంతకీ చెప్పవచ్చేదేమంటే అలాంటి అవస్థ ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడైనా ప్రతిమానవుడు విధిగా అనుభవించితీరాలి. లేకపోతే వాడి జీవితానికి తగిన రాణింపు ఉండదు."

"ఏమిటీ మీ స్నేహితుడు కూడా ఇలాంటి అవస్థలోపడ్డవాడే నన్నమాట. అయితే ఏంలెండి? నాలాంటి నిర్భాగ్యులు ఎవరూ ప్రపంచంలో ఉండరు" అన్నాడు శంకరరావు. కొంచెం ఆసక్తి పుట్టింది కాబోలు. "ఆయన గాథ చెప్పండి వింటాను" అని అడిగాడు కూడా.

"తరువాత ఎప్పుడైనా చెబుతాను. ఇప్పటికే ఆలస్యమయింది. పదండి సత్రానికి పోదాం" అంటూ లేచి దారితీశాను. మాట్లాడకుండా అతను కూడా నన్ను అనుసరించాడు.

ఆ రాత్రి అంతా పిచ్చాపాటీ చెప్పకుంటూ కాలం గడిపాము మరునాడు మధ్యాహ్నం భోజనం చెయ్యడానికి తగినంత డబ్బులేదు. అలాగే పడుకుని ఉన్నాము. అతను చూచి, సంగతి గ్రహించాడేమో మాదగ్గరికి వచ్చి, భోజనానికి పోదాంరండి అని అడిగాడు. "లేదు. మీరు వెళ్ళిరండి, మేము తరువాత భోజనంచేస్తాము" అని సమాధానం చెప్పాను. అతనుకొంచెం నీరసంగా నవ్వి, "మీదగ్గర డబ్బు అయిపోయిందనుకుంటాను. పరవాలేదులెండి. నేను ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. మన చనువునిబట్టి ధైర్యంగా మాట్లాడేస్తున్నాను నాదగ్గర ఇంకా కొంచెం డబ్బుఉంది. అదికూడా ఖర్చుపెట్టుదాం, రండి" అన్నాడు.

"ఎందుకు లెండి? ఈ రోజు ఎలాగో కళ్ళుమూసుకుని కాలంగడిపామంటే రేపటికి మాడబ్బు ఎలాగూ అందకమానదు. మొన్న ఆదివారం మావాళ్లు పంపిఉండరు. నిన్న సోమవారం. ఈ వేళ మద్రాసు చేరుకున్నా, రేపుకాని బట్వాడా చెయ్యరు. ఇంతలోకీ కొంప మునిగిపోయేదేమీ లేదు. మీరు వెళ్ళిరండి "అన్నాను"

"ఎంతమాటన్నారు? తిండిలేకుండా ఉండడం ఎంత బాధ? మీరు రావలసిందే. మీరురాకపోతే నేనుకూడా వెళ్ళను. అంతా ఇక్కడే పడి ఉందాం"అన్నాడు శంకరరావు.

మా నరసింహులు సమాధిభగ్నమైనట్లుంది. లేచాడు. "ఆయన అంతగా చెబుతున్నప్పుడు ఏమిట్రా ఆ వాదన? పద పోదాం లేకపోతే ఆయన మనస్సు కష్టపడుతుంది. ఒకసారి తీసుకోగా లేందిఇప్పుడేమిటి అవమానం? ఈ డబ్బుకూడా తిరిగి ఇచ్చేద్దాంలే. రండి, శంకరరావుగారూ, మేము కూడా వస్తాం. మాకోసం మీరు భోజనం మానుకోవడమేమిటి? అన్యాయం" అంటూ పై పంచ భుజం మీద వేసుకుని నరసింహం హోటల్‌కి దారితీశాడు.

భోజనాలయినతరువాత తిరిగివస్తూ ఉండగా నేను పదేపదే చెబుతున్న కారణంచేత కాబోలు శంకరరావు ఖండితంగా చెప్పేశాడు: "ఈ భోజనం డబ్బులు మాత్రం మీరు నాకు ఇవ్వవద్దు. ఆ వేళ నా భోజనానికి మీరు దగ్గర డబ్బులేకపోయినా టిక్కెట్టు కొన్నారా, లేదా? అలాగే ఇదీని. కాదంటారా, నేనసలు మీదగ్గర డబ్బే తీసుకోను" అని.

నేనుమాత్రం ఇంక అనుమానించడం తగదనుకున్నాను "సరే, ఇంతవరకు వచ్చిన తరువాత మీతో దాపరిక మెందుకు? మీ దగ్గర మరి కొంత డబ్బు తీసుకోక తప్పదు. చాలా అవసరం. అసలు మీదగ్గర ఎంత ఉంది?" అని అడిగాను. అతను పర్సు పైకి తీసి లెక్కపెట్టగా ఏడురూపాయల పై చిల్లర ఉంది. అతనికి ఆరాత్రి భోజనానికి, మర్నాటి మధ్యాహ్నం భోజనానికి, రెండుపూటలు కాఫీ ఫలహారాలకు రెండు రూపాయలు ఆపై చిల్లర ఉంచుకోమని చెప్పి, అయిదు రూపాయలు ఇమ్మని అడిగాను ఇచ్చాడు మరునాటికి మాకు ఎలాగూ మనియార్డరు వస్తుందిగా?

ఆరోజు సాయంకాలంకూడా మా నరసింహాన్ని సత్రంలోనే విడిచి, బీచికి పోయాము అక్కడ అతని చదువుగురించి, బి. ఏ లో మొదటి ఏడాది పరీక్షలోను, యూనివర్సిటీ ఎగ్జామినేషన్లలోను, అతనికి వచ్చిన మార్కులు గురించి, వనకటి రికార్డుగురించి చాలా ప్రశ్నలువేసి తెలుసుకున్నాను అంతా విని, "అబ్బో. మీరు అఖండుడిలా ఉన్నారే అసలు మీకు ఆ ఏడాది పరీక్ష ఎలా తప్పిపోయిందో, వింతగా ఉంది ఈసారి మీకు డిస్టింక్షన్ తప్పకుండా వస్తుంది లెండి" అన్నాను.

"క్రిందటిసారే డిస్టింక్షన్ తప్పక రావలసింది. సరిగా పరీక్షలకి ముందు టైఫాయిడ్ వచ్చి, మంచంమీద పడ్డాను. ఇదిగో, ఇంకా ఇప్పటికీ ఆ నీరసం వదిలింది కాదు" అన్నాడు శంకరరావు విచారంగా.

"అవును. మీరు చాలా నీరసంగా కనపడుతున్నారు. పోనీ, ఏదైనా టానిక్ వాడలేకపోయారూ" అన్నాను. అతనేమీ సమాధానం చెప్పలేదు. ఆలోచనలో పడ్డాడు.

నేను కూడా అతని విషయం గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. మొదట మా నరసింహం కూడా ఒకప్పుడు అలాంటి అవస్థలోనే పడ్డాడని చెప్పడంలో అతనికి మా ఇరువురిపట్ల కొంత అభిమానం ఆత్మీయత కలిగినవి. మళ్ళీ పరీక్షల్లో గెలుపొందాలనే కాంక్షతోపాటు, మొదటి తరగతిలో ఉత్తీర్ణుడై నలుగురిలో ఆధిక్యం తెచ్చుకోవాలనే ఉబలాటం కూడా కలిగింది. ఆరోగ్యంవిషయం పదేపదే ప్రస్తావించి సానుభూతి చూపడంవల్ల అతనికి తనమీద జాలి అధికమైంది. ఇవన్నీ అతను చావకుండా చేయడానికి ఉపయోగిస్తాయి.

(4౯-వ పేజీ చూడండి)

మమకారం

ఇది ఒక చిన్న పల్లెటూరు. నాలుగైదు వందల ఇండ్లకన్నా ఎక్కువ ఉండవు. ఊరిపక్కనే వాగు, వాగు నానుకుని కొండ, కొండపైన చెట్లు, చూడ్డానికి అందంగా ఉంటాయి. నర్సయ్య ఆఊళ్ళో ఒక పేదరైతు. పూర్వార్జితమైన రెండెకరాల కొండ్ర, తండ్రి సంపాయించిన పది గొర్రెలు, మూడుగదుల మిద్దె, జత ఎద్దులూ, అతని యావదాస్థి. చిన్నతనంలోనే తండ్రి పోవడంవల్ల చదువు సంధ్యలు వదిలేసి నర్సయ్య నాగలిపట్టాడు. కోడి కూత విని లేచి కొంకేరు వేసుకుని "కొండ్ర" కు పొయ్యేవాడు. ఎండనకా, వాననకా, దున్నుకుని పొద్దు నెత్తిమీది కొచ్చిం తర్వాత ఇంటికొచ్చేవాడు. బొక్కెడన్నం తిని ఒక్క నిముషమైనా కూర్చోకుండా చుట్ట కాలుస్తూనే గొర్రెలు తోలుకుని కొండమీది కెళ్ళేవాడు. కనుచీకటి పడే వేళకు కాయో, కసురో, కొనుక్కుని కొంప జేరేవాడు. ఈవిధంగా కాలం గడిచిపోయింది. కష్టానికి తగ్గట్టు కరువు కాటకాలు లేకుండా ఏటేటా వర్షాలు కురిసేవి. క్రమేణా నర్సయ్యకు ఫలసాయం పెరగసాగింది. "ఎంతకాలం చెయ్యి కాల్చుకోవడం" అనుకుని కులమింటి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. భార్య వచ్చిన సంవత్సరం ఎప్పుడూ పండని పంట పండింది. గొడ్డొచ్చినా, బిడ్డొచ్చినా, వేళావిశేషం అనుకున్నాడు నర్సయ్య. తిండికి సరిపోయే గింజలు గరిసెలో పోసుకుని మిగతావి పాతర వేయించేవాడు. మరికొంత "మాలు" అమ్మి రొఖ్ఖం మూటగట్టాడు. ఎంత సంగ్రహించి సంపాదించినా, కొంత ఖర్చు కాక తప్పేది కాదు. వచ్చేవారూ, పోయేవారూ, పురుళ్ళూ, పుణ్యాలూ, పండగనీ, పబ్బమనీ, నలుగురితోపాటూ అన్నీ జరుపుకుంటూ ఉండేవాడు నర్సయ్య. ఇంత సంపాయించినా తనకు చిరిగిపోయిన చొక్కా, ముతకపంచె తలగుడ్డ, మోకాళ్ళపైకి ధోవతీ, చెవులో రెండు సార్లు కాల్చిన చుట్టా, మనిషి చాలా వినయంగా తలవంచి మాట్లాడుతాడు. ఇతన్ని చూసిన ప్రతివారూ సంపాయించాడని అనుకోరు. నర్సయ్యకిప్పుడు నలభైఏండ్లు. ఇద్దరు బిడ్డలు. రవణయ్య చేతి కొదిగాడు. రావమ్మ పెండ్లికొచ్చింది. బంధువులు అక్కడక్కడా సంబంధాలు చెప్పారు. నర్సయ్యకవేవీ చెవికెక్కడంలేదు. మున్నబుగారబ్బాయి 'కోటయ్య' కివ్వాలని అతని ఉద్దేశ్యం. ఒక్కడే కొడుకు. భూమి, పుట్రా ఉంది. గ్రామంలో నౌకరి. తండ్రి ఇంకా సంపాయిస్తున్నాడు. ఊళ్ళో సంబంధం. ఒక్కపిల్ల. కళ్ళ ఎదట ఉంటుంది. కష్టం, సుఖం, విచారించవచ్చు. ఇదీ నర్సయ్య ఆశ. ఒకరోజు రచ్చబండమీద 'పిచ్చాపాటీ' మాట్లాడుతూ మున్నబుతో తన ఉద్దేశ్యాన్ని తెలియపరిచాడు. మున్నబు తొణకలేదు. తల ఊపి ఊరుకున్నాడు. 'చెప్పుబావా! ఏవంటావ్' అన్నాడు నరసయ్య. 'సంబంధాలకేంవోయ్! చాలా వస్తున్నాయ్. 'ఇప్పుడేం తొందర' అంటున్నది నీ చెల్లెలు." అన్నాడు మున్నబు బెట్టుగా. నర్సయ్య గొంతు సవరించుకుంటూ 'ఊళ్ళోవాళ్ళం. స్నేహంగా ఉంటున్నాం. తథాస్తు అనుకుంటే తర్వాత ఎప్పుడైనా జరుపుకోవచ్చు. ప్రధానం రేపే పెట్టిస్తా" అన్నాడు. మున్నబు కడుపులో కల్లు గలవాడు. "పాలెంనుంచి మొన్ననే పెద్దకాపు వచ్చాడుబావా! లాంఛనాలన్నీ జరిపి నాలుగువేల కట్నమిస్తానన్నాడు. ఆలోచిస్తానని చెప్పా," అన్నాడు మున్నబు రీవిగా. "అదేవిటిబావా? నేను మాత్రం కాదన్నానా? ఏదో రెండువేల వరకూ...ఇస్తా" అన్నాడు నర్సయ్య నింపాదిగా. ఆరోజు సంభాషణ అంతటితో ఆగిపోయింది. మరి నాలుగురోజులు గడిచాయి. ఆరాత్రి నర్సయ్యభార్య సీతమ్మ "ఏవండీ! ఏవనుకున్నారు పిల్లవిషయం?" అంది నెమ్మదిగా అన్నం పెడుతూ. నర్సయ్య మాట్లాడలేదు. "ఎంతకాలం ఇట్లా? పద్నాలుగో ఏడు వచ్చింది. పదిమందికీ చెప్పలేక చస్తున్నా." అంది మళ్ళీ సీతమ్మ కొంచెం కష్టంగా. "నేనూ అదే ఆలోచిస్తున్నా! తొందరపడితే ఎట్లా? ఈ రోజుల్లో ఆడపిల్లను కనడంకంటె అడుక్కుతినటం మంచిది. అయినవాడూ, కానివాడూ కూడా అందలమెక్కి కూచుంటున్నారు. 'కానీ' సంపాయించడమంటే ఎంతకష్టమో వాళ్ళకేం తెలుస్తుంది? కట్నం, కట్నం, అని కాకిగోలచేస్తున్నారు." అన్నాడు నర్సయ్య మజ్జిగ పోసుకుంటూ. "అవును నిజమే. అందుకే ఇంత తినా, కుడవా, ఉన్నవాణ్ని చూచి ఇవ్వడం మంచిది. పెద్దపెద్ద సంబంధాలు మనకెక్కణ్నుంచి వస్తాయి. కాస్త మర్యాదస్తుణ్ని చూచి ఆ మూడుముళ్ళూ వేయిస్తే మనపని తీరిపోతుంది. రవణయ్యకా ఇప్పుడేం తొందరలేదు" అంది సీతమ్మ పొగాకుపట్టా బయటికి తెస్తూ. నర్సయ్య చేయి తుడుచుకుంటూ "నాకా మాత్రం తెలియదనుకున్నావా? మొన్ననే మున్నబుబావతో మాట్లాడాను. కలిగిన సంబంధం. కోటయ్యా, బుద్ధిమంతుడు. పిల్ల సుఖపడుతుంది" అన్నాడు సంతోషంతో. "ఆ! మున్నబు వప్పుకున్నాడా అండీ! అది కుదిరితే పిల్ల అదృష్టవంతురాలు. కట్నమెంత అడగలేదా?" అంటూ ఆదుర్దాగా అడిగింది సీతమ్మ. "అదేకదూ చెప్తుంటా! కట్నం అడక్కపోవడమేమిటి? చాలా బెట్టుగా మాట్లాడాడు. రెండువేల వరకూ ఇస్తానన్నా. పెద్ద మొత్తంమీద ఆశ ఉన్నట్లుంది. విషయం తేల్చకుండా వెళ్ళిపోయాడు. మన రామయ్యతో మళ్ళీ మాట్లాడమనిచెప్పా. ఏంజరిగిందీ రేపు తెలుస్తుంది." అన్నాడు నర్సయ్య చుట్ట ముట్టిస్తూ.

"అంతడబ్బు ఎట్లా ఒప్పుకున్నారండీ? సెట్టి బాకీ ఇంకా అట్లాగే ఉందన్నారు. మీ ఆలోచన్ను నాకేమీ అర్థంకావడం లేదు." అంది సీతమ్మ మంచం వాలుస్తూ.

"అంతే లేవే నీకేం తెలుస్తుంది ఆడదా

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

నికి ఆమాత్రం చొరవ చూపించందే పన్లెలా అవుతయి. నలుగుర్లోనూ తిరిగే వాళ్ళం గౌరవం నిలబెట్టుకోవాలిగా. అన్నీ నేచక్కబెట్టుకుంటాలే." అన్నాడు నరసయ్య గంభీరంగా.

మర్రోజు రామయ్యొచ్చి కొవులో ఊదాడు "లాభంలేదనీ, మున్సబు పదవేల మీద కూర్చున్నాడనీ" చెప్పాడు. "ఏదో మరోమాట చెప్పమనలేక పోయావా?" అన్నాడు నరసయ్య ఆదుర్దాగా. "ఆఖరు మాట అయిదువేలని చెప్పా. కాదన్నాడు. పూర్వపు స్నేహం, బంధుత్వం ఏ కరువు పెట్టా! చివరకు ఎనిమిదివేలయితే రైట్ చెయ్యమన్నాడు. మాట్లాడివస్తానని చెప్పి వచ్చా." అన్నాడు రామయ్య. నరసయ్యకు ముచ్చెమటలు పోసినయి. కష్టపడి సంపాయించిన సొమ్ము. పొలానికి కొసలాకొని, గొడ్డెపెంట అమ్ముకొని, ఒకపూట తినీ, తినకా కూడబెట్టాడు. పాతికేండ్ల ఫలితం. తన సంపాదనేంటో భార్యకూడా తెలియదు. పరువు ప్రతిష్ఠలు నిలుపుకోవాలిగా. సంసారంమీద ఉండే మమకారం అలాంటిది." పై పంచెవేసుకుని "నడూ! రామయ్యా!" అన్నాడు.


నరసయ్య పొయ్యేసరికి మున్సబు లెఖ్ఖ రాసుకుంటున్నాడు చూడ్డంతోటే 'మంచం వాల్చరా!' అన్నాడు జీతగాడితో. "కూచో బావా!" అంటూ పారొచ్చే కాడలు మంచివి నాలుగేరి చుట్ట కాల్చుకోడానికి ఇచ్చాడు నరసయ్యకు రామయ్యకు. "నేను వచ్చిన విషయం నీకు తెలిసే ఉంటుంది బావా;" అన్నాడు నరసయ్య ఆప్యాయంగా పొగాకు పొర చీలుస్తూ. "అంతా రామయ్యతో చెప్పా! ఆ ప్రకారం కానీ!" అన్నాడు మున్సబు రీవిగా. "సరేలే బావా? తప్పేదేముంది? నీ ఇష్టప్రకారం పోతా" అన్నాడు నరసయ్య. అంటూనే తిలగుడ్డలోంచి తమలపాకులు తీసి 'వేసుకో బావా'



అంటూ చేతికిచ్చాడు శ్రుధాసానికి చిహ్నంగా. ముగ్గురూ ఆకులు వేసుకున్నారు మునిముసినవ్వులు నవ్వుకుంటూ. "శ్రావణంలో ముహూర్తాలున్నాయట. శాస్త్రుల్లు చెప్పాడు" అన్నాడు నరసయ్య తిరిగీ. 'నీ చెల్లెలితో మాట్లాడి నేనే కబురు చేస్తాలేవోయ్!" అన్నాడు మున్సబు. సెలవు తీసుకుంటా బావా! అంటూ లేచాడు నరసయ్య రామయ్యతో. మర్నాటికల్లా ఊరంతా పాక్కిపోయింది. "నరసయ్య మునసబుతో వియ్యమందుకో పోతున్నాడనీ, పది వేల కట్నానికి ఖరారు పడ్డాడనీ." ఇంత పడ్డదంటే అంతా పడ్డదంటుంది లోకం. వాడవాడలా మూలమూలలా ఇదే ముచ్చట. నీళ్ళరేవులో అమ్మలక్కలు ముక్కుమీద వేలేసుకున్నారు. "రావమ్మ అదృష్టవంతురాలు" అంటున్నారు అందరూ, రచ్చబండ మీద ముచ్చట్లు జోరుగా సాగుతున్నాయి. ఎవరి నోట విన్నా ఇదేమాట. 'నర్సయ్య కింత డబ్బుందా?' అనీ, 'పది వేలంటే మాటలా?' అనీ, 'అసలు ఎప్పుడు సంపాయించాడనీ, అందరూ విస్తుపోతున్నారు. చివరకీవార్త పక్కఊరిలో ఉన్న పుల్లయ్యశెట్టికూడా తెలిసింది.

పూర్వం నరసయ్యతండ్రి పుల్లయ్యశెట్టి దగ్గర కొంత సొమ్ము బాకీ తీసుకున్నాడు. అక్కడే ఖాతాపెట్టి ఇంటికొక్కవలిసిన సామానంతా తెచ్చుకునేవాడు. పంటలేని ఏడు మరి కొంత వాడుకునేవాడు. అమాంబాపతు పదిహేను వందలదాకా తేలింది. పద్దు వ్రాశీ సంతకం చేయించుకున్నాడు శెట్టి రూపాయీ అర్థణావడ్డీతో. అదే ప్రతిఏటా తిరుగుతూఉంది లెఖల్లో. నరసయ్యతండ్రి చనిపోగానే లెక్క ఉతారు తీసి ఒప్పందం వ్రాయించుకున్నాడు శెట్టి నరసయ్యతో. గట్టిపద్దు. వడ్డీ పెరుగుతూ ఉంది. అంతగా పేచీవస్తే రెండెకరాల 'కొంప' ఉందిగా! అనుకున్నాడు పుల్లయ్యశెట్టి. నరసయ్యదగ్గర పదివేలున్నాయనీ, మునసబుతో సంబంధం చేస్తున్నాడనీ, తెలియగానే శెట్టికి ఆశ్చర్యం కలిగింది. 'అమ్మో నరిసయ్యా! అంతవాడైనాడా?' అనుకున్నాడు. కాని అనుమానంగానే ఉంది. 'ఎందుకైనా మంచిది ఒకసారి వెళ్లితే' అనుకుని పాత లెక్కలు బయిటికి తీశాడు. వడ్డీ, లెక్కవేసిచూస్తే అసలు ఫాయిదాలు అయిదు వేలుదాకా తేలింది. ఆలస్యం చేయకుండా దస్త్రంచంకనిబెట్టుకుని బయలుదేరాడు శెట్టి నరసయ్య దగ్గరికి. బండివచ్చి నరసయ్య ఇంటిముందు ఆగింది. సరాసరి లోపలికి వెళ్లాడు శెట్టి 'నరసయ్యబావ ఉన్నాడా అమ్మాయ్?' అంటూ. లోపలినుండి సీతమ్మ 'ఎప్పుడొచ్చావు అన్నయ్యా!' అంటూ బయటికి వచ్చింది. కాళ్లకు నీళ్లిచ్చి కట్లపీట వేసింది. 'ఆయన పొలంనుంచి వచ్చే వేళయింది అన్నయ్యా!' అంది సీతమ్మ. 'ఇల్లంతా మార్చారే' అన్నాడు శెట్టి గోడలవైపు చూస్తూ. 'లేదన్నయ్యా! ఈమధ్యనే బాగుచేయించాం' అంది సీతమ్మ తల తిప్పుతూ. 'మన అమ్మాయి రావమ్మకదూ! గుర్తుపట్టలేక పోయినా!' అన్నాడు శెట్టి గుడ్డలు కుట్టున్న రావమ్మను చూపిస్తూ. సీతమ్మ నవ్వుతూ 'పెద్దదయిందికదూ' అంది. 'సొమ్ముకూడా చేయించినట్లుంది' అన్నాడు శెట్టి తిరిగీ ఆశ్చర్యం కనపరుస్తూ. 'ఈమధ్యనే పెండ్లి ఖాయపర్చుకున్నాం. ముక్కులకూ, చెవులకూ, లేకపోతే బాగుండదనీ.....'అంది సీతమ్మ సందేహిస్తూ. ఇంతలో నరసయ్య వచ్చాడు. శెట్టిని చూచి 'ఎప్పుడొచ్చావు బావా?'అన్నాడు కాడి మూలన పెడుతూ. 'కాసేపయిందోయ్!' సమాధానం చెప్పాడు శెట్టి చుట్ట కాలుస్తూ. 'బావగారు పనిమీద వచ్చినట్టున్నారు.' అన్నాడు నరసయ్య శెట్టి చేతిలో దస్త్రం చూస్తూ. 'నీకు తెలియందేముందోయ్?' అన్నాడు తిరిగీ శెట్టి నవ్వుతూ. 'అన్నట్లు బాకీ...ఎంతయిందో తేల్చండి. సొమ్మిస్తాను. నేనే కబురు పంపుదామనుకున్నా. రావమ్మ పెండ్లి సంబంధాల్లో పడి సుస్థి జరిగింది!'అన్నాడు నరసయ్య తలగుడ్డ దండెంమీద వేస్తూ. శెట్టికి హడలు పుట్టింది, ఈ హంగామా అంతా చూచి. నరసయ్య ముఖంలో వెనుకటి విషాదరేఖలు లేవు. ఆ రీవి, ఆ మాటల ధోరణీ చూస్తే తాను విన్నది అబద్ధం కాదనుకున్నాడు శెట్టి సొమ్ము బాగా కూడింది. వడ్డీ పోగొట్టుకోవడ మెందుకు? అనుకున్నాడు మనసులో. 'నీకేమోయ్! బంగారంవంటి పద్దు. నీ బాకీవిషయంలో నాకు భయం ఎప్పుడూ లేదు. పిల్ల పెండ్లి కానీయి. నాకేం తొందర? చేతులో డబ్బుంటే ఎందుకైనా మంచిది. నే వెళ్లొస్తాను' 'అంటూ లేచాడు శెట్టి. 'మజ్జిగయినా పుచ్చుకోకుండా పోతావేం అన్నయ్యా!' అంది సీతమ్మ లోపల్నుంచి! 'నారయ్యతో పనుండి వచ్చానమ్మాయ్. మళ్ళీ వచ్చినప్పుడు విశ్రాంతిగా ఉంటాలే' అంటూ బండెక్కాడు శెట్టి.

ఆషాఢమాసం వెళ్లిపోతున్నా పొలాల్లో చినుకులేదు. ఊరంతా గగ్గోలుగా ఉంది. విత్తనం ఎట్లా వేసేది? అదను మించిపోతూ ఉంది. కూలిజనం అల్లాడుతున్నారు. పొలాల్లో పనుల్లేవు. కుండల్లో మెతుకు లేదు. ఏంచేస్తారు? కూడగట్టుకుని ఉన్న వాళ్ళ వాకిళ్ళల్లో కూర్చుంటున్నారు. నరసయ్య 'కొండను' దున్ని సిద్ధంగా ఉంచాడు. వర్షం పడడమే తరవాయి. కాని దేవుడికి దయ గలగలేదు. ఊళ్ళో గలభా అంతా చూస్తే భయం వేస్తున్నది నరసయ్యకు తనకేం మునుగుతుందో అని. పాతరనిండా గింజలున్నాయి. పదివేల రొఖ్ఖం ఉందని పడమటి వీధంతా ఏక



స్తున్నారు. ఎవర్నని అపడం? పెళ్ళెందుకు తలపెట్టాసా? అనుకుంటున్నాడు ఇప్పుడు నరసయ్య. అనుకున్నంతా అయింది. వడ్డెరపాలెం వచ్చి కూచుంది నరసయ్య ఇంటిముందు కాళ్లు పట్టుకుని కదలనివ్వడం లేదు. మునసబు కబురుచేశాడు. 'రేపు కోతల్లో, పంట నూర్పిళ్ళలో తీర్చుకుంటారు గింజలు కొలవాల్సిందే' అని తీర్పు చెప్పాడు మునసబు. నరసయ్య గుండెలు దడదడ కొట్టుకున్నయి వరసగా జనాన్ని కూర్చోబెట్టి గింజలు కొలిచాడు ఖరామానికతో. పాతర ఖాళీ అయింది. ఆ పాదమస్తకం చెమట పోసింది నరసయ్యకు. ఆయాసంకూడా వచ్చింది. అన్నంకూడా తినకుండా పక్కమీద కొరిగాడు. సంసారం,సంపాదన, వీట్లమీద అతనికుండే మమకారం ఆరాత్రంతా నిద్దర పట్టనీయలేదు. కన్ను మూయకుండా జాగారం చేస్తూ కూర్చున్నాడు.

తెల్లవారింది. మాదిగపాల్లో 'మహమ్మారి' వచ్చిందని గ్రామంలోకి కబురు. నరసయ్య నమ్మలేకపోయాడు. చెంబు తీసుకుని 'పాటి' వైపు వెళ్లాడు నీరసంగా. జనం ఉరకలు పెడుతున్నారు. పెద్దోడింట్లో ఇద్దరికి తగిలిందనీ, అప్పుడే ఒకడు చచ్చాడనీ, చెపుతున్నారు. వణుక్కుంటూ ఇంటికి వచ్చాడు నరసయ్య. ఊరంతా పాక్కిపోయింది. మునసబు రిపోర్టు పంపాడు తాలూకాకు. మర్రోజే హెల్తుఇన్‌స్పెక్టరు, వాక్సినేటరు వచ్చారు ఇంటింటికీ తిరిగి ఇనాకులేషన్, చేశారు. ఫలితం శూన్యం. తూరుపు బజారున ముగ్గురు, వడ్డెరపాల్లో ఒక కుటుంబం నాశనం అయింది. నరసయ్య చూస్తుండగానే పక్కింటి రామయ్యకు తగలటం ప్రాణం వదలటం, జరిగింది. నరసయ్య బయటికి రావడమే లేదు. 'మహమ్మారి' రావడం మళ్ళీ బ్రతకటమా? అంటున్నారు అందరూ. 'అమ్మవారికి కోపం వచ్చిందేమో? ఎన్నడూ లేదు. ఏవిటీ పీడ ఈ ఊరికి' అన్నారు మరి కొందరు. నాలుగురోజులు సద్దుమణిగింది. తిరిగీ రచ్చబండమీద ముచ్చట్లు ప్రారంభమైనాయి. రైతులంతా కూడుతున్నారు. 'కొండమీది గంగమ్మకు' కొలుపు చేయాలంటున్నారు. చివరకు కూడబలుక్కొని మున్సబు దగ్గరి కెళ్లారు రైతులంతా. 'చాలా పెద్దపని. బోలెడు డబ్బవుతుంది. యాటలు తెగుతయి.' అన్నాడు మునసబు సందేహిస్తూ. 'గ్రామం క్షేమం కోరి అయినా 'కొలుపు' చేయాల్సిందే' అన్నాడు. పెద్దకాపు. 'డబ్బో' అన్నాడు తిరిగీ మునసబు. 'ఉన్నవాళ్లను పెట్టమనండీ! పంట వచ్చింతర్వాత లెక్కలు వేసుకోవచ్చు వంతుల ప్రకారం' అన్నాడొక యువకుడు 'ఉన్నాడుగా నరసయ్య పదివేల సంచితో. గ్రామానికి ఉపకారమైనా చేయకుండా ఏంచేస్తాడు?' అన్నారు మరి కొందరు. 'సరే అడుగుదాం' అన్నాడు మునసబు. నరసయ్యను పిలిపించి విషయమంతా చెప్పాడు. తప్పించుకోలేక తలఊపాడు నరసయ్య. 'మొగుడికి మతిపోయిందా ఏం' అనుకుంటూ ఉందిసీతమ్మ.

ఉదయాన్నే తప్పెట్లు మోగినయి. ఇంటికొక బండి కట్టారు, బండ్లముందు కుంభంపోశారు. ఈరణాలతో, ఈరంగాలతో, బ్రహ్మాండంగా బయలుదేరింది ఊరేగింపు. కొట్టిన కొబ్బరికాయలకూ, కోసిన నిమ్మకాయలకూ లెక్కలేదు. నర్సయ్యబండి ముందు నడిచింది. కొండచుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసినయి బండ్లన్నీ. గంగమ్మ ముందు యాటలు తెగినయి. ఖడ్గాలు చదివారు. కథలు చెప్పారు. మూడురోజులూ 'జాతర' కోలాహలంగా జరిగింది. నాలుగోరోజు అన్నదానం. ఊరబంతి పెట్టారు. నరసయ్య నడుంకట్టి వడ్డించాడు. దేవుడు కరుణిస్తాడని ఆశపడ్డాడు. అన్నం తింటూనే 'అయ్యా ఒళ్లు నొప్పులుగా ఉన్నయి' అన్నాడు రవణయ్య తండ్రితో. 'నిద్రలేక లేరా' అన్నాడు నరసయ్య అమాయకంగా. రవణయ్యకు పొంగులతో జ్వరంవచ్చింది. చూస్తుండగనే చంకల్లో బొబ్బ లెక్కినయి. ఎగిరిపడి ప్రాణం విడిచాడు రవణయ్య. జాతర చేయించుకుని నరసయ్య కొడుకుని బలి తీసుకుంది గంగమ్మదేవత. మొదలు కొట్టిన చెట్టులాగా కూలిపోయినాడు నరసయ్య. కడుపుదుఃఖంతో సీతమ్మ క్రుంగిపోతూ ఉంది. స్పృహ లేకుండా పడిఉంది. రావమ్మ 'అన్నా' అని ఏడ్చింది. మునసబు వచ్చి ఆదరించి పోయినాడు.

మూడోనాడు పడ్తూ పడ్తూ లేచాడు నరసయ్య. రెండుమూడుసార్లు వాంతులయినయి. కొరంలోనే దొడ్డి కెళ్లాడు. పడబోతుంటే పట్టుకుంది సీతమ్మ. 'అట్లా ఉన్నావేం? అయ్యా!' అంది రావమ్మ. 'వళ్ళు మండుతున్నది' అన్నాడు నరసయ్య భారంగా. అరగంట తర్వాత నరసయ్యకు కళ్లు మూతలుపడ్డయి. సీతమ్మ మట్టిలోపడి పొర్లాడింది. ఏవైతేనేం? పండంటి సంసారం భగ్నమై పోయింది. మట్టిలో కలుస్తూ గూడా నరసయ్య మమకారాన్ని వదలలేక పోయాడు. ఎద్దులకు గాలికుంటు తగిలింది. ఒక్కరైనా ఆదరించలా. ఇంట్లో గింజ మిగల్లేదు. తెచ్చుకోడానికి రాగిదమ్మిడీ లేదు. ఏవైంది మొగుడు సంపాయించిందంతా? గింజలు కొలిచాడు. కొలుపులకు ఎంతయిందో? ఎవరిదగ్గర ఎంత రావాలో? సీతమ్మగుండె చెరువయింది. రావమ్మ దిగులు పడుతుందని దుఃఖం ఆపలేక ఆపుకుంటున్నది.

పది రోజులయినా గడవలా. ఎట్లా తెలిసిందో శెట్టికి. గాభరాగా వచ్చాడు బండి కట్టుకుని. 'చాలా అన్యాయం జరిగింది అమ్మాయి.' అన్నాడు సీతమ్మను చూచి. సీతమ్మ తలవంచి సమాధానం చెప్పలేదు. "ఆ బాకీ పరిష్కారం చేస్తారేమో' అని వచ్చాను' అన్నాడు శెట్టి తిరిగీ. సీతమ్మ కళ్లు జ్యోతుల్లా అయినాయి. 'మా అయ్యల్ని మహమ్మారి మింగింది. మా సంపాదన ఊరు మింగింది. ఇక మేమే మిగిలాం తీసుకుపో' అంది సీతమ్మ రుద్ధకంఠంతో. ఇప్పుడు తప్పితే బాకీ రాదని నిశ్చయించుకొని శెట్టి నట్టింట కూర్చొని దస్త్రం తెరిచాడు. ★

ఎకానమీడ్రైవ్

ఇందిర & జ్ఞానరత్నం

మా గృహరాజకీయాల్లో గూడా దేశరాజకీయాల్లోమల్లే ముఠాతత్వం ప్రబలింది కాబోలు ఆరోజు బడ్జెటు చర్చ తీవ్రరూపం దాల్చింది. మా గృహ మంత్రి వర్గానికి మావారు ప్రధానమంత్రియే కాకుండా ఆర్థికశాఖనుగూడా తమ దగ్గరే వుంచుకొని ఈయేటి బడ్జటులో ఆక్షేపణకరమైన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇక చర్చ చాల తీవ్రంగా వుందంటే వుండదూ మరి. నామట్టుకు నేను ప్రతిఘటించక తప్పలేదు. ముఖ్యంగా అందులో ఖర్చులు తగ్గించుకొనే భాంశంమీద నేను నా అసంతృప్తిని తెలియపర్చక వుండలేకపోయాను. మా ఆర్థికనిపుణులూ వారు పట్టిన భల్లూకపు పట్టు విడిచేటట్టులేరు. ఇదంతా చాలా రభస తెస్తుందని చప్పున గ్రహించిన మా అత్తగారు మావారు ఛేర్మనుగాను, నేనూ, మా అత్తా మెంబర్లగాను ఒక సెలెక్టుకమిటీ ఏర్పాటు చేయాల్సినట్లుగా తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మేమూ చేసేదేమీ లేక అందుకు ఓటుచేయక తప్పిందిగాదు. ఈ తీర్మానికి వ్యతిరేకంగా మా ఇంట్లో ఓటు చేయడానికి ఎవరికీ ధైర్యం చాలలేదు.

సెలెక్టుకమిటీ సిఫార్సులనుకూడా మా అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించి వూరకుంది. ఇంకేముంది? ఛేర్మనుగారు సూచించినట్లుగా మాఇంట్లో కాఫీపొయ్యి చల్లార్చాలి. కాఫీ అంటే నేను అమృతప్రాయంగా ఆదరించినా, ప్రజాసామ్య సిద్ధాంతాలకు కట్టుబడిన నేను ఈ కొత్త ప్రతిపాదనకు ఎలాగో వోలాగు ఒప్పుకోక తప్పలేదు. ఈ విషయంలో నా త్యాగబుద్ధిని నేను కొనియాడుకొని చప్పట్లు తట్టేవాళ్లు ఎవరూ లేకపోగా......వూరకున్నాను. ఇంక రెండో సూచనకూడా, నేను సూచించినట్లుగా మావారు సిగరెట్ల మీద డబ్బు తగలెయ్యడం మానాలి. సిగరెట్లపిచ్చిలో మావారు అగ్రశ్రేణికి చెందినవారయ్యి నాలాగే త్యాగబుద్ధితో అందుకు ఒప్పుకున్నారు. మా అసెంబ్లీ ప్రెసిడెంటుగారైన మా ముసలిముత్తవ్వ మాకు *Oath* అడ్మినిస్టరు చేసింది. ఈ రెండు సూచనలను మేము హృదయపూర్వకంగా అమలు పెడుతామని ప్రమాణం చేశాము. మా దంపతులిద్దరికీ ప్రమాణాలమీద పిచ్చినమ్మకం. ఇహ చచ్చినట్లు మేము మా బాధలు పడాలి. ఒకరిమొహాలు ఒకరు చూచాము. 'సరోజా!' అన్నట్లుగా మావారూ, 'ఏమండీ' అన్నట్లుగా నేనూ, ఒకరినొకరు మౌనంగా పరామర్శించుకొని అసెంబ్లీని వాయిదా వేసుకున్నాము.

ఆరోజే ఏప్రెల్ 1వ తేది. బడ్జెటు అమలులోకొచ్చేసింది. మామూలు ప్రకారం వుదయమే వేకువతో నిద్రలేచి కుంపటి రాజేశాను. నీళ్ళు తెర్లబెట్టాను. తీరా కాఫీపొడి లోటాలో వేసుకునేటప్పటికి మా గృహ పోలీసు హాజరు. మావారు గుడ్లెర్రజేశారు. కాఫీపొడి మురికిగుంటలో పారబోశారు. కోపంలో ఎంత పనైనా చేస్తారు. క్షమాపణ వేడుకున్నాను. సివియర్ వార్నింగుతో నన్ను లెట్ ఆఫ్ చేశారు. ఆ రోజంతా పాడు తలనొప్పితో బాధపడ్డాను. అన్నం అసలు సయించనేలేదు. సాయంత్రం అయ్యేటప్పటికి ఒళ్ళంతా నొప్పులు...చలి...జ్వరమూ... దుప్పటికప్పుకొని పరున్నాను. నా ఒళ్లు నాస్వాధీనంలో లేదు. పిచ్చి పిచ్చిగా వాగుతున్నాను.

తలుపు చప్పుడైతే తిరిగి చూశాను. ఇదేమిటి? మా వారు అలా ముఖంలో కళ లేకుండా తూలిపోతున్నారు. 'అబ్బా' అని తలబాదుకుంటూ ఈజీ ఛైరులో వాలిపోయారు. చేసుకున్న భర్త అలావుంటే భారతనారీమణి ఎలావాపోతుందో మీకు తెలీదూ?

మెల్లగా లేచి వారి పాదాల ముందు పడ్డాను. వారు రెండు చేతుల్తో లేవనెత్తారు. ఆ చేతుల్లో వేడి చూచి వారు గాభరాపడ్డారు "ఇదేమిటి, సరోజా... ఎప్పటినించి నీకు జ్వరం...చెప్పావు కాదే" ఆతృతతో అడిగారు.

"మధ్యాహ్నం నించి"

"డాక్టరును పిలవనా?"

"ఇది జబ్బయితే కదా?"

"మరి..."

"..... ...."

"ఏమిటి మాట్లాడవు?"

"బ...డ్జె...టు"

నాలోని బాధ అర్థం చేసికొన్నారు కాబోలు.

"మరి కాఫీ లేక..."

తలవంచుకున్నాను.

మావారు ఫక్కున నవ్వారు.

"పోనీలే...సరోజా...సప్లిమెంటరీ బడ్జెటు ప్రవేశపెడదాంలే...నీ ఆరోగ్యంకంటేనా?"

ఇలా అంటూనే స్పృహ తప్పి పడిపోయారు. కాస్త ముఖాన్ని చన్నీళ్లు చల్లేక తేరుకున్నారు.

"ఇదేమిటండీ...ఇందాక తలనొప్పి అన్నారు...ఇప్పుడిలా పడిపోయారు... ఒరేయ్ మునుస్వామీ...ఇలారా"

"అలాంటిదేమీ చేయకు సరోజా... నాకు ఒంట్లో జబ్బంటేగా!" నావైపు అదోలా చూచారు.

"మరి......"

"..............."

"సి...గ...రె...ట్టు" ఇంతలో మునుస్వామి వచ్చాడు ఏమనుకున్నారో ఏమో! మునుస్వామిని దగ్గరికి పిలిచి చేతిలో అయిదురూపాయలనోటు పెట్టారు.

"నీవు బజారుకెళ్లి కాఫీపొడీ, సిగరెట్లూ పట్టుకరా" మునుస్వామి వెళ్లిపోయాడు.

పోలింగు డ్యూటీ

శ్రీ పండితారాధ్యుల పరంధామయ్య

ఆచార్యులవారు చెయ్యివిరిగిన కుర్చీలో కూర్చొని తన తరగతికి సహారా యెడారిని గురించి పాఠం చెపుతున్నాడు. కాని అతని మనసేమీ బాగాలేదు. ఏదో తెలియని బాధ అతని కంఠాన్ని నొక్కినట్టు ఫీలుగావటం-ఆటోమాటిక్ గా అతని వాక్ ప్రవాహం ఆగిపోవటం జరుగుతూ వుంది. పంతులుగారు అన్యమనస్కులు గావటంతోటి పిల్లలు వొకరినొకరు గిల్లుకుంటూ - తోసుకుంటూ అల్లరి ప్రారంభించారు. కాని ఆచార్యులవారు ఈ బడి హద్దులు దాటి చాలా దూరం వెళ్లాడు.

"నా జీవితం కూడా ఈ ఎడారిమాదిరిగానే వుంది. సహారాలో ఒయసిస్సులన్నా వున్నయి. కాని నా జీవితంలో సుఖపడ్డ సమయం వకటి కూడా లేదు. మూలైనక్కపై తాటికాయ పడ్డట్టు యీ పోలింగు డ్యూటి వకటి - తాను కొంప దగ్గరుంటేనే ఈ కష్టపు రోజుల్లో గడవటం అంతంతమాత్రంగా వుంది. ఏంచేస్తాం - పోవాలి ఎలెక్షను. అర్జెంటు అని వుండెనే. పోయి తీరాలి. సాయింత్రంలోగా ఎక్కడన్నా బియ్యపు నూకలు సంపాదించాలి. సరే! ఏలాగో సంపాదిస్తాం. చార్జికి డబ్బులెట్లా! ఏలాగో చార్జి డబ్బులు సంపాదించినా అక్కడెవరు ధర్మతిండి పెడతారు. తిండికి చావాల్సిందేనా? పోలింగు డ్యూటికి పోవాలంటే కనీసం పదిరూపాయలన్నా వుండాలి. కాని తన చేతిలో పదిదమ్మిడీలు కూడా లేవు. ఎవరి నడుగుదాం ఎవరిస్తారు." ఆచార్యులవారు కృంగిపోయారు. నీరసంతో కుర్చీయొక్క విరిగిన చేతిపై తన శరీరభారాన్ని కొంచెం వేస్తూ వెనక్కి జేరగిలబడ్డాడు. మరుక్షణంలో కుర్చి చేయివీడి క్రిందబడటం - క్రిందబడే వూపును తాను తట్టుకోటం - వక్కసారే జరిగాయి. దాంతో తాను తన క్లాసులో తన కుర్చీలో వున్నట్లు - పిల్లలు గలభా చేస్తున్నట్లు ఒక్క తృటిలో ఆచార్యులవారు గ్రహించగలిగారు. అతనికి ముచ్చెమటలు పోసినై. తనపై - యెప్పుడూ చాడీలు చెప్పే గురవయ్య హెచ్ - యమ్ దగ్గరికి పోయి వుండడుగదా! ఛూత్ అంటూ కుర్చీలోనుంచి యెగిరి బెత్తాన్ని ఝుళిపిస్తూ - గగ్గయ్యపోజ్ లో పిల్లలపైకి పోయాడు. పంతులుగారు వున్నట్టుండి ఉగ్రనరసింహావతారాన్ని దాల్చటం పిల్లలకు కించిత్తు భయాన్నే కలిగించినా - అంతో యింతో వింతనుకూడా సృష్టించింది. "వెధవల్లారా నే నుండగానే అల్లరి"- "వీడు గిల్లాడు సార్' - "వీడు మొట్టాడు సార్." మరల గలభా - "ఛట్ - నోరుమూయండి. పలకలు తీసుకొని - సహారా యెడారిని గురించి పదిమాటలు వ్రాయండి - ఊ - తీసుకోండి - క్విక్."

"పలకలమీదనా? పుస్తకాలమీదనా సార్?"

"సహారా అంటే ఒంటెనుగురించి గదా సార్?"

"సైలెన్స్ - వుత్తవెధవలు నోరుమూసుకొని వ్రాయండి - సహారా యెడారిఅంటే యేమనుకున్నారు? ఒక పెద్ద యిసుక మైదానము - చెట్టు - చేమా - నీరూ - పక్షులూ - యెక్కడా వుండవ్. అక్కడక్కడా ఒయసిస్సులుంటాయ్. కొంతమంది గుడారాల్లో అక్కడే కాపుర ముంటారు. మనం తినే ఖర్జూరం అక్కడ పండుతుంది. ఒంటెలమీద ప్రయాణం మొదలైన విషయాలు వ్రాయండి. ఊ - త్వరగా -"

పంతులుగారు కుర్చీని మరమ్మతుచేసి కూర్చొని మరల తన ఆలోచనలలో మునిగిపోయారు. ఇంతలో బెల్ అయింది. ఆచార్యులవారు కూడా మెల్లక్కని యింటికి బయలుదేరారు. దారిలో వారి కింకొక సందేహం వొచ్చింది. పోలింగ్ డ్యూటీకి వెళ్లేటప్పుడు కొంచెం శుభ్రమైన బట్టలు వేసుకొని వెళ్లాలి. చాకలివాడు తెచ్చాడో లేదో? లేకుంటే యీ జీర్ణవస్త్రధారణే శరణ్యమా! ఆచార్యులవారు తన దుస్తుల వైపు దీనంగా చూచుకొని ఒక నిట్టూర్పు విడిచాడు. వీధి అంచునే - మొండిగోడల ప్రక్కగా - కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరాడు.

పంచలో కుక్కిమంచం. ఆచార్యులవారు గోడకు తలానించి, యీజీచెయిర్ వాటంలో పడుకున్నాడు - దాహం వేసినట్టుంది. ఇంట్లోకి పోయే వోపిక లేదు. భార్యను కేకవేశాడు—"ఏయ్! యెక్కడున్నావ్ - మంచినీళ్లు కావాలి" లోపల పిల్లల యేడ్పులు - కామేశ్వరి కసురుకోవటం - ఆచార్యులవారికి వినపడుతుంది

అయిదు నిమిషాల్లో మా క్యాబినెట్టు అత్యవసర సమావేశంలో ఈ *Issue* మీద రాజీనామా ఇచ్చింది. మళ్లీ అప్పటికప్పుడే ఎన్నికలు జరిగాయి. కాఫీ కలవాటుపడ్డ జీవాలు, పొగకుపడిచచ్చే జీవాలు మా గృహప్రాంగణంలో వుండడంచేత, మా క్యాబినెటు మెంబర్లు ఇదివరకున్న ఎక్కువ మెజారిటీతో *Return* అయ్యారు.

ఇంతలో మునుస్వామి తిరిగొచ్చాడు. ఆర్థిక మంత్రిగారి గౌరవార్థం ఒక విందు ఏర్పాటుచేసుకున్నాము. "ప్రజాస్వామ్యానికి జై" అనే కేకలు మిన్నుముట్టాయి...

ఏమిటే నీకేకలు అని మావారు నాపలవరింపులు విని కాబోలు అడుగుతుంటే నేనేమి సమాధానం చెప్పేది మీరే చెప్పండి. ? ★

"ఏమేయ్ - నీకే చెప్పేది - గొంతెండి పోతోంది - మంచినీళ్ళు" లోపల సంచలనం - పిల్లలు కదిలిన చప్పుడు - కామేశ్వరిమాట వినపడ్డది. "నాకు పని తీరలేదు..."

ఆచార్యులవారు అతికష్టంతో లేచి యింట్లోకి రాబోయాడు. అతని నాలుగేండ్ల కుమారరత్నం - రెండుసంవత్సరాల పుత్రికామణి - వాకిట్లో అతనికి అడ్డుపడ్డారు. "నాన్నా! అమ్మకొట్టింది"... "నాన్నా-ఆ-ఆ-" పిల్లవాడి చేయిపట్టుకొని కూతురును యెత్తుకొని, యింట్లోకి బయలుదేరాడు. "నాన్నా బిస్కత్తుపెట్టవూ?" "రేపు తెస్తానులే" అంటూ మంచినీళ్లు త్రాగి కూరతరుక్కునే కామేశ్వరితో "ఏమేయ్! వాణ్ణి కొట్టావుట?"

"యేం చేయమంటారూ! ఒకటేఆగం. వెధవకు ఉష్టంగావున్నట్టుంది."

"యిదొకటా మళ్ళా, పాలూద్రిన్ వెయ్యి - ఆ-మరచిపోయినా - చాకలి గుడ్డలు తెచ్చాడూ?"

"వాళ్ళెందుకు తెస్తారూ? మీ పిచ్చిగాకపోతే! అవసరమని చెప్పటమూ-వాళ్లు తేవడమూ యెప్పుడైనా జరిగిందా?"

"మనకు అనవసరమంటూ యెప్పుడేడ్చింది! యెప్పుడూ అవసరమే - అంటుంటిమి. ఆ అవసరమంటిదే యిది కూడా అని అనుకొనివుంటారు. అయితే యీ మురికిపాతలతో బీగాలపల్లి వెళ్ళాలసిందేనా?"

"అయితే నన్నేమి చేయమంటారూ?"

"కొంచెం పులిమన్నా వెయ్ చెమట గబ్బుకొట్టకుండా"

"ఇచ్చేజీతం యిస్తూ చాకలపనికూడా నేనే చేయాల్నా?"

"చాకలపనేకాదు. కొంచెం కుట్టుపని కూడా!"

"మరేమన్నా అనండి - ఆ తూట్లన్నీ నేను కుట్టలేను. ఆ పంచ-గోరు తగిల్తే నే చినిగేట్టుంది. కుట్టినా ప్రయోజనం లేదు-"

"పోనీ - ఆ చొక్కానన్నా - వెధవది జోబీవద్దనే చినిగింది."

"యీపిల్లల్తో అసలే వేగలేక చస్తున్నా- ఇక మీకు కూడా అమర్చాలంటే నా ప్రాణం పోయేట్టుంది."

"సరే - యెలాగో - యేం చేస్తా మిక - నాకు ట్యూషన్ టైమయింది. లేకపోతే చాకలిమనిషికొరకు యెవరినైనా పంపుతావూ?"

"మాస్తూ అలా అంటారేమిటి? నాకెవరన్నా నవుకర్లున్నారు గనకనా? - యెవర్నన్నా పిల్లల్ని పంపించండి"

"పిల్లల్నే! యీ వూళ్ళో వుండదల్చుకుంటే ఆ మాట మాత్రం మరలా అనకు. మొన్న గురవయ్యను చితకబాడిచి పొయ్యారు, పిల్లలకి పని చెప్పవద్దని."

"అయితే మీ గవురవం మాత్రం—"

"యేమాత్రం సూదిమొనంత కూడా లేదు. బ్రతకటం యెప్పుడు బ్రహ్మాండమైన భారమైపోయిందో—గౌరవం దానంతటదే నలుసంత కూడా లేకుండా క్షీణించింది." ఈ మాట అంటూ ఆచార్యులవారు ట్యూషనుకు బయలుదేరాడు.

మరునాడు పొద్దున ఆచార్యులవారు ప్రయాణసన్నాహంలో వున్నాడు. చాకలి కూడా సమయానికి గుడ్డలు తెచ్చాడు. చొక్కాలో అక్కడక్కడా నీలిమచ్చలు కనిపించగా—కామేశ్వరి - "చూడండి - తెల్లటిగుడ్డపై యేలా మరకలు వేశాడో" అంది.

"పంచకు మాత్రం లేకనా - ఇదిగో— ఏంరా చాకలీ! పంచంతా బ్రష్టు చేశావ్. బలే పనోడివే"—

"అయ్యగారు తెచ్చే పంచలన్నీ అట్టగే నాశిరకంగా వుంటయ్. అంచులు వూరకేం జేస్తాయి. అదేమంటే నామీద యేస్తారు తప్పంతా- అంతమాత్రం పంచలో తెలుపు కనబడటమే మేలనుకోండి. ఇంకొకడైతే అద్దకం వేశినట్టు చేశేవాడే."

"ఏంరో! నన్నే దద్దమ్మకింద జమకట్టావ్. అసలు నీకీమధ్య కళ్ళు నెత్తికెక్కాయి."


"ఎక్కకేం జేస్తాయిలెండి - మీరిచ్చే రెండు రూపాయల భాగ్యానికి బలేతోమడుతుండారే - నా లెఖ్ఖ చూసి సెటల్ జేసెయ్యండి—ఈమాటలన్నీ నేను పడేవోణ్ని కాదు"

"అది కాదులేరా-వూరికే నీవు కూడా లేనిపోని అరుస్తావు. అయ్యగారికి ప్రయాణాలకుండే పంచ అదొక్కటే- దాన్నే నీవు అంచులు వూరబెట్టుకొస్తివి."

"అదుగో,- నీవు కూడా అట్టంటే ఎట్టమ్మ - అది నాతప్పు కాదమ్మాఅంటె-"

"సరె - పోరా - ఏమిటీ లేని పోని రచ్చ—"

ఆచార్యులవారు భార్యవైపు చూస్తూ పోతానన్నట్టు తలవూపాడు. పక్కచుట్ట చంకలో యిరికించుకొని వూరుదాటి డొంకన బయలుదేరాడు. బస్సు పొయ్యే రోడ్డు రెండుమైళ్లకు పైగా వుంది. అరగంటలో రోడ్డుకొచ్చాడు. పక్కచుట్ట చెట్టుమొదలు కొనించి మర్రిచెట్టుక్రింద కూర్చున్నాడు. అరగంట తర్వాత బస్సు వచ్చింది. అయితే దాంట్లో సీటులేదు. రెండవబస్సులో క్రింద కూర్చొనేపనైతేనే సీటిస్తానన్నాడు కండక్టరు పంతులుగారి దీనచరిత్ర విని. ఆచార్యులవారు వొప్పుకున్నారు. పక్కచుట్టవేసి దానిపై కూర్చున్నాడు. అతని వెనుక సీటులో ఇదరి పిల్లలతో సహా వక మధ్యవయస్సు స్త్రీ కూర్చొనివుంది. ఆ పిల్లలు పదే పదే పంతులుగారిపై కాళ్ళు ఆనించటం ప్రారంభించారు. ఆచార్యులవారు కసరినా వాళ్లు భయపడలేదు. బడిలో అయితేనా...? ఈమారు కాలానిస్తే గిచ్చుదామనుకున్నాడు. కాని అతనికి ధైర్యంచిక్కండి కాదు. బస్సుదిగిన తర్వాత చొక్కా చూసుకుంటే అర్ధచంద్రాకృతిగా ఎర్రటి మచ్చపడివుంది వీపుమీద.



బీగాలపల్లెకు మరల నడక సాగించాడు. కడుపులో ఆకలి దహించుకుపోతోంది. ప్రొద్దు నెత్తిమీద కొచ్చింది. యెండ చుర్రుమంటోంది దురదృష్టవశాత్తు చెప్పు గూడు తెగింది. ఒక చేత్తో పక్క చుట్టా - రెండవచేత్తో చెప్పులు. ఆచార్యులవారు మహాభారంతో నడకసాగించారు. ఒంటి గంటకు బీగాలపల్లికి చేరాడు. గమిట్లో వున్న యింటికెళ్ళి ఒక చెంబెడు మంచినీళ్లు త్రాగి - పోలింగ్ స్టేషను వెతుక్కుంటూ వెళ్ళాడు. P. O గారు అప్పుడే భోంచేసి సీళ్ళపాకెట్లు విప్పుతున్నాడు. ఆచార్యుల వారు తనను పి. ఓ గారిక్కి యెరుకపరచుకొన్నారు. ఆవూరి మునసబు ఒక యింట్లో భోజనంయేర్పాట్లు చేశాడనీ పూటకు 0-12-0 లు అని కూడా పంతులుగారిక్కి తెలిసింది. ఆయింటిజాడ తెలుసుకుని వెళ్లాడు. కూరలు లేవట. ఒక్క పులుసు మాత్రమే వుంది. ఆచార్యులవారు పులుసుతోను - మజ్జిగతోను రెండుముద్దలు మింగి పండ్రెండణాలు సమర్పించి తనకు తిండిపెట్టినందుకు కృతజ్ఞత తెలిపాడు.

పి. ఓ. గారు ఎ. పి. ఓ, లను పోలింగ్ గుమస్తాలను సమావేశపరచి-పోలింగ్ నాడు యెవరెవరు — యే - యే - పనులు చేయవలెనో చెప్పి - యిద్దరు ఎ. పి. ఓ. లకు చెరిసగంగా పనిని పంచిపెట్టాడు. పంతులుగారు తన ఎ. పి. ఓ తోను, యింకొక గుమాస్తాతోనూ తన వాటా బాలెట్ పెట్టెలు - యితర కాగితాలతోను విడివడి-కాగితాలు పెట్టెలకు కరిపించటం వగైరా పనులను చేశారు. రాత్రి 10 గంటలకు పని పూర్తయింది.

భోజనాలయినాయ్. బూతుల్లోనే బెంచీలపై పక్కలుపరుచుకొని పడుకున్నారు. ఆచార్యులవారికి సన్నటి యిరుకైన బెంచీ దొరికింది. యేలాగో పండుకొని నిద్రకోసం పెనగులాడుతున్నాడు. ఒక 2 నిమిషాలు గడిస్తే వారికీ ఆపద కలిగేదికాదు. కానీ దురదృష్టం - రెండు W. P రైలు యింజన్లు ఒక్కసారిగా అరిస్తే యెలాంటి భయంకరశబ్దము వస్తుందో - అలాంటి శబ్దమే వినపడింది. పంతులుగారు త్రుళ్ళిపడ్డారు. ఇతరులకు కూడా తాత్కాలికంగా నిద్రాభంగమైంది. కానీ వారు మరుక్షణంలో నిద్రపోయారు. ఆచార్యుల వారిక్కిమాత్రం ఆ అదృష్టం పట్టలేదు. యీ భయంకరనాదం యెందువల్ల వుత్పత్తి అయిందో - కాస్త పరికించి చూచాడు. అది తనప్రక్కనవుండే మహాశయుడు పెట్టే గురకయని — అది తెల్లవారిందాకా తన నిద్రే వేధించగలదని-తలచి పంతులుగారు తల్లడిల్లిపోయారు. ఆ మహా ఆపదనుండి తప్పించుకొనే వుపాయం అతనికి యేమాత్రం కనపడలేదు. లేచి కూర్చుని ఒక బీడీ ముట్టించి - అగ్గిపుల్ల వెలుతురులో పక్కనున్న మహాకాయాన్ని వీక్షించాడు. తట్టిలేపుదామా...బిడియంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు. ఇంకెక్కడన్నా యీ భయంకరశబ్దము వినబడని సురక్షిత ప్రదేశాన్ని వెతకటానికి ప్రయత్నించాలనుకున్నాడు. గడియారం టిక్కు టిక్కుమంటూ చిన్నముల్లును వకటిపై చూపిస్తోంది. టవలు మెడకు గట్టిగా చుట్టుకొని—పక్కమీదనుంచి లేచి - తలుపు తీశాడు. రివ్వుమంటూ చలిగాలి వీస్తోంది. దూరాన కుక్కలు మొరుగుతున్నాయ్. బయట పంచలో వెట్టివాళ్ళు పండుకొనివున్నారు. పంతులుగారు తలుపు ముందుకు లాగాడు. గురక వినబడుతుందా—? వినబడుతూ వుంది. అయితే రైళ్ళు ఢీకొన్నట్టుకాదు. పందికొక్కులు ఘర్షణపడ్డట్టు - పంచలో సాధ్యమైనంత దూరంపోయాడు. పర్వాలేదు. యిక్కడ పడుకోవచ్చు. కాని చలి - అతనికో ఆలోచనతట్టింది. లోపలికి పోయి బోర్డు తెచ్చి గుంజ కానించాడు. పక్క పరుచుకొని — నిద్రకుపూనుకున్నాడు.

ఆచార్యులవారికి మెలకువ వచ్చేటప్పటికి - వక పెట్రోమాక్సు లైటు - నాలుగైదు హారికేనులాంతర్లు, అయిదారుగురు మనుష్యులు అతనిచుట్టు వున్నారు. తన చుట్టూ యింత హడావిడి. పంతులుగారు పక్కమీద ఎగిరి కూర్చున్నాడు.

"లేవయ్యా పంతులూ, ఆరు కావస్తుంటే" ఆచార్యులవారు స్థిమితపడ్డారు. తాపీగా వారు పక్క చుట్టుకుంటూ వుండగా పి. ఓ. గారి మాట వినవచ్చింది. "బూతుల్లోకి వెళ్లండి. సీల్సు అవి తీసుకొని. ఆ. ఎ. పి. ఓ దగ్గరవుంటుంది."

ఆచార్యులవారు ముఖం కడగటం వగైరా కార్యక్రమాలను వక పది నిమిషాల్లో నెరవేర్చుకొని బూతులోకి వెళ్లాడు. సీళ్లు వేయడం, బ్యాలెటుపెట్టెలు అమర్చటంతో ఏడయింది.

అప్పటికే తండోపతండాలుగా వోటర్లు వచ్చారు. పోలీసుల ధర్మాన క్యూలో నిలబడి పెనగులాడుతున్నారు. పోలింగు ప్రారంభమైంది. కాని వక చిక్కు...లోపలికి పోయినవారు ఎంతకీ బైటకి రారు. బాలెటుపేపరు యిచ్చేప్పుడు త్వరగా రమ్మని వారితో చెప్పాలి. త్వరగా రమ్మని హెచ్చరిక - తర్వాత - ఏంజేస్తున్నావ్ లోపల. త్వరగా వేశిరండి-అని కేకలు - రెండు నిమిషాలు గడుస్తాయి. అప్పటికీ వోటర్లు రారు. ఇక లోపలికి పోయి వారిని బయటకు తీసుకరావాలి. ఏకొద్దిమందినో మినహాయిస్తే - మిగతావారితో యిదే గోల. మధ్యాహ్నానికి నూటపాతిక కూడా ఆచార్యులవారిబూతులో పోలు గాలేదు. క్యూలో నిలబడ్డ వోటర్లు అసెంబ్లీ క్లర్కైన మన పంతులుగారినే శాపనార్థాలు పెట్టారు. పాపం. చుట్టుప్రక్కల గ్రామాలనుంచి - వేకువనే - గంజినీళ్లైనా త్రాగకుండా బయలుదేరివచ్చి మధ్యాహ్నం దాకా క్యూలో - నెత్తి కాలుతుండగా కడుపు మాడుతుండగా - నిలబడ్డ వోటర్లు ఆచార్యులవారు పోలింగ్ స్టాప్ చేసి భోజనానికి పోతుంటె - తిట్లవర్షం కురిపించటం ఏమంత అసహజంగా లేదు. కాని ఆచార్యులవారికి వోటర్లమీద పట్టరాని కోపం వచ్చింది. గుంపుమీద విరుచుక పడదామా? అనుకున్నాడు. అయితే అతనిలోని భీరుత్వం వెనక్కులాగడంతో-"బడిలో అయితేనా" అని అనుకుంటూ - ఛీత్కారంగా - అగ్గిపుల్లను బర్ మని గీచి బీడి ముట్టించి పూటకూళ్లయింటికెళ్ళాడు.

అయిదుగంటలకు పోలింగు పూర్తయినా రాత్రి పదకొండుగంటలదాకా యితర చాకిరి చెయ్యాల్సివచ్చింది. లెఖ్ఖలు— ఫారాలభర్తి - కవర్లు కట్టడం - సీళ్లు - వగైరా - వగైరా...

ఆచార్యులవారికి రాత్రి అన్నంసహించలేదు. పొద్దుపోయింది. అన్నం నీళ్లు కారుతూవుంది. చారు పోసుకొని రెండు ముద్దలు మింగాడు. ఈరోజుమాత్రం పక్కవేసుకోటంలో మొదటనే జాగ్రత పడ్డాడు.

మరునాడు బస్సు ప్రయాణంలో పడరానిపాట్లుపడి—యింటికి వచ్చాడు. కామేశ్వరి బియ్యంలేక రాత్రిటి నుంచి పస్తని, పిల్లవానికి ఉష్ణం ఏమాత్రం తగ్గలేదని విన్నవించింది. పిల్లలు నాన్న నాన్న అంటూ చుట్టుకున్నారు. అప్పుడే మధ్యాహ్నం వంటిగంటయింది. పక్కచుట్ట దూరంగా విసరి - శోషవస్తున్నా - నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ - బియ్యం కోసం ఆచార్యులవారు వూరిమీదకు పోయాడు. ★

★ "నాలో నేను"

నన్ను గురించి లోకం యెంతో మథన పడుతున్నది. ఎందుకో నాకు అర్థం కావటం లేదు. ఎవరైతే నన్ను గూర్చి మథన పడుతున్నారో వాళ్ల దగ్గర కెళ్లి "ఎందుకు?" అని అడిగితే వాళ్ళు కూడా చెప్పలేరు. ఎంచేతంటే, నాలో ఏ లోపమూ లేదు. ఊరికనే ఉబుసుపోకకోసం అలా యిదవుతున్నారు. అంతే!

నేను పిచ్చివాడనట. 'నేను యెలా పిచ్చివాడనయ్యా(నా' అని అడిగితే పళ్ళికిలించి వెకిలిగా నవ్వుతారు. నన్ను గూర్చి ఏదో గొణుక్కుంటునే వుంటారు. ఆ గొణుక్కునేది ఏమిటో అని, ఓసారి, చాటుగావుండి విన్నాను. ఆ విషయం నాకంతగా నచ్చలేదు.

నేను నల్లగా, మసిబొగ్గు మాదిరిగా వుంటానట. తల తైల సంస్కారమూ, శరీరము స్నానమునూ, పాదాలు పాద రక్షలన్నూ—ఎరగవట. అందులో యేం సబబు వుందో నాకర్థం కావడం లేదు. నేను నల్లగా వుంటే వాళ్లకేం-తెల్లగా వుంటే వాళ్లకేం? - వాళ్లందరూ మాస్తుండగా స్నానం చెయ్యాలని యేశాస్త్రంలో వున్నది? నాకు యెప్పుడు తీరిక గలిగితే అప్పుడు, యేఅర్ధరాత్రిసమయమో, యే తెల్లవారు ఝామో—యెప్పుడో ఒకప్పుడు స్నానం చేస్తాను. చెయ్యకపోతే మాత్రం వీళ్లకేం?- వీళ్లఆరోగ్యం బాగుంటుందిగా-ఆమధ్యని జలుబు చేసిందని వారందినాలు స్నానం చెయ్యటం మానేసరికల్లా యీ గుసగుసలు బయలు దేరినయ్. ఖరీదుగల జోడు తొడగడం నాకిష్టం లేదు. అయినా అది మాత్రం శాశ్వతమా? యింతకీ జోడు లేనంత మాత్రాన నా పాదాలు కందిపోవు. 'కావాలని' అడగనూ అడగవు. యెందుకు ఖర్చుచెయ్యాలి? అలాగని బట్టలు తొడుక్కోడం మానేస్తానా? ఎప్పుడూ తెల్లబట్టలే తొడుక్కుంటాను - చాకలాడికి వేస్తే, వాడు సమంగా ఉతక్కపోవచ్చును. ఒకొక్కప్పుడు కైంకర్యం చెయ్యనూ వచ్చు. ఎందుకేనా మనజాగ్రత్తలో మనం వుండాలి గాని, చెయ్యి కాలిం తర్వాత ఆకులు పట్టుకున్నందువల్ల 'యేం లాభం? అంచేత, సన్‌లైటు సబ్బునో, అయిదువందల ఒకటో నెంబరు సబ్బునో ఉపయోగించి నేనే ఉతుక్కుని, ఓ గిన్నెలో యిన్ని నిప్పులు పోసి స్వయంగా యిస్త్రీ చేసుకుంటాను. యీపనులు వాళ్లకి కిట్టవు. అసలు గాంధీ మహాత్ముడు చెప్పింది యిదే కదూ! ఎవరి పనులు వాళ్లు చేసుకుంటే తప్పేముంది? యీ సిద్ధాంతాన్నే ఓసారి వాళ్లతో చెబితే, "చాలేవోయ్ - చెప్పొచ్చావ్—గాంధీకున్న పిచ్చిలో నీకూ సగం వుంది కాబోలు!" అంటూ ఎకసక్కెలాడారు. అయితే మట్టుకు వాళ్ళ మాటల్ని ఖాతరు చేస్తే కదూ-

నాజీవితం గూర్చి ఒకొక్కప్పుడు నాకే అదోలా వుంటుంది. గతాన్ని తల్చుకుంటూంటే గుండెలు (వీలిపోతయ్.

నాకు సరీగా జ్ఞానం రాకముందే పెళ్లి చేసేరు మావాళ్లు. అప్పుడు నాకు పదోయేడు. మా ఆవిడకి నాలుగోయేడు. పెళ్లి చెయ్యమని నేను పట్టుబడితే చేసే సేటట-అదెంత న్యాయం!—పోనీ ఆచేసిన వాళ్లు వూరుకో గూడదూ - అబ్బే! మానాన్న చచ్చిపోయే దాకా - యీ విషయమే అందరితోటీ చెప్పడం మొదలు పెట్టేడు. యిప్పుడు నాకు నలభయ్యో పడిదాటి యేభయ్యోపడి ప్రవేశించింది. యిప్పటి దాకామా ఆవిడ "మొద్దుతనం" వదల్లేదు. ఉతి రోగిష్టు మనిషి. ఏపనీ చెయ్యలేదు కదా!- జ్యేష్టాదేవితో సమానం: కాపరాని కొచ్చినతర్వాత రెండుసంవత్సరాల దాకా కూచున్న దగ్గరనుండి లేవడం మానేసింది, యేమంటే మానం యెదురయ్యేది. మా యింట్లో మా నాన్నకి వేలువిడిచిన అప్పచెల్లెలు వున్నది గాబట్టి సరిపోయిందిగాని లేకపోతే వంట సమేతం నేనే చేసుకో వలసి వుండేది. దాని ధర్మమా అంటూ యెలాగో మరో ఆరేళ్లకల్లా యిద్దరు ఆడపిల్లల్ని కనేసింది, అదే నా ప్రయోజకత్వమంటూ. ముఖాన ఆనందం, అందం-కోమలత్వం-యివేవీ కానరావు కద; - దాని మొహాన్ని 'నవ్వు' చూదామని, కొన్ని నెలలు-యింకా సంవత్సరాలు గూడా-చూ చేను. కాని ఫలితం లేకపోయింది. అసలు మాట్లాడ్డం కూడా యెరగను. యింతకీ తను అలా వుండానికి కారణమేమా అని నాలో నేను ఆలోచించాను-ఓమాటు వాళ్ళ వూరివాడు యెదురుపడి "ఎప్పుడూ-చిన్నప్పట్నుండీ అంతే" అనేశాడు.

పోనీ సంసారం గొడవన్నా పట్టించుకోదు. యెల్ల వేళలందూ తన కూతుర్ని ఒళ్లో వేసుకుని పాలిస్తూండడం తప్పితే, మరోటి నాకు కనబడ్డం లేదు. నా సంసారం యింతా అంతా కాదు. ఓపిల్ల జమీందారు కున్నంత ఆస్తి వున్నది యేటా మా స్వగ్రామం నుండి ఆరు గరిసెల ధాన్యమూ, ఉప్పు మినహాగా సమస్త రస వర్గాలూ, ఆరువేల రూపాయిలు శిస్తులూ వస్తయ్. యీ పట్నంలో నేను కొనవలసింది ఉప్పు బట్టలు తప్పితే మరోటేదీ కొన నక్కర్లేదు. యీ వూరొచ్చి, తాసిల్దారాఫీసులో టైపిస్టు గాజాయినయి, ఆ జీతపు రాళ్లతో యీ మేడ కట్టాను. అవునా, యింత ఆస్తినీ నేనొక్కడినెలా సరిచేసుకో గలను? భార్య విషయం చూస్తే అలా వున్నదాయె-పోనీ యింట్లో వున్న ముసలమ్మకి తాళాలిచ్చే ద్దామా అంటే-అమ్మో-పచ్చిదొంగ. ఓమారు నేను వారం రోజులు వూరువిడిచి మరోవూరు వెళుతూ తాళపు చెవులిస్తే, ఆరుపుట్ల ధాన్యం కా చేసి అడబ్బు పెరటి గుమ్మం దగ్గర పాతరేసింది. తరవాత తెలిసి కోగలిగాను. యింట్లోవున్న మా 'నాజమ్మ'న్నా కనిపెడు తుండేమో-అంటే-అబ్బే! అంత పాటా?-

మా ఆవిడ, కమ్మగా వండి, ఒక్క-

వాడన్నా భోజనం పెడుతుందేమో అంటే అంతపాటి అదృష్టమా నాకు ?!-వాళ్ల నాన్నగారు వచ్చినా అంతే-అలా స్తబ్ధులా వుండిపోడమే-అతన్నీ, మానాన్న ఫోటోనీ చూస్తుంటే యిద్దర్నీ అడాపెడా లెంపకాయలు కొట్టి యిక ముందెప్పుడూ యిలాంటి పెళ్లిళ్లు చెయ్యకండి అని ఉపదేశిద్దామన్నంత కోపం వచ్చేది.

యిక యెప్పుడూ కాలబత్తెం యివ్వాల్సి వుండేది. పది గంటలకి ఆఫీసు-వేగం వంట చెయ్యమని యేడు గంటలకల్లా సామానులు యిస్తేనే గాని లాభం లేక పోయేది. అలాగే సాయంకాలపు వంటకి ఆఫీసుకి పొయ్యేముందు సామానులు యిచ్చేవాడిని.

ఆ ముసలమ్మకీ, మా ఆవిడకీ తములపాకు లలవాటు. నాకు మహా చెడ్డకోపం-చెక్కలూ, ఆకులూ పూట పూటకీ యిస్తుండే వాణ్ణి. మహా దుబారాగా ఖర్చు చేసేవాళ్లు. ఎంత కష్ట మనిపించినా, దిగమింగుకొనే వాణ్ణి-ఓమాటు కోపం వచ్చి మూడు దినాలు నేనే వండాను. ఆమూడు దినాలూ యిద్దరూ, పిల్లలూ భోజనాలు మానేశారు. 'ఏమని' అడిగితే, అన్నం ఉడక లేదనో, కూర ఉడక లేదనో, పులుసులో కారం చాలదనో—యిలాగే అంటూ వుండే వారు. వాళ్లు భోజనం మాని పస్తుండి, చివరికి చచ్చిపోతే, ఆపాపం కూడా చుట్టుకుంటుందని మళ్లీ వాళ్ళ పెత్తనాన్ని అంగీకరించి వంటలోంచి విరమించుకున్నాను.

ఇంట్లోవాళ్లు యేపనీ చెయ్యకపోయినా, నేను సోమరిపోతుగా కూచునే వాణ్ణి కాదు. ప్రతిదినం జరిగే పనిగూర్చి ఆలోచించుకుంటూ, నన్ను నేను సమాధాన పరచుకుంటూండే వాడిని.


తెల్లారు జామున నాలుగున్నర కల్లా లేవడమునకు రాత్రే అలారం యిచ్చి, నాతలకి అడుగు దూరంలో వుంచుకునే వాణ్ణి అన్ని తలుపులూ, తాళాలుతీసి, బారుగా తెరచి, పెరట్లోకి వెళ్లేసరికి పూలచెట్లన్నీ నావంక, అన్నం పెడతాను లెమ్మని అన్నప్పుడు ఎంత ఆతృతగా విస్తరిముందు కూచుంటామో, అదే రీతిగా ఆతృతగా చూచేవి. చక్కని పూలతోట, రోజా అయిదుతాముల పువ్వులు పూచేవి. యెందుకూ - అందరికీ పంచెయ్యడమో, అమ్మెయ్యడమో చెయ్యాలి. అంతేగాని మా వాజమ్మ తను పెట్టుకోదు పిల్లలకన్నా పెట్టదు. ప్రాణం ఉసూరుమని సంచేది. తొలినాటి సాయంకాలం కుళాయిదగ్గర పట్టి నిలవచేసిన రెండు గంగాళాల నీళ్లూ, పదిహేను మొక్కలకీ, రెండేసి బాల్చీల చొప్పున పోసేసి, పువ్వులేరడానికి ఓ బుట్ట పట్టుకుని తోటలోకి వెళ్లేసరికి ఎంతో ఆనందంగా వుండేది.

మండువాలో-గచ్చు అవసంచేత-ఓ కుండు, అడుగున్నర ఎత్తున కట్టించి అందులో మన్ను పోసి రెండు కాకర గింజలు పాతేను. ఆ గింజలు రెండూ ఎగ్రికల్చరల్ ఆఫీసునుండి తెచ్చేను. రెండణాలు బంట్రోతుకి లంచం కూడా యిచ్చాను. ఆ రెండు మొక్కలూ బాగా అల్లుకున్నయ్. యిరుప్రక్కలా వున్న రెండు యిండ్లమీదా బాగా ప్రాకేయి. పెరట్లో మొక్కలకి నీళ్లుపోసి, రెండు బాల్చీలతో నీళ్లు తెచ్చి, యీ కుండుముందు కూచునేవాణ్ణి: పాదులోవున్న అనవసరమైన మొక్కలన్నీ పూడబెరికి నీళ్లు పోసేవాణ్ణి.

నాలో నాకే 'గొప్ప' అనిపించేది. వృక్షశాస్త్రమంతా ఆక్షణంలో, జ్ఞాపకానికి వచ్చేది. యేయే యెరువు వెయ్యాలో అన్నీ వేసేవాణ్ణి.

ఓమాటు, అలా నీళ్లు పోస్తూంటే, మా ఆవిడ నవ్వింది. యిప్పటి వరకూ దాని మొహాన్ని 'నవ్వు' యెరగను. కాని యెలా నవ్వగలిగిందో ఆరోజున; నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. పట్టరానంత సంతోషం కలిగింది నాజన్మ తరించి నట్టనిపించింది. అయినా, నాకు చిన్నతన మనిపించింది. నన్ను చూచి, నా పనిచూచి, యెందుకు నవ్వాలి? నన్ను అవమాన పరచడానికి దానికెన్ని గుండెలుండాలి? పోనీ యితరులెవళ్లన్నా నవ్వితే నాకంత కష్టమనిపించేదికాదు. నవ్వి—ఆమట్టున వెంటనే పారిపోయింది. అక్కడే వున్నట్టయితే, పాదుకు ఆధారంగా నిలబెట్టిన వెదురు గర్రల్లోంచి ఓ కర్ర లాగి బజాయించే వాణ్ణి దాని అదృష్టం బాగుంది కనక యింటిలోకి పారిపోయింది.

అయినా ఆ పారిపోవడమే మెరుగనిపించింది తరవాత. ఎందుచేత నంటే, ఎలాగూ కర్ర తియ్యక తప్పదు. ఒక కర్ర తీస్తే అన్ని కర్రలూ పూడివొచ్చును. అప్పుడు యెంతో ప్రయాస పడవలసి వచ్చేది. మొదట్లో ఆ కర్రలు కొనడానికీ, పాతి రైటుచెయ్యడానికీ రెండు దినాలు పట్టింది. ఆదివారం చాలకపోతే పోను



వారం కూడా సెలవు పెట్టడం, ఆరోజు టైపు చెయ్యవలసిన కాగితాలన్నీ మర్నాటికి 'నిలువా' వుండిపోవడం, జరిగింది. ఆ కాగితాలన్నీ రెండు రోజులు అదనంగా రోజూ రెండు గంటలు పనిచేసి టైపుచేశాను. ఆలస్య మైనదని తాసిల్దారు విరుచుకు పడటం జ్ఞాపకం లేకపోలేదు.

ప్రతిదినమూ బజారు కెళ్లి ఓ అర్ధ రూపాయి దాకా కూరలు కొనడం చికాకనిపించి, మాయింటికి ప్రక్కగావున్న నూరుగజాల ఖాళీజాగా కొన్నాను మూడువందల రూపాయిలిచ్చి. అందులో ఓ నుయ్యి త్రవ్వించేను నూరు రూపాయిలిచ్చి పైపునీరు అనుకూలమూ, అవసరమున్నప్పుడల్లా దొరకదు మరి! ఆజాగాలో కూర మొక్కలన్నీ వేశాను. ఓ కుర్రాణ్ణి నెలకు యిరవై రూపాయిల జీతంమీద యేర్పాటు చేశాను కాసు కూచోడానికి. పోనీ మా యింట్లో వున్న అనామధేయురాలన్నా కూచుంటుందేమో, అంటే అదీ లేకపోయెను!- కుర్రాణ్ణి ఒక్కణ్ణీ ఆపనికి నియమించక, ప్రతిదినం పెరట్లో మొక్కలకి చాకిరీ అంతా చేసి, యీ మొక్కలకి గొప్పు త్రవ్వడమూ, నీళ్లు పొయ్యడమూ చేసేవాణ్ణి.

ఓనాడు యిలాగే కూర పెరట్లో కూచుని తోటకూర మొక్కల్లో వున్న గడ్డి పరకల్ని యేరుతూంటే, మా ఆఫీసు గుమస్తాలు యిద్దరొచ్చి యెగతాళి చేసేరు. యీ పని చెయ్యడం నామోషీ యట! "పిచ్చివాడవు కాకపోతే ఈ చాదస్తం ఏమిటి" అన్నారు. "నాకు కాదు పిచ్చి, మీకే" అన్నాను. దాంతో వాళ్లు పక పకా నవ్వుకుంటూ వెళిపోయారు. నాకు యెంతో కష్టమనిపించింది. నే నెలా పోతే వీళ్లకేం?-

నేను సైకిలు మీదే వెళతాను ఆఫీసుకు. ఆఫీసుకీ, మాయింటికీ మైలున్నర దూరం. యెప్పుడూ బజార్లో జనం యెక్కువగానే వుంటారు. లక్షణంగా తయారవు తాను- అలాగని సూటూ, బూటూ వేసుకోను. తెల్లని పంచా, తెల్లని లాల్చీ, తెల్లని కండువా—యివీ నా దుస్తులు. ఓ జేబు రుమాలు కూడా వుంటుంది. అద్దంలో చూచుకుంటే, నామట్టుకి నేనే మురిసి పొయ్యేవాడిని. పాతికేళ్ళ వాడిలా అనిపించేది. మీసం లక్షణంగా, సగం దాకా తీసేశాను.

ఓ ముప్పావుగంట ముందుగా బయలుదేరేవాణ్ణి. నలుగుర్లాగా విరగబాటుగా, యెక్కువ స్పీడుగా తొక్కడం, దారిలో అనేక ఏక్సిడెంట్సుకి గురిఅవడం — అంటే నాకు గిట్టదు. నింపాదిగా ఆఫీసు చేరేసరికి అయిదు నిమిషాల టయిముండేది. నా సైకిలు యెలా వుంటే వాళ్ళకెందుకు! సైకిలుకి రెండు బెల్లులుంటే వాళ్ళకేం?— విరగబడి నవ్వేవారు. నా సైకిలు చుట్టూ మూగేవారు రోడ్డుమీద. రెండు బెల్లులు వుట్టినే, వెర్రివాడనై తగిలించలేదు. నాకు, సైకిలు తొక్కుతూ తొక్కుతూ రుమాలుతో ముఖం తుడుచుకోవడం అలవాటు. అది కుడిచేతితోనే చెయ్యాలి. యెడమ చేత్తో హేండిలు పట్టుకుని త్రొక్కవలసి వస్తుంది. అలాంటప్పుడు దారిలో వున్న మనుషుల్ని యెలా తప్పించడం? అందుకే ఎడమచేతిదగ్గర ఒక బెల్లుండాలి. యింకా జలుబు చేస్తే ఎడమ చేత్తో చీదుకోవాలి. అప్పుడు కుడిచేత్తో హేండిలు పట్టుకుని త్రొక్కుతూంటే ఉపయోగించడానికి కుడిచేతిదగ్గర ఒక బెల్లు వుండాలి. అందుకోసం వాళ్ళు నవ్వడం యెందుకు? వాళ్ళు గూడా రెండేసి గంటలు పెట్టుకోకూడదూ? !—

ఆఫీసు కెళ్ళి నా కుర్చీకి దగ్గరగానే ఉంచుకుంటాను సైకిల్ని. అందుకు కూడా నవ్వడమే. బయట వుంచినట్లయితే యెవడన్నా పట్టుకుపోయినప్పుడు యేం చెయ్యగలం? తరవాత యెంత డబ్బు ఖర్చెట్టి పోలీసులతో తిరిగితేమాత్రం యేం ప్రయోజనం. ముందుగానే జాగ్రత్తపడితే సరిపోయేదిగా!—

నేను కుర్చీలో కూచుని, నా ముద్దుల రిమింగ్టన్ మిషన్ని తుడిచి, కాగితాలు సరిచేసి నాలుగు లైనులు కొట్టేసరికల్లా, ఒక్కొక్క గుమస్తా చేరి, "గోపాలం గారూ" అంటూ యిష్టం వచ్చినట్లుగా వెటకారా లాడతారు. నేను సంసారంలో దిట్టతనంచూపితే వీళ్లకేం? సైకిలుని నా దగ్గరవుంచుకుంటే వీళ్లకేం? కూర పెరడు పెంచుకుంటే వీళ్ళకేం?—

వాళ్లు యెన్ని అన్నా వూరుకుని నామట్టుకి నేను టైపుచేసుకుంటూ, వుంటాను. ఓమాటు నాకు మహా కష్టమనిపించింది. వాళ్లు యేదో అన్నారు. నాకు గుర్తులేదు. నేను సహించలేక "నా జన్మవేషాలూ, పెయ్యమ్మ కబుర్లూ చెప్పకండి. నావూ సెత్తితే ఒప్పేదిలేదు" అని నిక్కచ్చిగా చెప్పేశాను. దాంతో మహారోషం వచ్చినవారల్లే, కళ్లెర్రజేస్తూ తాసిల్దారుతో యేదో చెప్పారు కాబోలు, నామీద రుసరుస

లాడాడు. నేను వూరుకోలేదు "నాపనిలో లోపంవుంటే అడగండి" అన్నాను. అది మనసులో వుంచుకున్నాడు గావును - ఓమాటు తప్పుగా టైపుచేశానని, నా పర్సనలు రిజష్టరులో యిష్టంవచ్చినట్లూ రాసి, ఉద్యోగం వూడేంతవరకూ చేశాడు. నా అదృష్టం బాగుంది గనక గండం గడిచి బయటపడ్డాను. నలుగురిలాగా వెనకాల "భళా భళీ" అంటూ తిరగనని నామీద ఓ విధమైన కోపమూ, ఈర్ష్యాను.

ఆఫీసంతా ఒకటి - నేనొక్కణ్ణే ఒక టీను. నాకు శృంగారకథలంటే యిష్టం అలాంటి పుస్తకాలు ఆఫీసుకు తెచ్చుకుని, విసుగుపుట్టినప్పుడు చదువుకుంటాను. అందుక్కూడా విమర్శలే బయలుదేరేవి.

సాయంకాలం అయిదుగంటలూ కొట్టగానే యింటికిబయలుదేరి ఆరుగంటలకల్లా చేరేవాణ్ణి, దారిలో పుస్తకాలు కొనుక్కుని.

సైకిలుకి పక్కా ఒక గంటదాకా సేవ చేసి, అప్పుడే కొన్న కొత్త సైకిల్లే తయారుచేసేవాణ్ణి. యీ పనికి కూడా నన్ను ఎకసక్కేలాడేవాళ్లు

భోజనందగ్గర కూచునేసరికి నిలువునా ప్రాణంపోయినట్లనిపించేది. అందరూ తినేసి నాకు మాత్రం ఓమూలపడేసేవారు. కాని యేం చెయ్యగలను?—

భోంచెయ్యడం అయిందనగానే, వినోదం కావలసివుండేది. కొన్నిపత్రికలు చదుకునేవాణ్ణ.

నేను బాగా కథలురాసేవాణ్ణి. యింగ్లీషు నుండి తెలుగులోకి అనేక కథలు అనువాదంచేశాను. స్వయంగా కూడా కొన్ని కథలు రాశాను. కొన్ని స్వంతంగా ముద్రించాను. కొన్ని పత్రికల్లో ప్రకటింపబడ్డాయి. అప్పుడు పత్రికలవాళ్లు అభినందిస్తూ రాసిన ఉత్తరాలూ, పంపిన మనియార్డర్లు తాలూకు కూపన్లూ యెన్నో వున్నాయి యిప్పటిదాకా.

యిన్ని కథలూ రాసేవాణ్ణి గాని, సంతృప్తిమాత్రం లేకపోయేది. నేను రాసిన కథని ఒక్కదాన్నైనా మా ఆవిడగారు చదివి "యిది బాగుంద" అంటారేమోనిని ఉవ్విళ్ళూరేవాణ్ణి - కాని ప్రయోజనం లేకపోయేది.

ఒక్కొక్కరాత్రి నాకు నిద్రవుండనే వుండేదికాదు. నేను హఠాత్తుగా యివాళ చచ్చిపోయాను అనుకోండి—రేప్పొద్దున్న నా ఉత్తరక్రియలు జరిపించడానికి వాళ్లకి డబ్బు వుండాలిగా - అంత డబ్బూ నాదగ్గరేవుండి పోయింది. అంచేత ఓరెండు వందలరూపాయిలు దాకా మా ఆవిడదగ్గర దాచడం యుక్తమనిపించేది. ఒక్కసారి దిగ్గునలేచి, పెరటిగుమ్మంలో పడుకున్న మా వాజమ్మని లేపి - "యీడబ్బు నీదగ్గరుంచు - యీరాత్రి నేను చచ్చిపోతే ఖర్చులకి వుండాలి" అని చెప్పి ఆడబ్బు యిచ్చేసి మళ్లా వీధి గుమ్మంలో పడుక్కునేవాణ్ణి. తెల్లారింతర్వాత ఆ డబ్బుతీసుకునేవాణ్ణి.

మరొక్కనాడు మరీ ఆందోళనగా వుండేది. నాప్రయోజకత్వమువల్లనే యింత ఆస్తి గడించాను. నా తరవాత యీ ఆస్తిని స్థిరపరచుకొని పొదుపుగావ్యవహరించడం మా ఆవిడచేతగాదు.

పోనీ నాకు కొడుకులున్నారేమో అంటే అదీ లేదు. అంచేత ఓ కుర్రాణ్ణి దత్తత చేసుకుంటే బాగుండును. చిన్నవాడైతే లాభం లేదు. పదిహేడు—యిరవై యేళ్ళవాడుండాలి. తీరా అలాగే దత్తత చేసుకున్నానే కట్టండి - వాడు నన్ను తన్ని యీ ఆస్థినంతట్నీ పాడుచేస్తాడేమో - అబ్బెబ్బె! ఆ వూసు అసలే తలపెట్టకూడదు - అనే నిర్ణయాని కొచ్చేవాణ్ణి.

యింకోనాడు—యీ ఆస్థినంతటినీ నగదు రూపంలోకి మార్చేస్తే యేం ఫరవాలేదు. నగదుని పైకి కనబడకుండా దాచవచ్చును. యిదే మంచిది - అనుకునేవాణ్ణి.

యింతకీ మా ఆవిడ జాగ్రత్త కలదయితే, యిన్ని ఆలోచనలే వుండకపోను మరి. అప్పుడప్పుడు యెంతగానో నూరిపోసేవాణ్ణి — అయినా ఆవిడ పుసకం పట్టుకోడానికి నిరాకరించేది. పోనీ తను చెడిపోవడం బాగానే వున్నది. తనెలాగూ యిక బాగుపడదు. పిల్లలనేనా బాగు చేస్తుందేమో అనుకుంటే — అదీ లేకపోయెను.

మహానుభావుడు, వీరేశలింగం పంతులు ఉట్టినే అనలేదు ఆడది బాగా చదువుకోవాలని. తెలిసే అన్నాడు. మా ఆవిడే గాని నిజంగా చదువుకున్నదే అయితే, మా పిల్లలు బాగుండరూ?—నాకు యింతవరకూ ఆలోచనకి తావుండేదా?—

ఓనాడు, యెంత విచారించినా లాభం లేదనుకుని పిల్లలిద్దరిపేరా, మా ఆవిడ రత్నమ్మగారిపేరా అంత ఆస్థినీ రాసి రిజిష్టరీ చేయించాను. యిక నేను చచ్చిపోయినా ఫరవాలేదు.

కాని మరి నా హృదయానికి శాంతి లేకపోయింది. ఆర్థికంగా యెటువంటి లోపమున్నూ లేదు. దాంపత్యంలో గాని, సంసారంలో గాని, సమాజంలో గాని— యెక్కడ తృప్తిలేకపోయింది. యిదే నన్ను వేధించుకుతింటున్న ప్రబలసమస్య. ★

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

12

రాత్రి పగలల్లా కోర్టులో కూర్చుని ఉక్కకు మరిగిపోయివున్న జనం తండాలు తండాలుగా అంతా బయటికి వెళ్లిపోయారు. ...డ్డిదీపాల వెలుగులో కనుపించీ కనుపించకుండా వుంది. డాక్టర్ ...నెట్, లూసీ మానెట్, లారీ, స్ట్రయివర్, వీళ్లుమాత్రం ...కొత్తగా విడుదలైన ముద్దాయి చార్లెస్ డార్నే చుట్టూ మూగి ...రామర్శ చేస్తున్నారు.

డార్నే లూసీ మానెట్ చేతిని ఆప్యాయంగా ముద్దుపెట్టు...ని కృతజ్ఞత తెలియజేశాడు. అనంతరం తన వకీలు స్ట్రయివర్ ...ంక తిరిగి వందనా లర్పించాడు. స్ట్రయివర్ వయస్సు ఎంచు...ంచు 30 సంవత్సరాలు; కాని 50 సంవత్సరాల ముసలివాడులా ...నుపించుతాడు; కొంచెం లావుసరి మనిషి; ఎర్రగా బొద్దుగా ...ంటాడు. గడసరి, పదిమంది ఎక్కడున్నా మోచేతుల్తో నెట్టు...ని ముందిపీటికి చేరుకోగల తత్వం.

ఇంకా గౌనూ, విగ్గూ అలానేవున్నయ్; మోచేత్తో లారీ ...గార్ని ఒక్కనెట్టు వెనక్కినెట్టి, తన క్లయింటు ముందుకొచ్చే...డు: 'డార్నేగారూ! ఏదో విధంగా మిమ్మల్ని గౌరవంగా ...బయటపడెయ్యగలిగాను; చాలా సంతోషంగా వుంది; వట్టి ...అన్యాయమైన కేసు, శుద్ధ అన్యాయం; ఎలా బయట పడెయ్య...గలనా అని చాలా ఆందోళనపడ్డాను.'

డార్నే ఆయన చెయ్యి బట్టుకున్నాడు: 'జీవితాంతం ...వరకూ మీకు కృతజ్ఞుణ్ణి.'

'ఏదో నా చేతనైంది చేశాను—నేనే యేవిటి లెండి—...మరొకరైతే మాత్రం ఆమాత్రం చెయ్యలేకపోయేవారుట గానీ'—

'మరొకరైతే యేమ య్యేదోలెండి' అని యెవరో ఒకరు ...అనాలని ఆయన అభిలాష. లారీగారు ఆమాట అనేశాడు, కేవలం ...లాంఛనప్రాయంగా అన్నమాట గాదు. ఇందాక తన్ను వెనక్కి ...నెట్టినందుకు, ఈ అవకాశంలో స్ట్రయివర్ గార్ని వెనక్కి ...నెట్టెయ్యాలనే ఆవేశంతో.

'అలా అంటారా?' అన్నాడు స్ట్రయివర్: 'ఏమో, ...అయితే కానేవచ్చు—మీరు యివ్వాళల్లా కోర్టులోనే వున్నట్టు...న్నారు—మీకు తెలియందేవుందిలెండి; మీరు సమస్తం తెలిసిన ...వ్యవహారస్తులుకూడా నాయె'—

'అవును—వ్యాపారస్థుణ్ణి; కాలయాపన చెయ్యటం నాకు ...నచ్చదు. అంతా యింటికి వెళ్లిపోదాం—లూసీ చాలా బడలిపోయి...నట్టుంది. ఏవండీ మానెట్ గారూ! ఏవంటారు?"

'అవును పోదాం' అన్నాడు స్ట్రయివర్: 'ఈరాత్రి ...యింకా చూసుకోవలసిన పనులు చాలా వున్నయ్'

అంతవరదాకా, దించుకుపోయిన ముఖంతో డార్నేవంక తెల్లపోయి చూస్తున్న డాక్టర్ మానెట్ నెమ్మదిగా కదిలాడు.

'నాన్నా' అంటూ లూసీ ఆయన చెయ్యి పట్టుకుంది. మానెట్ స్ఫురితుడై కూతురుముఖంలోకి చూచాడు. ఆయన ముఖంమీద సంతోషం పొటమరించింది.

'నాన్నా! ఇంటికి బయలుదేరుదామా?' పెద్ద నిట్టూర్పు విడిచి, 'హఁ' అన్నాడు.

డార్నేను అక్కడ విడిచిపెట్టి ఎక్కడవాళ్లక్కడ తలో త్రోవనూ వెళ్లిపోతున్నారు దీపాలన్నీ ఆరిపేస్తున్నారు. ఎక్కడి ఇనపతలుపులు అక్కడ మూసుకుపోతున్నయ్

మిగతా వాళ్ళనందర్నీ సాగనంపి స్ట్రయివర్ గౌను దాచుకు రావటానికి ప్రక్కనున్న గదిలోకి వెళ్లారు. అంతవరదాకా యీ బృందంతో కలిసి మాట్లాడకుండా, చీకటిగావున్న ఒకమూలగోడకు చారబడి నిల్చునున్న ఒక వ్యక్తి నెమ్మదిగా కదిలి లారీ డార్నేలు నిల్చునున్న ప్రదేశానికి వచ్చాడు.

'లారీగారూ!—గౌరవనీయులైన మీవంటి వ్యాపారస్తులు, ఇక డార్నేతో మాట్లాడటానికి అభ్యంతరమేమీ లేదనుకుంటాను' అన్నాడు.

నాటి సంఘటనలో, కార్టన్ వహించిన పాత్ర యేవిటో, యెవ్వరూ గుర్తించారు కారు; అసలు ఎవ్వరికీ తెలీదు.

డార్నే అందుకుని: 'ఎంతటి సహృదయమున్నా—ఉద్యోగ సద్యోగాలు చేసేవారు అందుకు అనుగుణంగా నడుచుకో వలసి వుంటుంది' అంటూ సర్దిచెయ్య బోయాడు.

లారీగారి ముఖం యెర్రబడ్డది: 'అవునండీ ఏదైనా ఒక సంస్థలో పనిచేస్తున్నామంటే, ఇష్టమొచ్చినట్టు వ్యవహరించటానికి ఎలా వీలౌతుంది? ఎప్పుడూకూడా, మన సంగతులకంటే ఆ సంస్థ సంగతులు ముందు ఆలోచించాలి'

'అవునవును అదే అంటున్నాను' అన్నాడు కార్టన్, అదే బేఫర్వా గొంతుతో. 'ఎబ్బే! ఏమనుకోబోకండి—ఏదో మాట వరసకన్నాను—నిజంగా మీ వ్యాపారస్తుల్లో మీమాత్రం హృదయంవున్న వాళ్ళు అరుదు.'

లారీ కార్టన్ మాటలు లెక్కచెయ్యలేదు: 'అయినా ఆ సంగతులన్నీ మీకెందుకులెండి— నిజానికి, మీకంటే పెద్దవాణ్ణి, ఏదో అంటున్నాను —మరేమనుకోబోకండి; అసలు ఈ వ్యవహారంలో మీకేవిట జోక్యం'

'వ్యవహారమా?—ఎబ్బే అలాంటి దేమీ లేదండీ—నేను వ్యవహారాలూ గివహారాలూ వున్నవాణ్ని గాను'

'చాలా విచారకరం—మనిషైనవాడికి యేదో వ్యాపృత్తి వుండితీరాలి'

అనువాదం: తెన్నేటి సూరి

'నేనూ అదే అనుకుంటున్నాను.'

'వ్యవహారం యేదో వొకటి పెట్టుకుంటే—తప్పకుండా సాధించగలరు—మీకేవిటి ?'

'అరి భగవానుడా! వద్దులెండి సర్—నా కెందుకొచ్చిన గొడవ' అన్నాడు కార్టర్.

ఆ ధోరణి విని లారీ ఉడికిపోయాడు: 'వ్యాపారం సంగతి మీకేం తెలుసు; వ్యాపార సాపారాలు లేనివాడికి ఇంకా గౌరవ మేమిటి? ఏదైనా వ్యాపారం చేసేవాడికి ఇతరులతో ఎలా మాట్లాడాలో తెలుస్తుంది. డార్నే గారికి తెలిసినట్టు ఇతరుల కుండే కష్టసుఖా లేవిటో అర్థమౌతుంది-సరే ఇక శలవు; డార్నే గారూ వెళ్ళొస్తాను.'

లారీగారికి కార్టన్‌మీద కోపం రావటమే గాదు—తనమీద తనకే చిరాకెత్తిపోయింది. గిజాటుగా బయిటికి వెళ్ళిపోయాడు. కార్టన్ ఆయన ప్రవర్తనచూచి నవ్వాడు. పోర్టువైన్ వాసన కొడుతూ, హుషారులో వున్నాడు. డార్నే వంక తిరిగి:

'మన మిద్దరం యిలా కలుసుకోవటం చాలా చిత్రమైన సంఘటన; సరీగా నీకుమల్లేనే వున్న ఒక వ్యక్తి, నీ కట్టెదుట నిలచి వుండటం నీకు బలే తమాషాగా వుందనుకుంటాను.'

'నేను ఈ లోకంలో పడ్డానో లేదో ఇంకా అనుమానంగానే వుంది.'

'అవును మరి—మరో ప్రపంచానికి ప్రయాణం కట్టడానికి మూటా ముల్లే యావత్తూ సర్దుకుని సిద్ధమైనవాడివైతివి!—చాలా బలహీనంగా వున్నట్టు మాట్లాడుతున్నావే'—

'బలహీనంగానే వున్నానల్లే వుంది'—

'అరి దుర్మార్గుడా! భోజన మెందుకు చెయ్యవ్!—ఆ లక్కబుర్రలు నిన్ను ఆ ప్రపంచానికి పంపుదామా, ఈ ప్రపంచంలో వుంచుదామా అని మథనపడుతున్నప్పుడు నేను సమయంలో సమయం కందా కొట్టేశాను. ప్రక్క నేదేనా హోటలుకు పోదాంపద భోజనం చేద్దువుగాని'

సమాధానంకోసం నిరీక్షించకుండానే డార్నే చేతికి చెయ్యి మెలికవేసి పడ లాక్కుపోతున్నాడు. సరాసరి ఫ్లీట్‌స్ట్రీట్‌లో ఒక హోటలుకు తీసుకొచ్చాడు. హోటలుగదిలో కూర్చుని డార్నే భోజనం చేస్తున్నాడు. అతనికి ఒకొక్క రవ్వే ప్రాణం చేరుకుంటోంది. అతనికి ఎదురుగా కుర్చీలో యాలిగిలబడి, కార్టన్ పోర్టువైన్ ఎక్కిస్తున్నాడు. అదే నాటు ధోరణిలో మొదలెట్టాడు:

'ఈ భూప్రపంచంలో పడ్డాటైనా, ఇంకా అనుమానంగా వుందా?—'

'కాలమానాలు యింకా అయోమయంగావున్నా—కొస్త ఫరవాలేదు—లోకంలో పడ్డానన్న భావం యేర్పడుతోంది'

'అదో పెద్ద మహద్భాగ్యంగా ఆనందిస్తున్నా వల్లే వుంది ?'—కంటకంగా ఆమాట అనేసి మళ్లా గ్లాసు నింపుతున్నాడు.

'నాకుమాత్రం, ఈ వెధవప్రపంచం సంగతి ఎలా మరిచిపోదామా అని వుంటుంది. ఈసారా ఒక్కటి మినహా ఈ ప్రపంచంలో యేడిచిన మంచేవిఁటి ?—రూపంలో నీవూ నేనూ ఒకే మోస్తరు వాళ్లంగాని ఈ విషయంలోమాత్రం మనకిద్దరికీ చాలా తేడావుంది.'

ప్రొద్దుటినుంచీ ఆందోళన పడుతూ, ఇంకా ఒకతీరానికి రాని మనస్సు, కట్టెదుట ముమ్మూర్తులా తనకు మల్లేనే వున్నవ్యక్తి; అతని మాటలకు యేవిఁ సమాధానం చెప్పటానికీ తోచక, అయోమయంగా: 'తేడాయే వీఁలేదు' అన్నాడు.

'భోజనం పూర్తిచేశావుగా—ఒక గ్లాసెడు పానీయం చేత్తో బుచ్చుకుని, ఆవిడ ఆరోగ్యంకోసం దేవుణ్ని ప్రార్థించి గొంతులో పోసుకో'

'ఎవరిమాట మీర నేది—'

'ఎవరిమాటేవిఁటి బ్రదర్ ?—ఆవిడమాటే'—

'మిస్ మానెట్ ?—'

'మరే— తెలియనట్టు నటించుతావేం ?—'

మిస్ మానెట్ ఆరోగ్యార్థం, డార్నే పానీయం స్వీకరిస్తున్నాడు. అతనివంక చూస్తూ, కార్టన్, చేతిలో వున్న గ్లాసును భుజంమీదగా వెనక్కి గిరవాటేశాడు. అది గోడకుపోయి కొట్టుకుని నూరు ముక్కలైంది. మరోగ్లాసు తెమ్మని వెయిటర్ను కేకబెట్టాడు. ఆ గ్లాసుమళ్లా నింపుతూ :

'మంచి అందమైన మనిషి'—

డార్నే చిత్రిత ప్రతిమాలాకూర్చుని—'ఆ' అన్నాడు.

'అలాంటి అందమైన స్త్రీ, తనకోసం జాలిపడి కన్నీరు విడుస్తుందంటే—ఆ వ్యక్తికి జీవన్మరణ విచారణ జరిగితేమాత్రం లెక్కేవిఁటి ?—'

డార్నే మౌనంగా వూరుకున్నాడు.

'నీ సందేశాన్ని అందజేశాను. ఆవిడ చాలా ఆనందించింది. ఆనందాన్ని బయటికి వెల్లడించిందని కాదు. ఆవిడ ఆనందించినట్టు నేను గ్రహించాడు'

ఆ మాట వినేసరికి, డార్నేకు ఆ సాయంత్రం జరిగిన సంగతి జ్ఞాపక మొచ్చింది: ఆ మొరటుమనిషి తనకు తానుగా పూనుకుని తన సందేశాన్ని ఆవిడకు అందజేశాడు. అందుకు డార్నే తిరిగి తన కృతజ్ఞతా వందనాలు తెలియజేశాడు.

'నీ వందనాలు వగైరా మన కేవీఁ అక్కర్లేదు—నిజానికి అలాంటి యోగ్యత లేవీ మనకి లేవు— నేను చేసింది మరేమీ ఘనకార్యమూ కాదు—ఘనకార్యమే అయినా ఎందుకుచేశానో నాకే తెలీదు.' అన్నాడు కార్టన్.

'డార్నే !—ఒకమాట అడిగేదీ ?—

'అడగండి'—

'నీమీద నా కేమైనా అభిమానం వుందనుకుంటున్నావా ?'

'ఆసంగతి నేను ఇంతవరకూ ఆలోచించనేలేదు.'

'ఆలోచించి చెప్పు'—

'చేతల్నిబట్టి చూస్తే అభిమానం వున్నదనే అనుకోవాలి సొస్తోంది—మాటల్నిబట్టి చూస్తే అలాంటిదేమీ వున్నట్టు తోచటంలేదు.'

'రవ్వంతేనా లేదు—నువ్వు మంచి ఆలోచనాజ్ఞానం వున్నవాడివని మటుకు నా అభిప్రాయం.'

'అభిమానంవున్నా లేకపోయినా బిల్లు నేను చెల్లించుకుని— ఇద్దరం యే విధమైన తటపటాయింపూ లేకుండా యిద్దరం చెరో దోవనూ వెళ్లిపోవటానికి మీకు అభ్యంతర మేమీలేదు గదా !'

'ఎలాంటి అభ్యంతరమూ లేదు'—

డార్నే వెయిటర్ని పిలిచాడు.

'ఏవిఁటి బిల్లంతా నువ్వే చెల్లించుతానంటావా?' అన్నాడు కార్టన్. డార్నే ఔనన్నట్టు తల ఊపాడు.

'ఓరే వెయిటర్, అలాగైతే మరో పెగ్ వైన్ ఇలా తగలబోసి, పదిగంటలకొచ్చి నిద్రలేపు' అన్నాడు.

డార్నే బిల్లు చెల్లించేశాడు. కార్టన్కు అభివందనంచేసి బయలుదేరాడు. కార్టన్ ప్రత్యభివాదం చెయ్యలేదు. కొట్టొచ్చినట్టు లేచి నిల్చుని ముందుకు వచ్చాడు: 'ఇదుగో ! మరోమాట.'

'నేను తప్పదాగుతాననేనా నువ్వనుకోటం.'

'మీరు ఎక్కువగా తాగుతున్నారనే నేను అనుకుంటున్నాను'—

'అనుకోవట మేవిఁటి? తెలీటం లేదూ?'

'తెలుస్తూంది గనక నే అంటున్నాను'—

'తెలుసు గనక అందుకు కారణమేవిఁటో గూడా నువ్వు తెలుసుకోవలసి వుంది.—నేను అరవ చాకిరీచేసి ఆశాభంగం పొందిన జంతువును—ఈ లోకంలో ఒకడంటే నాకుగాని, నేనంటే ఒకడికిగాని లెక్కలేదు.'

'చాలా విచారకరమైన సంగతి: మీ తెలివితేటల్ని మరింత ప్రయోజనకరంగా ఉపయోగించవలసింది.'

'కావచ్చు—కాకనూపోవచ్చు—నువ్విప్పు డేదో కాస్త స్థిమితంగా వున్నానని బుజా లెగరవెయ్యకు—ఏనాటికి యేస్థితి సంభవిస్తుందో ఎలా చెబుతాం—నమస్తే.'

డార్నే వెళ్ళిపోయాడు. ఈ విచిత్రవ్యక్తి వెలుగుతున్న కొవ్వొత్తి చేత్తో బుచ్చుకుని, గోడమీద వ్రేలాడుతున్న అద్దం ముందుకుపోయి నిల్చుని అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని తనలో తను ఆలోచించుకుంటున్నాడు :

'పోలికలున్న మాత్రంచేత అతనంటే అంత అభిమానం ఎందుకు కలగాలి! ఇతరులను అభిమానించే తత్వం నాలో ఎన్నడూ లేదే. అతనితో మాట్లాడుతూ కూర్చోటం దేనికి ? అతనితో పోల్చుకుని నేను ఎంత పతనమైపోయానో తెలుసుకోటానికి ప్రయత్నించానా. అతను నేనుగానూ నేను అతనుగానూ మారితే ఆ నీలి కళ్లు నావంక చూసి జాలిపడేవి, అతన్ని చూసి జాలిబడ్డట్టే—అహఁ అదీ అసలు విషయం !—అతనంటే అభిమానంగాదు—ఈర్ష్య.'

మనస్సును స్థాయికి తెచ్చుకోవటానికి ఆ గ్లాసెడు ద్రాక్షసారా రెండు గుక్కల్లో తాగేశాడు. రెండు ముంజేతులూ బల్లమీద ఆని, బోర్లగా పడుకున్నాడు. విరబోసుకున్న అతని జీబుజుట్టు బల్లమీద ఇటూ అటూ గాలికి కదులుతోంది. వెలుగుతూన్న క్రొవ్వువత్తినుంచి కరగినమైనం ధారగా జారి బల్లమీద తుపర్లు తుపర్లుగా చిందుతోంది.

(38-వ పేజీ చూడండి)

బొమ్మరిల్లు



పరధ్యానం

శ్రీ వి. ఎస్. ప్రభాకరరావు

పరమేశ్వర శాస్త్రిగార్కి
పరధ్యానమెక్కువ
ఎదుటనున్న వస్తువులే
ఎప్పుడు కనిపించవు.

బల్లముందు కూర్చుంటే
కళ్లు తెరిచి చూస్తూనే
కాఫీలో కలం ముంచి
కరక్కాయ సిరాత్రాగు.

కాఫీహోటలు కెళ్లాడా
కాలిజోడు మరచిపోయి
క్లబ్బులోకి వెళ్ళాడా
కళ్లజోడు మరచిపోయి

ఏదో ఆలోచిస్తూ
ఇంటికి తిరిగొస్తాడు
ఏమాలోచిస్తాడో
ఎవ్వరికీ తెలియదు

ఎన్నిమార్లు గొడుగుమరచి
ఇంటికి తిరిగొచ్చాడో
ఎవ్వరికీ తెలియదాయన
ఇల్లాలికి తప్ప విడిచి.

* * *

సంబరంగా శాస్త్రిగారు
చంకను గొడు గేసుకుని
ఇంటికొచ్చి నవ్వుకుంటు
ఇల్లాలితో అన్నాడూ:

"పరధ్యానమంటూంటావ్!
మరి చూశావ్! ఈరోజున
మరలివస్తు గొడుగుమాట
మరచిపోక తెచ్చాను"

నెత్తీ నోరూ గట్టిగ
మొత్తుకొన్నదింటావిడ.
తలుపుమూల గొడుగును ఈ
వలకు తెచ్చి అన్నదీ

"అయ్యయ్యో, గొడుగును
మీరసలు తీసుకెళ్ల లేదు
ఎక్కడ కని వెళ్ళారో,
ఎవరిగొడుగు తెచ్చారో,

"ఏమి పరధ్యానమండీ!
ఎంత మందమరుపండీ!
ఇంట్లోనే వున్నదండీ,
ఇదుగో మీ గొడుగండీ."

ఖాజీ తీర్పు

ఈకథ ముస్లిం దేశంలో ఒక్పుడు జరిగింది.

ముల్లా అనే ఒక వ్యక్తి ఒక రోజున వీధివెంట ఏదో పనిమీద పోతున్నాడు. తన దారిన తాను పోతున్న ముల్లాను ఎవడో అపరిచితుడు గబగబా వచ్చి ఫెళ్లుమని లెంపమీద ఒక్కటి పెట్టాడు. ముల్లాకు తల తిరిగినంత పని అయింది. ఈ కొట్టిన వాడెవరో, ఎందుకు కొట్టాడో అతని కేమీ బోధ పడలేదు. ఇంతలోకి ఆ కొట్టిన వాడు నాలుక కరుచుకుని "ముల్లా సాబ్! మిమ్మల్ని చూచి మరొకరనుకొని గబిక్కన కొట్టేశాను. క్షమించండి; తప్పు చేశాను." అంటూ కాళ్లా వేళ్లాపడి బతిమాలాడు. ముల్లాకు మాత్రం ఒళ్లు మండుకుపోయింది. అవతలవ్యక్తి ఎంత బతిమాలినా అతనిని విడిచిపెట్టకుండా ఖాజీ కుల పెద్ద దగ్గరకు యీడ్చుకు పోయాడు.

ఖాజీ ముల్లా చెప్పిన దంతా సావధానంగా విన్నాడు. ఆ అపరిచిత వ్యక్తి చెప్పుకొన్న సంజాయిషీకూడా విన్నాడు. అంతా విని దెబ్బకు దెబ్బే బదులు తీరుస్తుందని అంటూ అవతల వ్యక్తిని ఒక దెబ్బవేసి నీకసి తీర్చుకోమని

శ్రీ అందే గోపాలకృష్ణ

ముల్లాకు చెప్పాడు. కాని ముల్లా అందుకు ఒప్పుకోలేదు. "అతడు కొట్టిన తరువాత యింత రాద్ధాంతం జరిగి, మీ దగ్గరకు వచ్చి, యింత విచారణ జరిగాక, మీరు యిచ్చిన యీ తీర్పును పురస్కరించుకొని అతని వంటిపై ఓ దెబ్బ వేస్తేమాత్రం నాకసి ఏమితీరుతుంది? అసలు అతనా దెబ్బ వేయగానే నేను ఆ వేడిలోనే చేతికొద్దీ ఓ దెబ్బ వేసివుంటే సారస్యముండేది అంతే కాని యిప్పుడు కొట్టినందు వల్ల నాకేమీ తృప్తి వుండదని" ముల్లా వాదించాడు.

(36-వ పేజీ చూడండి)



హకల్‌బెరీ ఫిన్

మార్క్ ట్వేన్

బొమ్మరిల్లు సీరియల్

28

ఊళ్లోకి వెళ్లి డాక్టర్ని లేపాను. అర్థరాత్రి వేళ నిద్ర లేపినందుకు ఆయన విసుక్కోలేదు సరి గదా చాలా మర్యాదగా, దయగా మాట్లాడాడు. నేను మాతమ్ముడు ఈఊళ్లో మా చుట్టాలింటికి కొన్నాళ్లకిందట వచ్చామనీ, నిన్న మధ్యాహ్నం పక్షుల్ని వేటాడ్డానికి ఒక లంకకు షికారు వెళ్లామనీ, లంకలో రాత్రి నిద్రపోతుండగా మా తమ్ముడికి కల వచ్చిందని, కలలో జడుసుకుని మా తమ్ముడు కాలు ఝాడించగా కాలిపక్కనే ఉన్న తుపాకి పేలి కాలి మీద గాయమైందనీ, త్వరగావచ్చి కాల్లో ఇరుక్కుని ఉన్న తూటాను లాగివేయ వలసిందనీ డాక్టరుతో చెప్పాను.

"ఈ ఊళ్లో మీచుట్టా లెవరు?" అని డాక్టరు అడిగాడు.

"సైలాస్ ఫిలిప్స్ గారు మా బాబయ్యే."

"అలాగా. అయితే మీ తమ్ముడికి గాయం ఎలా తగిలిందన్నావు ?"

"కలలో కాలు ఝాడించాడండి. తుపాకీపేలి కాల్లో తూటా ఇరుక్కు పోయిందండి."

"చిత్రమైన కలే ఇప్పు డెక్కడున్నాడు?"

"ఆ లంకలోనే నండి. ఇంటికి తీసుకు రావ టానికి వీల్లేక అక్కడే ఉంచి నేను వచ్చా—"

"సరే పద"

మందులపెట్టి పట్టుకుని ఆయన నావెంట నది వరకూ వచ్చాడు. నా డింగీని చూసి ఆయన ఆశ్చర్య పడ్డాడు.

"ఇంత చిన్న డింగీలో ఇద్దరం ఎలా వెడతాం ?"

"ఫరవా లేదండి. డింగీ చిన్నదైనా ఇద్దరం వెళ్లవచ్చు నండి."

"ఊహు. వద్దు. ఇద్దరం ఎక్కితే తలకిందు లవుతుంది. ఆ కనిపించే లంకలోనే కదూ మీ తమ్ము డున్నది. నే నొక్కణ్ణే డింగీలో వెడతాను. నువ్విక్కడే ఉండు నేను వచ్చేదాకా," అంటూ ఆయన డింగీని నీళ్లలోకి తోసి లంకకేసి బయల్దేరాడు. చేసేది లేక నేను ఒడ్డునే ఉండిపోయాను. ఒక చెట్టుకింద కూర్చు న్నాను డాక్టరు కోసం ఎదురుచూస్తూ. ఎప్పుడు నిద్రపోయానో అల్లాగే ఒరిగి నిద్రపోయాను. మళ్లీ లేచేటప్పటికి బారెడు పొద్దెక్కింది. చుట్టుపక్కల అంతా నిర్జనంగా నిశ్శబ్దంగా ఉంది. నాడింగీ కనబడ లేదు. డాక్టరు లంకనుండి తిరిగివచ్చి ఇంటికి వెళ్లి పోయి ఉంటాడను కున్నాను. డాక్టరు ఇంటికి పరి గెత్తాను. ఇంట్లోవాళ్లు డాక్టరుగారు ఒకరాత్రి వేళ లేచి ఎవరో రోగిని చూడటానికి వెళ్లాడని, మళ్లీ రాలేదని చెప్పారు. మళ్ళీ నదిఒడ్డుకి బయల్దేరాను. ఒకసందు మలుపు తిరుగుతున్నాను. ముందు చూసుకోకుండా పరిగెత్తడంలో అదే సమయంలో మలుపు తిరుగుతున్న సైలాస్ ఫిలిప్స్ గారికి డీకొట్టాను.

ఆయన నన్ను పట్టుకున్నాడు.

"అరె, టామ్! ఓరి దొంగా! ఎక్కడి కెళ్లావ్ రాత్రి నించీ?"

"ఎక్కడికీ వెళ్ల లేదండీ. పారిపోయిన నీగ్రోని పట్టుకోటానికి నేనూ, సిడ్ వెళ్లాము."

"వాడు మీకు దొరుకుతాడనే వెళ్లారా? మీకోసం మీపిన్ని ఎంత గగ్గోలు పడుతోందో తెలుసా?"

"అది కాదండి. రాత్రి మీరంతా దొంగల వెంటపడి తరుము తున్నప్పుడు నేనూ, సిడ్ కూడా మీ వెంట పరుగెత్తుకుని వచ్చాము. మీరు నది ఒడ్డు వరకూ వచ్చి వెనక్కి వెళ్లిపోయారు. దొంగలు పడవ ఎక్కి అవతల ఒడ్డుకి పారిపోవటం చూశాము. మేము కూడా అక్కడొక చిన్న డింగీ కనబడితే అది ఎక్కి దొంగలవెంట పడ్డాము. కాని వాళ్లు మమ్మల్ని తప్పించుకు పారిపోయారు. మేము చేసేదిలేక మళ్లీ వెనక్కి వచ్చేశాము. అప్పటికి బాగా అలిసిపోయి ఉన్నాము. అందుకని ఒడ్డునే ఒక చెట్టుకింద నిద్ర పోయాము. ఇందాకే ఒక గంట కింద నిద్ర లేచాము. లేచి ఊళ్లోకి వచ్చాము. పోలీపెద్దమ్మ దగ్గిర్నించి ఉత్తరాలు ఏమన్నా వచ్చాయేమో చూట్టానికి పోస్టాఫీసుకు వెళ్లాము. ఉత్తరాలేమీ రాలేదు. ఈలోగా సిడ్‌కు బాగా ఆకలేసింది. నన్ను ఇంటికి వెళ్ళి ఏమన్నా తింటానికి పట్రమ్మన్నాడు. అందుకని ఇంటికి వస్తున్నాను. ఇంతలో మీరు ఎదురయ్యారు."

"నువ్వు చెప్పేది నిజమో కాదో ఎలా తెలుస్తుంది నాకు? పద, పోస్టాఫీసు దగ్గిర సిడ్ ఉన్నాడో లేదో చూద్దాము."

చచ్చాననుకున్నాను. సైలాస్ గారు నన్ను చెయ్యిపట్టుకుని పోస్టాఫీసుకి నడిపించాడు. కాని "సిడ్" ఆ ప్రాంతంలో ఎక్కడా ఐపు లేడు. కొంతసేపు అక్కడే ఎదురు చూశాము. ఎంతసేపటికీ "సిడ్" రాలేదు. 'సరే వాడేవస్తాడ్లే మనమింటికి పోదాం పద," అని సైలాస్‌గారు నన్ను లాక్కుపోయాడు.

శాలీపిన్ని నన్ను చూడగానే కావిలించుకుంది. కొంతసేపు ఏడ్చింది కొంతసేపు నవ్వింది. మళ్ళీ నేను క్షేమంగా కంటపడినందుకు సంతోష పడింది. ఇంట్లో ఎవరితో చెప్పకుండా పోయినందుకు బెత్తంతో దేహశుద్ధి చేసింది. సిడ్ వస్తే వాణ్ణికూడా బాత్తానని చెప్పింది.

నేను ఇంట్లోకి వెళ్లేసరికి ఇల్లంతా ఊళ్లోని ఆడవాళ్లతోను, మొగవాళ్ళతోను నిండిపోయి వుంది. అందరూ జిమ్ తప్పించుకు పోవటాన్ని గూర్చే మాట్లాడుతున్నారు. జిమ్ పారిపోయిన విధానం వాళ్లకి మరీ ఆశ్చర్యకరంగా ఉంది. పదిహేను మంది బలిష్ఠులైన మొగవాళ్లు తుపాకులతో కాపలా కాస్తుండగా దొంగలు అంత సాహసించి ఎలా లోపలికొచ్చారో, జిమ్‌ను ఎలా తీసుకుపోయారో వాళ్లకి బోధపడ లేదు.

శాలీపిన్ని "సిడ్" కోసం బెంగ పెట్టుకుంది.

"సిడ్" ఆరోజల్లా ఇంటికి రానేలేదు. ఆ లంకలో టామ్‌సాయర్ ఏమయ్యాడో, డాక్టరేమయ్యాడో, జిమ్ ఏమయ్యాడో నాకూడా తెలియలేదు. సైలాస్‌గారు ఊరంతా ఒక పదిమాట్లయినా వెదికి ఉంటాడు. నేనుకూడా వెళ్ళి వెదుకుతానని శాలీ పిన్నిని అడిగాను. కాని ఆమె నన్ను ఇల్లుకదలితే తాట వొలుస్తానన్నది. ఆరాత్రల్లా మేలుకుని "సిడ్" కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. అతడేమయ్యాడోనని ఆందోళనతో, భయంతో ఆమె తహతహలాడటం, కన్నీళ్లు రాల్చటంచూసి నాకు తలకొట్టి వేసినంత సిగ్గు, బాధ కలిగాయి. వెధవపని చేసి ఆమెను కష్టపెట్టినందుకు నామీద నాకే కోపం వచ్చింది. కాని కిమ్మనకుండా ఆరాత్రి ఎలాగో గడిపాను.

మర్నాడు పొద్దున సైలాస్‌గారు మళ్లీ ఒకసారి ఊళ్లోను, నదిబడ్డున వెదికి వచ్చాడు. శాలీ పిన్ని దుఃఖం ఇంతా అంతా అని చెప్పవీల్లేదు. పొద్దుటి భోజనాల సమయంలో కూడా ఆమె కన్నీళ్లు కార్చటం మానలేదు. కొంతసేపటికి సైలాస్‌గారన్నాడు:

"అన్నట్టు నీకు ఆ ఉత్తరం ఇచ్చానా ?"

"ఏ ఉత్తరం ?" అందశాలీ పిన్ని.

"నిన్న నేను పోస్టాఫీసు నుంచి తెచ్చానే అది."

"ఉహు. ఇవ్వలేదు.

"అరెరె. మర్చిపోయాను," అని జేబులు వెదికి "ఎక్కడ పెట్టానబ్బా ?" అనుకున్నాడు సైలాస్‌గారు. తరవాత లేచి ఇంకో గదిలోకి వెళ్లి ఉత్తరం తీసుకొచ్చాడు.

శాలీ పిన్ని ఉత్తరం తీసి ఎవరు రాశారో చూసింది.

"అరె. మా అక్కయ్య పోలీ రాసింది!" అన్నది.

నేను కాసేపు అటెటో పోయిరావటం మంచిదనుకుని లేచాను. కాని అదృష్టవశాత్తు ఆమె ఉత్తరం చింపకుండానే దాన్ని బల్లమీద పడేసి వాకిలి గుమ్మం దగ్గరికి పరిగెత్తింది గోలున ఏడుస్తూ. ఇంటిల్లిపాదీ. గుమ్మం దగ్గిర మూగారు. నేనుకూడా వెళ్లాను. టామ్‌సాయర్! వాకిట్లో బోలెడుమంది జనం పోగయ్యారు. టామ్‌సాయర్‌ను బల్ల చెక్కమీద

పడుకోబెట్టి ఇద్దరు మోసుకొస్తున్నారు. వెనకాల డాక్టరు, జిమ్ ఉన్నారు. జిమ్ చేతులు లావాటి తాళ్లతో బిగించి కట్టేశారు. నేను గబుక్కున వెనక్కి వెళ్ళి పోలీపెద్దమ్మ ఉత్తరం ఒకచోట దాచేశాను.

టామ్‌ను లోపలికి తీసుకొచ్చారు. వంటిమీద స్పృహ లేదు. ఒకగదిలో పక్క వేసి పడుకోబెట్టారు. శాలీ పిన్నికి కాళ్లుచేతు లాడలేదు. "అయ్యో! ఇంకే ముందే! సిడ్ చచ్చిపోయాడే," అని రొమ్ము బాదుకుంది. కాసేపటికి టామ్ కళ్లు తెరిచి మూలి గాడు. "బతికున్నావా, నాయనా నాబాబూ !" అంటూ శాలీ పిన్ని టామ్‌ను ముద్దులు పెట్టుకుంది.

ఊళ్లోవాళ్లు జిమ్‌ని ఏం చేస్తున్నారో చూద్దామని నేను బయటికి వెళ్లాను. జిమ్‌ను మళ్ళీ పశువుల దొడ్డిలోకే తీసుకువెళ్ళి ఇది వరకటి గదిలోనే కూల వేశారు. కదలటానికి, మెదలటానికి వీల్లేకుండా కాళ్ళు చేతులు కూడా భిగించి కట్టారు. తరవాత తీరుబడిగా జిమ్‌ను అవమానించ సాగారు. నోటికొచ్చిన బూతులు తిట్టారు. ఒకటి రెండు దెబ్బలుకూడా తగలనిచ్చారు. కొందరు జిమ్‌ను ఉరితీయాలని, అలా చేస్తే ఇకమీద నీగ్రో బానిస లెవ్వరూ పారిపోటానికి ప్రయత్నించరనీ కూడా సూచించారు. కాని మరి కొందరు ఉరితీయ్యటం మంచిది కాదన్నారు. ఎందుకంటే అసలు యజమానివచ్చి తన బానిసను ఉరితీసి నందుకు నష్టపరిహారధనం ఇచ్చుకునేందుకు ఎవరూ సిద్ధంగాలేరు గనుక ఉరితీయ వద్దనీ అన్నారు.

ఇంతసేపూ జిమ్ మౌనంగా అన్నీ సహించాడు. నన్ను ఎరిగిఉన్నట్లు మాత్రం బయట పెట్టలేదు. జిమ్‌ను అవమానించటం అయిపోయిన తర్వాత ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. అసలు యజమాని వచ్చి జిమ్‌ను తీసుకుపోయే దాకా అతనికి రొట్టె, మంచినీళ్లు తప్ప ఇంకేమీ ఆహారం ఇవ్వకూడదనీ, ప్రతిరాత్రి ఇద్దరు మనుషులు తుపాకులు పుచ్చుకొని జిమ్ గదివద్ద కాపలా కాయాలనీ, అసలు యజమాని కొంత కాలంలోగా రాకపోతే జిమ్‌ను వేలంవేసి అమ్మివెయ్యాలని ఏర్పాటు చేసుకున్నారు. వాళ్లు వెళ్లబోయే ముందు అక్కడికి డాక్టరు వచ్చాడు. ఆయన వాళ్లతో ఇలా చెప్పాడు:

"పాపం నీగ్రోని ఏమీ బాధ పెట్టకండి. నిజానికి వీడు చాలా మంచి వాడులాగా కనిపిస్తున్నాడు. ఆకుర్రవాడు దెబ్బతగిలి ఆలంకలో ఒంటరిగా ఉన్నాడు. నేను వెళ్లి కాల్లో ఇరుక్కున్న తూటా తీయటానికి ప్రయత్నించాను. కాని నా ఒక్కడికీ అది సాధ్యం కాలేదు కుర్రాణ్ణి కదలకుండా ఎవరో పట్టుకుంటే నే గాని తూటా ఇవతలకు లాగటానికి వీల్లేక పోయింది. ఆ అబ్బాయికూడా సంధించిన వాడిలాగ పిచ్చిగా వాగటం మొదలెట్టాడు. తన దరిమేనా రావద్దన్నాడు. తన పడవమీద సీమసున్నం గుర్తులు పెడితే చంపేస్తానన్నాడు. నేను ఆ అబ్బాయిని ఒంటరిగా విడిచిపెట్టి సహాయంకోసం వెళ్లటానికి ఇష్టంలేక ఏం చెయ్యాలో తెలియక తికమక పడ్డాను. ఇంతలో అదృష్టవశాత్తు ఈ నీగ్రో ఎక్కణ్ణించి వచ్చాడో—వచ్చి తను సహాయం చేస్తానన్నాడు. చెయ్యమన్నాను. ఈ నీగ్రో సహాయంతో కుర్రాడి కాల్లోంచి తూటా కోసి లాగేశాను. ఇతడు పారిపోయిన నీగ్రో అని నేను గ్రహించాను. ఏదన్నా పడవ ఆ సమీపానికి వస్తుందేమో పడవ వాళ్ల సహాయంతో ఈ నీగ్రోను పట్టుకుని, కుర్రాణ్ణి తీసుకుని ఊళ్లోకి వద్దామనుకున్నాను. నిన్న నల్లా ఆ లంకదగ్గిరిగా ఏపడవా రాలేదు. ఇవ్వాళ పొద్దున ఏదో పడవ ఈతోగు వస్తోంది. నేను కేకలువేసి ఆపడవను దగ్గిరికి పిలిచాను. పాపం ఈ నీగ్రో తను

పట్టుబడతానని, తన స్వేచ్ఛ అంతమౌతుందని తెలిసి కూడా పారిపోలేదు. పడవవాళ్ల సహాయంతో నీగ్రోను పట్టుకుని, ఆ కుర్రాణ్ణి పడవలోకి ఎక్కించి ఇక్కడికి తీసుకొచ్చాను. అందుచేత ఈ నీగ్రోను ఏమీ దూషించకండి. కాస్త మర్యాదగా చూడండి"

డాక్టరు ఆదేశాన్ని అంతా ఒప్పుకున్నారు. జిమ్‌మీద వారికి కొంత మంచి అభిప్రాయం ఏర్పడి నట్లు నాకు తోచింది. జిమ్‌కు కాస్త మంచి ఆహారం ఇవ్వటానికి, కాళ్లకట్లు సడలించటానికి ఒప్పుకుంటా రేమో ననుకున్నాను కాని వాళ్లామాటే తలపెట్టలేదు, ఎవళ్లదారిని వాళ్లు ఇళ్లకు వెళ్లిపోయారు.

నాకొక కొత్త సమస్య తగిలింది. సైలాస్ గారితో గాని, శాలీ పిన్నితో గాని "సిడ్"కు తుపాకి తూటా తగిలిందని చెప్పలేదు. ఇప్పుడు వాళ్లు అడిగితే ఏమని సమాధానం చెప్పటం? అయితే అదృష్టవశాత్తు శాలీ పిన్ని "సిడ్"కు పరిచర్యలు చేయటంలో మునిగిపోయి నన్ను ఆవిషయం అడగటం మరిచిపోయింది. సైలాస్‌గారు కూడా నన్ను అడగలేదు. ఆయన కనిపించినప్పుడల్లా అక్కడ నిలవకుండా తప్పించుకునే వాణ్ణి.

మర్నాటి ఉదయానికి టామ్‌సాయర్ కొంత తేరుకున్నాడు. శాలీ పిన్ని ఆగదిలో లేకుండా చూసి టామ్‌తో ఒంటరిగా మాట్లాడదామని వెళ్లాను. మా ఉభయుల ప్రవర్తనను శాలీ పిన్నికి ఏ విధంగా విశదపరచాలో చర్చించాలనుకున్నాను. కాని నేను వెళ్లే టప్పటికి టామ్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. లేచే వరకూ ఆగుదామని అక్కడే కూర్చున్నాను. కొంత సేపటికి శాలీ పిన్ని వచ్చింది. నేను పిల్లిలాగ అవతలకు పోబోయాను. కాని ఆమె నన్ను పట్టుకుని తన పక్కన కూర్చోబెట్టుకుంది. "సిడ్" దేవుడి దయవల్ల కోలుకుంటున్నాడనీ, ఇక ఫర్వాలేదనీ అన్నది. ఇంతలో టామ్ లేచాడు. కళ్లు తెరచి నన్ను చూస్తూనే అడిగాడు:

"అరె నేనిక్కడికెలా వచ్చాను? మన పడవ ఏమయింది?"

"మనపడవ జాగ్రత్తగానే ఉంది," అన్నాను.

"జిమ్ ఏడీ?"

"జిమ్ బాగానే ఉన్నాడు."

"రైట్! బలే. ఇక మనకేం ఫర్వాలేదు. ఇప్పుడు పిన్నితో చెప్పెయ్యొచ్చు సంగతంతా."

"ఏ సంగతి?" అన్నది శాలీపిన్ని

"ఏమిటేమిటి? మేం ఎంత గొప్ప ఘనకార్యం చేశామనుకున్నావు?"

"ఏం ఘనకార్యం?"

"జిమ్‌ను ఖైదులోంచి తప్పించింది ఎవరనుకున్నావ్ పిన్నీ? మేమే."

"మీారా ? నీకు మళ్లీ సంధించి నట్టుంది సిడ్! ఏమిటా పిచ్చిమాటలు ?"

"సంధించ లేదు, ఏం లేదు. నిజం పిన్నీ! నేనూ, టామ్‌కలిసి జిమ్‌ను తప్పించటాని కెన్ని తిప్పలు పడ్డా మను కున్నావ్ ? ప్రతిరాత్రి మీారంతా నిద్రపోయాక నేనూ టామ్ పశువుల దొడ్డివద్దకు వెళ్ళేవాళ్లం. రాత్రులకు రాత్రులు, వారాలు తరబడి జిమ్ గదిలోకి సొరంగం తవ్వాం. ఆకాశ రామన్న ఉత్తరాలు రాసింది మేమే. తలుపులమీాద బొమ్మలు వేసింది మేమే. ఆఖరురోజు రాత్రి జిమ్‌ను సొరంగంలోంచి ఇవతలకు తీసుకొచ్చి అందర్నీ తప్పించుకుని నది మధ్య లంకలోకి పారిపోయింది మేమే."

"! నిజంగానా? మమ్మల్నింత హడలగొట్టింది మీారా ? హోరి వెధవల్లారా ! ఎంత పని చేశార్రా ? దొంగలో, దెయ్యాలోనని మేము ఇంత భయపడుతుంటే మీారు వెధవపనులు చేసి మమ్మల్ని ఏడిపించారా ? మీాకదుపుడక ! ఆగు. నీవల్లు బాగుపడనీ. నిన్ను పట్టుకుని తన్నకపోతే అప్పుడను. సిడ్ ! ఇహనుంచీ మీారు ఆనీగ్రో చాయలకి వెళ్లారంటే ఊరుకోను. వాడితో మాట్లాడినా, ఆకొట్టు దగ్గరికి వెళ్ళినా తన్నేస్తాను."

"జిమ్ ఇక్కడెక్కడున్నాడు? పారిపోయాడుగా ?" అన్నాడు టామ్ అనుమానంగా.

"ఎక్కడికి పారిపోతాడు దొంగ ? మళ్ళీ పట్టుకొచ్చి కట్టేశారు గా !"

టామ్‌సాయర్ ఈమాటలు విని పడుకున్న వాడల్లా లేచి కూర్చున్నాడు:

"టామ్ ! జిమ్‌ను కట్టెయ్యటానికి వీళ్ల కధికారంలేదు. పో కట్లువిప్పేసి విడిపించు. జిమ్ స్వతంత్రుడు ! బానిస కాదు ! త్వరగాపో !" అని అరిచాడు టామ్.

"ఏమిటిది? పిల్లడు ఇల్లా మాట్లాడతా డేమిటి? నిజంగానే మళ్లీ సంధించింది," అన్నది శాలీ పిన్ని. టామ్‌సాయర్ మాటలు నాక్కూడా అర్థం కాలేదు. మళ్లీ టామ్ మొదలెట్టాడు.

"పిన్నీ! నేను చెప్పింది నిజం. విను. ఆనీగ్రోని నేను పుట్టినప్పటి నుంచీ ఎరుగుదును. అతనిది మావూరే. టామ్‌కూడా అతణ్నెరుగును. మావూళ్లో మిస్‌వాట్సన్ అని ఒకావిడ వుండేది. ఆవిడ బానిసే జిమ్. ఆమె రెండు నెల్ల కిందట పాపం చనిపోయింది. చనిపోతూ వీలునామా రాసింది. అందులో జిమ్‌కు తను స్వేచ్ఛఇచ్చి వేస్తున్నానని రాసింది. జిమ్ బానిస కాడు. స్వతంత్రుడు !"

"అయితే వాణ్ణి విడిపించటాని కింత శ్రమపడ్డావెందుకు ?" అంది శాలీపిన్ని ముక్కుమీాద వేలేసుకుని.

"అక్కడే వుంది గమత్తు. మీా ఆడవాళ్లకది అర్థంకాదు. ఖైదు చెయ్యబడిన నీగ్రోను విడిపించటంలో ఎంత సాహసం, ఎంత ఆనందంవుందో నీకేం తెలుసు? అందుకోసం నెత్తురు మడుగుల్లో ఈదుకు పోవల్సి వచ్చినా సందేహించే వాణ్ణికాను—అరె!!" పోలీ పెద్దమ్మ!! హా!!

అదిరిపడి వెనక్కి చూశాను. సాక్షాత్తు పోలీ పెద్దమ్మే గది గుమ్మంలో నడుముమీాద చేతులు వేసుకుని నుంచుని వుంది. ఆకాశంలోంచి పిడుగు ఊడి పడ్డట్టు ప్రత్యక్షమైన ఆ ఆకారాన్ని చూడగానే నాకు క్షణకాలం గుండె స్తంభించింది.

శాలీ పిన్ని పోలీపెద్దమ్మను చూడగానే ఎగిరి లేచి కావిలించుకుంది. ఈలోగా నేను టామ్ మంచంకింద దూరాను. మంచం కిందినించి పోలీ పెద్దమ్మ నాకు కనబడుతూనే వుంది. ఆమె కళ్లజోడు ముక్కుచివరికి లాగి టామ్‌కేసి చూస్తోంది. ఆచూపు ఎదటి మనిషిని పాతాళానికి తొక్కేసేటంత తీవ్రంగా ఉంది.

"టామ్ ! ఏ మొహం పెట్టుకుని నావంక చూస్తున్నావు? నేనే నువ్వయితే మొహం చూపించటానికి బదులు చచ్చిపోయేదాన్ని," అన్నదామె.

"అదేమిటే అక్కా ? వాడింతలోకే అంత మారి పోయాడా? వాడు టామ్‌కాదు—సిడ్. టామ్ ఏడీ? ఇప్పటిదాకా ఇక్కడే ఉన్నాడుగా? టామ్ !"

"టామ్‌కాదు హాకల్ బెరీఫిన్ ! నాచేతుల్తో పెంచిన టామ్‌ను నేనెరగ నంటావా ? టామ్ ఎంత రౌడీ వెధవో నాకు తెలియదంటావా? హక్‌ఫిన్ ! ఆ మంచం కిందనుంచి ఇవతలకురా."

నేను ఇవతలకు వచ్చాను పిల్లిలాగ. తారుమారైన మాఇద్దరి మారుపేర్లతో ఇంట్లో వాళ్లంతా

ఆరోజంతా ఎంత కంగారు పడ్డారో చెప్పలేను.

పోలీపెద్దమ్మ తీరుబడిగా శాలీపిన్నికి విషయమంతా వివరించి చెప్పింది. నాపేరు, పుట్టుపూర్వోత్తరాలు అన్నీ చెప్పింది. నేను నా ప్రవర్తననుకూడా శాలీపిన్నికి వివరించిచెప్పాను. ఆమె నన్ను మొదట చూసీచూడగానే టామ్‌సాయర్ అని భ్రమించటం వల్ల నా అసలు పేరు చెప్పటానికి వీలుచిక్కలేదనీ, ఆమెను బాధపెట్టటం ఇష్టంలేక అసలు టామ్ వచ్చాకకూడా మేమిద్దరం కూడబలుక్కొని టామ్ సాయర్‌గానే చివరిదాకా చెలామణీకావల్సివచ్చిందనీ చెప్పాను.

టామ్‌సాయర్ ఇందాక చెప్పినట్టు మిస్ వాట్సన్ జిమ్‌కు స్వేచ్ఛఇచ్చినమాట నిజమేనని పోలీపెద్దమ్మ చెప్పింది. ఆమెచెప్పినదాకా టామ్‌మాటలు నేను కూడా నమ్మలేదు. ఇప్పుడది నిజమని తేలింది. దాంతో నాకు టామ్‌మీద అదివరకేర్పడిన దురభిప్రాయంకూడా తొలగిపోయింది. బానిసమైన నీగ్రోను టామ్‌లాంటి మర్యాదగల పెద్దమనిషి విడిపించటానికి ప్రయత్నించటం ఎంతవిరుద్ధం! కనక జిమ్ స్వతంత్రుడని తెలిసే, టామ్ కేవలం తన సాహసం ప్రదర్శించటంకోసం ఇంత హైరాన పడ్డాడన్నమాట. జిమ్ నిజంగా బానిసేఅయితే టామ్‌సాయర్ అలా ప్రవర్తించిఉండేవాడా? ఏమో?

ఇక పోలీపెద్దమ్మ ఆ సమయానికి శాలీపిన్నిగారింటికెలావచ్చిందీ అన్నవిషయం—శాలీపిన్ని పోలీపెద్దమ్మకు కొన్నిరోజులకిందట ఉత్తరం రాసిందట, టామ్, సిడ్ క్షేమంగా తమ ఇంటికి చేరారని. ఆ ఉత్తరం చూసుకుని పోలీ పెద్దమ్మ ఆశ్చర్య పడిందట: "నేను టామ్‌ను ఒక్కణ్ణే పంపాను గదా! సిడ్‌కూడా వచ్చాడని రాస్తుందేమిటి మాచెల్లాయి? ఇందులో టామ్ కుట్ర ఏదో ఉంది. చచ్చినట్టు ఈ పదకొండు వందలమైళ్లూ పోయి కుట్రను భేదించాలి," అనుకుని అప్పటికప్పుడు పడవ మాట్లాడుకుని బయల్దేరి చక్కా వచ్చిందట.

శాలీపిన్ని ఈకథంతా విని "పోసీ ఉత్తరం ముక్కరాయక పోయావా?" అన్నది.

"నేను రెండు ఉత్తరాలు రాశాను. నువ్వు జవాబు రాయందే ఒక్కదానికీ!"

"నువ్వు ఉత్తరాలు రాశావా? నాకు అందలేదే?" అని ఆశ్చర్యపడింది శాలీ పిన్ని.

"టామ్?" అని గర్జించింది పెద్దమ్మ.

"ఏమిటి పెద్దమ్మా! నేనేం చేశాను?"

"ఆ ఉత్తరాలెక్కడ దాచావో ఇటుపడెయ్యి."

"ఏ ఉత్తరాలు?"

"మాట్లాడకుండా ఇటు పడెయ్. చర్మం వొలిచేస్తా."

"నా ట్రంకు పెట్టెలో ఉన్నాయి. తీసుకో నేను వాటిని విప్పి చదవలేదు. పోస్టాఫీసులోంచి తెచ్చినప్పుడెలాఉన్నాయో అలాగే ఉన్నాయి. ఆ ఉత్తరాలు శాలీపిన్ని చూస్తే తంటా వస్తుందని దాచాను."

"వెధవపనులూ నువ్వూను. చెల్లీ. నేను వస్తున్నట్టు రాసిన ఉత్తరం అందిందా పోని?"

"అందింది. నిన్న మా ఆయన ఇచ్చారు. కాని నేను దాన్ని చదవలేదు."

అది ఆవిడదగ్గరుంటేగా చదవటానికి, అనుకున్నాను. కాని ఆముక్క పైకి అనలేదు.

29

టామ్‌కు ఆరోగ్యం బాగుపడింది. కాలిగాయం చాలవరకు మానిపోయింది. ఒకరోజున అడిగాను - "జిమ్ అదివరకే స్వేచ్ఛపొందినట్టు తెలుసుగదా? విడిపించటానికి అంత శ్రమ ఎందుకుపడ్డావు? విడిపించిన తర్వాత ఏం చేద్దామనుకున్నావు?" అని.

"జిమ్‌ను విడిపించి పడవలో నదీముఖద్వారం దాకా పోదామనుకున్నాను. అక్కడ అసలుసంగతి జిమ్‌తో చెప్పి మళ్ళీ వెనక్కి మన ఊరికి ప్రయాణమై పోదామనీ, ఊళ్లో నీగ్రోలందర్నీ ముందే సమావేశం చేసి జిమ్‌ను ఊరేగింపుగా ఊళ్లోకి గౌరవ లాంఛనాలతోసహా తీసుకువెళ్లాలనీ అనుకున్నాను. దాంతో జిమ్‌తోపాటు మనంకూడా గొప్పవాళ్లమైపోయేవాళ్లం. అదీ అసలు నేను వేసినప్లాను. కాని అదంతా తలకిందులైంది," అన్నాడు టామ్.

జిమ్ ఇప్పుడు స్వతంత్రుడయ్యాడు. తను బంధింపబడతానని తెలిసికూడా అతడు టామ్‌కు వైద్యంచేయటంలో డాక్టరుకు సహాయంచేసినందుకు

(37-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



8. ఉదయాస్తమయాల్లో సూర్య చంద్రులు ఎర్రగా వుంటారేం?

ఏ పదార్థమేనా మనకి కనపడడానికి కారణం ఆ పదార్థమునుంచి మనకంటికి చేరే కిరణాలే. నడినెత్తినున్నప్పుడు సూర్య చంద్రులనుంచి మనకి చేరే కిరణాల్లో లేని రాగాధిక్యము ఉదయాస్తమయాల్లో మనకి చేరే కిరణాల్లో ఎలాగు ప్రవేశిస్తుందీ? అని ప్రశ్న.

తెల్లని కిరణాల్లో నీల లోహిత, నీలి, నీల, హారిత (ఆకుపచ్చ), పీత (పసుపు), నారింజ, రక్తవర్ణ కిరణాలన్నీ చేరిపోయి వుంటాయి. వీటిలో నీల, పీత, రక్తవర్ణ కిరణాల పాళ్లు ఎక్కువ.

తెల్లని కిరణాలు గాలిలోనుంచి చొచ్చుకుపోయినప్పుడు గాలి కణాలూ, నీటి కణాలూ, ధూళి కణాలూ పైరంగుల కిరణాలన్నిటినీ విరజిమ్ముతాయి గాని, ఈ విరజిమ్ముడు నీలలోహితము నుంచి రక్తవర్ణమువరకూ క్రమంగా హీనమైపోతుంది. అంటే నీటి కణాలూ ధూళికణాలూ విరజిమ్మడమువల్ల సూర్యచంద్రుల కిరణాల్లో నీలలోహిత, నీలి, నీల వర్ణ కిరణాలు ఎక్కువగా లోపించిపోతాయి. అందువల్ల పీత, రక్త, వర్ణాలు బలమైనట్లు కనపడతాయి.

భూమిమీద లేదా సముద్రముమీద గాలిలో తేలియాడే ధూళి-లేక నీటి-కణాలు భూమికి చేరువగా దట్టంగానూ, క్రమంగా ఎత్తు హెచ్చిన కొద్దీ పల్చగానూ వుంటాయి. కనుక నడినెత్తిన వున్న సూర్య చంద్రులనుంచి మనకు చేరే కిరణాల కంటె, ఉదయాస్తమయ సమయాల్లోని కిరణాలు భూమికి రాసుకుంటూ, అంటే ధూళికణాలచేతా నీటికణాలచేతా ఎక్కువ విరజిమ్మబడుతూ, ఎక్కువ దూరము ప్రయాణిస్తాయి. కాబట్టి విరజిమ్మబడిన నీల కిరణాల లోపము, అనగా రాగాధిక్యము సూర్య చంద్రుల వెలుగులో-అంటే బింబాల్లో - ఉదయాస్తమయసమయాల్లో ఎక్కువగా కనపడుతుంది.


9. గోదావరికంటె కాలవ వేగంగా ప్రవహిస్తుందేం?

గోదావరీ, కృష్ణా, లాంటి నదులకు ఆనకట్టలు కట్టి నీటిని కాలవలద్వారా పంట పొలాలకందిస్తారని అందరికీ తెలుసును. కాని గోదావరికంటె గోదావరి కాలవలు వేగంగా పారుతూంటాయి. కాలవల్లో స్నానం చేసినప్పుడు ఈ సంగతి బాగా అనుభవమౌతుంది.

కాలవలు స్వతస్సిద్ధంగా ఏర్పడినవి కావు. ప్రభుత్వమువారు తవ్వించి గట్లుపోసినవి. కనక, నదినుంచి వచ్చే బురదనీరు నెమ్మదిగా పారేటట్లే ఏర్పాటుచేస్తే, ఈ బురదమన్ను అడుక్కి దిగి కాలవని మెరక చేసేస్తుంది. ఏడాది ఏడాదీ తవ్వించి మామూలు లోతు చేయించడానికి ప్రభుత్వము వారికి ఖర్చు ఎక్కువౌతుంది.

(35-వ పేజీ చూడండి)


గడియారం చెప్పిన కథ



(గత సంచిక తరువాయి)

తడవ తడవకు ఒకమనిషి నీళ్లు తోడి పోయనక్కర లేకుండానే పనిచేసే గడియారాన్ని ఒక దానిని తనలాటి కుర్రాడే ఒకడు మునుపు కనిపెట్టాడని గడియారం చెప్పేసరికి సుందరానికి బలే సరదా పుటుకు వచ్చింది. ఏమో-తను మాత్రం ఆ కుర్రాడిలాగే ఓ గొప్ప గడియారాన్ని కనిపెట్టేస్తాడేమో! ఎవరు చెప్పగలరు.

"ఏమోయ్; సుందరం వింటున్నావ! ఈజిప్టు దేశంలో అలెగ్జాండ్రియా అనే ఒక పెద్ద పట్టణం వున్నది ఇది చాలా చరిత్ర ప్రసిద్ధికల పట్టణం. ఆ పట్టణంలో కొన్నివందల ఏండ్ల క్రితం ఒక మంగలి వుంటూవుండేవాడు. ఆతనికి ఒక కొడుకు. అతనిపేరు టెసిబియస్. నీయీడే వుంటుందో! లేకపోతే యింకొంచెం పెద్దవాడో. ఏదో కులవృత్తిగా వస్తున్న మంగలి పనే కొడుక్కి నేర్పాలని తండ్రి అనుకొన్నాడు కానీ, కొడుక్కి మాత్రం ఆపని చేయటం యిష్టం లేదు. ఇతనికి ఎంతసేపూ సుత్తీ వులీ పుచ్చుకు ఏవో చిన్న చిన్న మిషన్లు తయారు చేయటమంటే సరదా. ఇలా వుండగా ఆతని దృష్టిని యీ నీటి గడియారాలు ఆకర్షించాయి. ప్రతిసారీ ఒకమనిషి దాని విషయం చూడవలసి వస్తూ వుండటం అతనికి చిరాకుగా తోచింది. దానంతటికదే ఒకరు సరిచూడ నక్కర లేకుండా పని చేసుకొనిపోయే నీటి గడియారం కనిపెట్టాలని అతనికి బుద్ధి పుట్టింది. ఆలోచించటం మొదలు పెట్టాడు. ఆలోచించి, ఆలోచించి చివరకు కొయ్యతో యిద్దరు కుర్రాళ్ల బొమ్మలు చెక్కి ఆ రెండు బొమ్మలకూ యీ నీటిని తోడే పని అప్పగించాడు"



"కొయ్య బొమ్మలచేత నీళ్లు ఎలా తోడించాడయ్యా. నీ దంతా మరీ వోద్యంగా వుందే!" అన్నాడు సుందరం.

"అబ్బ! తొందర పడకోయ్ సుందరం చెపుతున్నాగా. ముందు అతను చేసిన గడియారాన్ని వర్ణిస్తాను. జాగ్రత్తగా విను. రెక్కలువున్న కుర్రాడొకడు ఒక చిన్నకర్ర ముక్కను చేతితో పట్టుకొని ఎదురుగుండా వుండే గుండ్రటి దిమ్మ మీదకు చూపిస్తుంటాడు; ఆ గడియారంలో ఆ దిమ్మమీద అడుగు నుంచీ పైకి 1 మొదలు 12 వరకు రోమన్ అంకెలు ఒక వరుస, అరబిక్ అంకెలు ఒకవసున చెక్కి వుంటాయి. పొద్దు గడచిన కొద్దీ చేతిలో కర్రతో పాటు యీ కుర్రాడు వున్న దిమ్మ పైకి పెరుగుతూ వుంటుంది. సాయంకాలమయ్యేసరికి 12 వ గంట దగ్గిరకు, అంటే ఆ గుండ్రటి దిమ్మ కొన వరకు కుర్రాడు కూర్చొన్న దిమ్మ పైకి లేచి వుంటుందన్నమాట. సరిగ్గా 12 వ గంటకు చేరేసరికి టపుక్కున ఆ కుర్రాడు

కూర్చొనే దిమ్మ కిందికి దించుకుపోయి మళ్లీ 1 నుంచీ 12 వరకు పైకి పాకటం మొదలు పెట్టేది."

"అయితే రెండు వరసల అంకెలు ఎందుకు వేశాడో చెప్పావు కాదు."

"ఒకవరస పగటి గంటలకనీ, రెండో వరస రాత్రి గంటలకనీ ఏర్పాటు చేశాడు. అయిందా— ఒకవైపున యీ రెక్కల కుర్రాడు కర్ర పుచ్చుకు పైకి పాకుతూ,—కిందికి పడిపోతూ వుంటే దిమ్మకు రెండో పక్కను ఒక కుర్రాడు తల వంచుకు కూర్చుని కళ్ల వెంట ఏకధారగా నీళ్లు కారుస్తుండే వాడు.

"ఏడుపు ఎందుకూ ?"

"అయ్యో! ఇంతకాలం యిలా వృధాగా గడచి పోతున్నదే' అని అయివుండ వచ్చు."

"ఏమిటో ఏడ్పు. ఇంతకీ ఆకొయ్య బొమ్మలు యిద్దరూ గడియారాన్ని ఎలా నడిపేవారో చెప్పావు కాదు."

"ఎలా నడిపే వారంటే - ఈ గడియారాని కంతటికీ అడుగున ఒక నీటితొట్టి వుండేది. ఆ ఏడుపుగొట్టు కుర్రాడు వున్నాడే - వాడి కంటి వెంబడి కారే నీరంతా అడుగున వున్న ఒక పళ్లెంలోపడి అక్కడి నుంచి అడుగున వుండే తొట్టిలోకి ప్రవహిస్తుంది. ఆ తొట్టిలో ఒక బిరడా నీటిపైన తేలుతూ వుంటుంది. ఈ బిరడా పైభాగానికి రెక్కలు వుండే కుర్రాడు కూర్చొనే దిమ్మ అతికించి వుంటుంది. ఇప్పుడు ఏమిటి అవుతుందన్న మాట? అక్కడ ఆఏడ్పుగొట్టుకుర్రాడు కార్చిన కన్నీళ్లు ఎక్కువై అడుగున తొట్టిలో చేరినకొద్ది ఆ బిరడా యింకా పైకి తేలుతుంది. దానితో పాటు ఆ బిరడా పై భాగానికి అంటించివున్న రెక్కల కుర్రాడు పైకి పాక్తుతాడన్న మాట. అలా పాకిపాకి 12 గంటల హద్దు చేరే లోగా యిక్కడ అడుగున తొట్టిలో చేరిన నీరంతా కూడా మరొక గొట్టంలో గుండా యింకో తొట్టిలోకి ప్రవహించి అక్కడ మళ్లీ ఆ ఏడ్పుగొట్టు కుర్రాడి కళ్ల నీళ్లుగా యివతల పడటం ప్రారంభిస్తుందన్న మాట. ఇప్పుడు బోధ పడిందా."

"బోధపడింది కానీ ఆమాదిరి గడియారం ఒకసారి చూస్తే యింకా బాగా అర్థమౌతుంది."

"నిజమేకానీ ఆమాదిరి గడియారాలు యిప్పుడు ఎక్కడా లేవే. అదంతా ఎందుకు? అసలు యిలా కొయ్య బొమ్మలచేత గడియారం నడిపించటం, అందులో ఒకబొమ్మ కాలగతికి దురపిల్లుతూ సంతత ధారగా విలపిస్తూ వుండటం - యిది అంతా తమాషాగా వుంది కదూ?"

"తమాషాగానే వుంది."

ఎంత తమాషాగావున్న దంటే- రాజాధిరాజులు యిలాటి గడియారాలను ఒకరి కొకరు అపురూపమైన బహుమానాలుగా యిచ్చుకొనే వారు. ఇటలీరాజు థియొడోర్ కాలములో వుండే ఒకానొకడు యించుమించు యిదే పద్ధతిని వుపయోగించి, టైం ఒక్కటే కాక, ఆకాశంలో ఏ నక్షత్రం ఎలా కదులుతున్నదీ తెలిపే గడియారాన్ని ఒకదానిని తయారు చేశాడు."

గడియారం యింతవరకు చెప్పేసరికి ఎక్కడిదో అలారం గడియారం మోగింది. సుందరం ఒకే ధ్యాసలో వింటువ్నాడేమో, ప్రక్కయింటి గడియారం అలారం కొట్టటం మొదలు పెట్టేసరికి, వులిక్కి పడ్డాడు. తన ఎదురుగా కబుర్లు చెప్పుతున్న గడియారం "వులిక్కి పడ్డావా! సుందరం. నీవు చరుచుకో. లేకపోతే నన్ను చరవమంటావా ?"

"ఎమీ అక్కరలేదు పో."

"చైనా దేశంలో 'నిప్పు అలారం గడియారం'వుపయోగించే వారు. నీకు తెలుసా"

"నాకేం తెలియదు."

"చెప్తా;వింటావా!" (ఇంకావుంది)

విజ్ఞాన వీధులు

(3౭-వ పేజీ తరువాయి)

ఈ చిక్కు తగ్గడానికి, కాలవల్లోని ప్రవాహాన్ని వైరు తలుపులు ఎడముచేసి జోరుచేస్తారు. అయితే నదీగర్భము మాత్రము ఒండ్రుమన్ను అడుక్కి దిగిపోవడము వల్ల మెఱక అయిపోదా? మరి నదికేమిటి చికిత్స? అని పాఠకులడగవచ్చును. అంత వెడల్పున్న నదికేమి చెయ్యగలరు? నదీ గర్భము మెఱక అవగా అవగా ఆ నదిలో నీరు నిలవదు, కొన్నేళ్లకు కాలవలు పనికిరావు.

10. పొలంలో కలుపు మొలవకుండా వుండాలంటే?

ఏమి చెయ్యాలి? అని ప్రశ్న. నదినీరు గాని యేటినీరుగాని సాగుకు ఉపయోగించిన పొలాలన్నిటిలోనూ కలుపు మొక్కలు తప్పవు. ఆ నదీ నదాల కిటూ అటూ కురిసిన వర్షపు నీరే నదుల్లో చేరి ప్రవహిస్తుందనీ, ఆ నీరు తెచ్చే ఒండ్రుమన్ను పొలానికి మంచి సారమనీ మనకి తెలుసును. కాని ఒండ్రు మన్నుతోపాటు, ఆ వర్షపు నీటితో అడవుల్లో పెరిగే రకరకాల చిన్న మొక్కల విత్తనాలు కూడా కొట్టుకువచ్చి, ఆ నీటితో పాటు పొలాలకి ఎక్కుతాయని ఎంతమందికో తెలియదు ఈ విత్తనాలే కలుపు మొక్కలుగా బయల్దేరతాయి. నీటి నాన్పుడుకి కుళ్ళిపోయినవి పోగా మొలకెత్తి బతికిన వాటిని 'కలుపుతీత' లో లాగి పారేస్తారు. కలుపే మొలవకుండా వుండాలంటే ఏటి నీరూ, నదినీరూ కాక నూతుల నీరు పెట్టి సాగు చేస్తే సరి. నూతినీరు భూగర్భములోనిది కనక కలుపు విత్తనాలు వుండవు. అంతే కాదు, ఒండ్రు మన్నూ వుండదు. లాగి పారవేసే లోపుగా కలుపుచేసే అపకారముకంటె ఈ ఒండ్రుమన్ను చేసే ఉపకారము ఎక్కువ. కనక దొరికితే ఏటి నీరే వాడతారు పొలాలకి. ★

ఖాజీ తీర్పు

(24-వ పేజీ తరువాయి)

"అయితే-పోనీ నీ మాన నష్టానికి గాను యీవ్యక్తి ఓకాసు యిచ్చుకొంటాడులే" అని ఖాజీ ముల్లాను సముదాయించ బోయాడు. ఆవ్యక్తి తనవద్ద కాసు లేదనీ, యింటికి వెళ్లితే కాని రాదనీ చెప్పుకొన్నాడు.

"వీణ్ణి యింటికి పోనిస్తే మళ్లా నాకూ, మీకూ కూడా వీడు కలలోనైనా కన్పించడు. వీల్లేదు; వీణ్ణి యిక్కడనుంచి ఒక్క అడుగైనా కదలనీయటానికి వీలు లేదు." అని ముల్లా మంకుపట్టు పట్టాడు.

ఖాజీకి మా మంచి చిక్కు వచ్చి పడ్డది. ఆవ్యక్తి చూడకుండా ముల్లాను కొట్టటమేమో తప్పే. అందుకు బదులు వీణ్ణి ఒక దెబ్బ వేసి కసి తీర్చుకోవయ్యా అంటే అందుకు ముల్లా ఒప్పుకోడాయె. వాణ్ణి ఓకాసు యిచ్చుకో మంటే వాడేమో నాదగ్గర లేదంటాడాయె. వాడు యింటికి పోయితెస్తా నంటే యీ ముల్లా ఒప్పుకోడాయె ఏం చేస్తాడూ, ఖాజీ? అందుకని ముల్లాను ఎల్లాగైనా ఒప్పించాలనే వుద్దేశంతో "ఎందుకలా తొందర పడతావు, ముల్లా! నేనున్నాగా! వాణ్ణిపోనీ" అన్నాడు.

ముల్లా కూడా ఆలోచించాడు. "సరే మీ యిష్టం. మీరు 'నేను వున్నానుగా,' అన్నారు గనుక వాడు యింటికిపోయి రావటానికి ఒప్పుకొంటున్నాను." అన్నాడు. ఆవ్యక్తి వెళ్లాడు.

వెళ్లినవాడు ఎంత సేపటికీ రాలేదు. ముల్లాకేమో కోపం ముంచుకు వస్తున్నది. ఓపిక పట్ట గలిగినంత సేపు ఓపికపట్టి, యిక ఆగలేక "ఏమయ్యా! వాడు కాసు పట్టుకోస్తానంటే పెద్ద భరోసాతో పంపించావు. ఏడీ వాడు? వాడు ఏడీ అంట?" అని అరిచాడు.

"వుండవయ్యా! వస్తాడు. తొందర పడితే ఎలా?" అంటూ ఖాజీ దీర్ఘాలు తీస్తున్నాడు. ముల్లా వళ్లు మండుకుపోయి ఆచి చూచి ఖాజీ లెంపమీద ఒకటి వుచ్చుకొన్నాడు. ఖాజీ నోరు తెరిచేశాడు.

"ఏం! నోరు తెరచి అట్లా చూస్తావేం? వాడు తప్పక తిరిగి వస్తాడని నీకేమో అంత నమ్మకం వుందిగా. ఇప్పుడు యీ దెబ్బ తీసుకొని, వాడు వచ్చినప్పుడు దెబ్బకు గాను వాడు యిచ్చే కాసుకూడా నువ్వే తీసుకో; మహారాజులాగా!" అని చెప్పి ముల్లా చరచరా వెళ్లిపోయాడు.

ఖాజీ, పాపం! బిక్కమొగం వేశాడు. ★

'ఒంటిగీత బొమ్మ'



శివపార్వతీ నృత్యం
మిస్ బాల

హకల్ బెరీ ఫిన్

(31-వ పేజీ తరువాయి)

శాలీపిన్ని, సైలాస్‌గారు అతనికెంతో కృతజ్ఞత చూపించారు. అన్నిరోజులు కిమ్మనకుండా, ఓపికగా తనకోసం ఖైదీగాఉండి, తనప్లానుకు తోడ్పడినందుకు టామ్ కృతజ్ఞతాసూచకంగా జిమ్‌కు నలభై డాలర్లు బహుమతిఇచ్చాడు ఆడబ్బుచూసి జిమ్ మురిసి పోయాడు.

"హాక్‌గారూ! నే నేం చెప్పాను ఆరోజున జాక్సన్ లంకలో? మళ్లీ ఎప్పుడో ధనవంతుణ్ణవుతా నని చెప్పానా, లేదా? రొమ్ముమీద బాగా బొచ్చుంటే మనిషి ధనవంతు డవుతాడని చెప్పలా? మీరు అప్పుడు నమ్మలేదు. ఇప్పుడు చూడండి. నలభైడాలర్లు చిటికెలో సంపాయించాను. ఇదుగో— నేనేం తెలివితక్కువ నన్నాని ననుకున్నారా? నేను జోస్యం చెప్పానంటే అది జరిగి తీరాల్సిందే."

ఆ తరవాత టామ్ నన్నూ, జిమ్‌ను ఒకచోటుకి తీసుకుపోయి చర్చలు జరిపాడు. చూసిచూసి ఒక రాత్రివేళ ఇంట్లోనుంచి పారిపోదామనీ, మంచి డ్రెస్సు సంపాదించి ఎర్ర ఇండియన్ల రాష్ట్రంలోకి పోదామనీ, అక్కడ రెండు మూడు వారాల పాటు సాహస కృత్యాలు చేసి మళ్లీ ఇంటికి వచ్చేద్దామనీ అన్నాడు.

"ఓ. బలేగా ఉంటుంది నేను ఇల్లాంటి దానికి దేనికైనా తయార్. కాని మంచి డ్రెస్సు కొనుక్కోటానికి నాదగ్గిర డబ్బులేదు. ఇంటి దగ్గిర్నించి తెప్పించుకుందా మంటే ఈపాటికి మానాన్న జడ్జి థాచర్ గారి దగ్గిర్నించి నాడబ్బంతా లాగేసి ఉంటాడను కుంటాను," అన్నాను.

"ఊహు. నీ డబ్బంతా సురక్షితంగా బ్యాంకిలోనే వుంది—ఆరువేల డాలర్లపై చిల్లర. మీ నాన్న ఆ పోవటం పోవటం మళ్లీ వెనక్కి రాలేదు. ఏమో నేను ఇక్కడికి వచ్చే సమయానికి మీనాన్న జాడ లేదు," అన్నాడు టామ్.

ఈమాటవిని జిమ్ గంభీరంగా ఇలా చెప్పాడు:

"హాక్‌గారూ! మీ నాన్న ఇక ఎప్పటికీ మీకు కనిపించడు."

"ఏం?"

"ఎందుకైతే నేం? నేను చెబుతున్నాగా. మీ నాన్న ఇక ఎప్పటికీ రాడు.

నేను గుచ్చి గుచ్చి అడగ్గా చెప్పాడు:

"ఒకరోజున వరదల్లో ఒక కొయ్య కొంప కొట్టుకు రావటం చూశాం జ్ఞాపకం ఉందా? ఆ కొంపలో ఒకమనిషి చచ్చిపోయి బోర్లాపడి వున్నాడు జ్ఞాపకం ఉందా? ఆమనిషిని చూడవద్దని మీతో చెప్పాను. ఎందు కనుకున్నారు? ఆమనిషి మీనాన్నే. ఎవరో చంపేశారో, లేక తనంతట తనే చచ్చి పోయాడో పాపం—"

టామ్ పూర్తిగా కోలుకున్నాడు. కాల్లోంచి ఊడబెరికిన తుపాకి తోటా తన సాహసకృత్యాల జ్ఞాపక చిహ్నంగా ఒక తాడుకు కట్టి మెడలో వేసుకుని తిరిగే వాడు. ఇక ఇంతకంటే నేను రాయవలసిం దేమీ కనిపించటంలేదు. మొదలు పెట్టిన ఇన్నాళ్లకి నా కథ పూర్తిచేయగలిగి నందుకు చాల సంతోషంగా ఉంది. ఎందుకంటే పుస్తకం రాయటమంటే ఎంత బాధో ముందే తెలిసి వుంటే అసలు రాయటానికి పూనుకునేవాణ్ణే కాదు. ఇకమీదట అలాంటి పిచ్చిపని ఎప్పుడూ తలపెట్టను. కాని మిగతావాళ్లకంటే ముందే ఎర్రఇండియన్ల రాష్ట్రంలోకి వెళ్లిపోవలసిన అవసరం వచ్చేటట్లుంది. మా శాలీపిన్ని నన్ను పెంచుకుంటానని, పెంచుకుని "నాగరికత" నేర్పుతానని బెదిరిస్తోంది. ఏదైనా భరించగలను గాని "నాగరికత"ను మాత్రం భరించలేను. ఇదివర కొకసారి దానిబాధ అనుభవించానుగా.

(అయిపోయింది)

రెండు మహానగరాలు

(22-వ పేజీ తరువాయి)

13

అవి తాగుబోతు పేరుబడ్డ రోజులు; ప్రతి ఒక్కడూ అత్యద్భుతంగా తప్పతాగేసేవాడు. గౌరవ మర్యాదలకు యే విధమైన భంగమూ రాకుండా ఆ రోజుల్లో ఒక్కనాటి రాత్రి ఒక పెద్దమనిషి తాగి పారేసే మొత్తాన్ని ఈనాటి పెద్దమనుషుల తాగుడుతో పోల్చి చెబితే, అదో పెద్ద ఉత్ప్రేక్షగా కనుపించుతుంది. తక్కిన వృత్తుల్లో వున్నవారికి న్యాయవాది వృత్తి నవలంబించుతున్న సోదరులు తీసిపోయిందేమీ లేదు. ఈ న్యాయవాదుల్లో, స్ట్రయివర్ ప్రాక్టీసు విషయంలో ఎలా అగ్రశ్రేణిలో వుండేవాడో, తాగుడు విషయంలో కూడా అలానే అగ్రశ్రేణిలో వుండేవాడు.

స్ట్రయివర్ 'ఓల్డు బెయిలీకోర్టు'లో ముఖ్యంగా సెషన్సు కేసుల్లో పేరుమోసిన లాయరు. పేరు ప్రఖ్యాతులొచ్చినకొద్దీ చిన్న కేసులు పట్టడం చిన్నచిన్న కోర్టులకు వెళ్ళటం మానేశాడు.

ప్రధాన న్యాయమూర్తి కోర్టులకు దాదాపు రోజూ హాజరయ్యేవాడు. ఆకుల సందునుంచి పొటమరించి సూర్యునివంక చూచే ప్రొద్దుతిరుగుడు పువ్వులాగు, విగ్గుల్లోనుంచి పొటమరించి, స్ట్రయివర్ ఉజ్జ్వలముఖం ప్రధాన న్యాయమూర్తివంక చూస్తూవుండేది. అతనొక్కడే కాదు. చుట్టూవున్న లాయర్లంతా అదేరకంగా వుండేవాళ్లు. తరుణోజ్జ్వల ముఖాల నందనోద్యానం.

ఒక్పుడు బారులో ప్లీడర్లంతా అనుకునేవాళ్లు : 'స్ట్రయివర్ గడుగ్గాయి పిండమే గాని, లా పాయింట్లు విషయాల్లో మట్టిమెదడు' అని. కాని యీలోపం క్రమేపీ భర్తీచేసుకున్నాడు. రాత్రి తెల్లవార్లూ సిడ్నీ కార్టన్‌తో పానగోష్ఠి జరిపేవాడు. తెల్లవారి లేచేసరికి కావలసిన లాపాయంట్లన్నీ కరతలామలకాలై వుండేవి.

ఇక సిడ్నీ కార్టన్ సంగతేమిటంటే పరమ సోమరిపోతు; అంత అప్రయోజకుడు లోకంలో లేడు. ఇతగాడు స్ట్రయివరుకు పరమ మిత్రుడు. సంవత్సరాంతంలోపల వాళ్ళిద్దరూ కలిసి త్రాగిపారేసే సారాసముద్రంలో రాజుగారి ఓడను వదిలితే తెప్పున తేలుతుంది. కార్టన్ దగ్గిర లేకుండా స్ట్రయివర్ ఏ కేసు చేపట్టేవాడు కాదు; చేతులు కోటుజేబుల్లో దోపుకుని దూలంవంక చూస్తూ అతను కోర్టులో వుండితీరాలి కోర్టులోనే గాదు, కోర్టులోనుంచి బయటికొచ్చిన తరవాతకూడా యిద్దరూ పానశాలల వెంట జములుగా తిరుగుతూ వుండేవాళ్లు. ఏ తెల్లవారిఝామునో కార్టన్ తుపాను దెబ్బతిన్న పిల్లిలా పడుతూ తూలుతూ తన మకాముకు చేరుకునేవాడు. చివరికి అంతా పసిగట్టారు: కార్టన్ సింహం కాలేకపోయినా గుంటనక్కరకం వుండాకోరు మనిషని. స్ట్రయివర్, కార్టన్ల కథ 'సింహం-నక్క' కథగా నడుస్తోంది.

'పదిగంట లయింది సర్!—పదయింది!'—కార్టన్ చెవి దగ్గిర నోరుబెట్టి వెయిటర్ అరుస్తున్నాడు.

'ఏవిట్రా మోత!'

'పదయిందండీ?'

'అయితే ఏవిట్రా—పకేవిటి నీ పిండాకూడు'—

'లేపమన్నారు గాదండీ!'

'ఓ—సరే—లేస్తున్నాను'

వచ్చీరాని స్పృహలో, శరీరం మళ్ళీ యెట్లాగయినా మరికొంతసేపు నిద్రావస్థలో వుండిపోవటానికి ప్రయత్నించుతోంది. కాని లాభం లేకపోయింది. వెయిటర్ జోరీగలాగ పట్టుకుని లేవగొట్టేశాడు. లేచి నిల్చుని బద్ధకంగా ఒళ్లు విరుచుకుని టోపీ నెత్తికి తగిలించుకుని బయలుదేరాడు. నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ స్ట్రయివర్ ఇంటికి జేరుకున్నాడు. స్ట్రయివర్ గుమాస్తాకు ఈ రాత్రించర సమావేశాల్లో పాల్గొనే అలవాటు లేదు. అతను అప్పటికే వెళ్లిపోయాడు. స్ట్రయివర్ స్వయంగా వచ్చి తలుపు తీశాడు. వదులాటి గౌను తొడుక్కున్నాడు. పాదాలకు స్లిపర్లు వేసుకున్నాడు.

ఆ తరగతి యిచ్ఛాజీవులందరికిమల్లేనే కళ్లచుట్టూ నల్లటి మచ్చలు; కళ్లు కావురెయ్యటంలో వింతేవుంది. జఫ్రీ నాటినుంచి ఈనాటివరకూ ఏ తాగుబోతు చిత్రం తీస్తే ఆ సౌందర్యరేఖలు మనకు కనుపించవు?

'క్యారే మేధానిధీ! ఆలస్యమయిందేం?'—

'మామూలు వేళకే వచ్చానే! ఓ పావుగంట ఆలస్యమైనట్టుంది.'

ఇద్దరూ గలిసి అహోబల బిలంలావున్న ఒక గదిలోకి నడిచారు. గది చుట్టూ పుస్తకాల దొంతర్లు పేర్చివున్నయ్. మధ్యను అమర్చివున్న చలి కుంపటిలోనుంచి జాజ్వల్యమానంగా మంటలు రేగుతున్నయ్. స్టౌమీద కెటిల్ లోనుంచి ఆవిరి బయటికివస్తోంది. కాయితంకట్టల దొంతర్ల మధ్యగా ఒక బల్ల—ఆ బల్లమీద పానీయ సరంజామా ధగధగలాడుతూ అమర్చివుంది — వైనుసీసాలు, బ్రాందీ, రమ్ము, పంచదార, నిమ్మకాయలు.

'సిడ్నీ—ఈవేళ అప్పుడే నీవు పుచ్చేసుకున్నట్టున్నావే?'

'ఈవేళ మనక్లయింటితో కలిసి భోజనం చేశాను—కాదు కాదు అతను భోజనం చేస్తుంటే నేను చూస్తూ కూర్చున్నాను. ఈవేళ ఒక సీసా కాదు, రెండు సీసాలదాకా పట్టించాను.

'ఆరి నీ తస్సాదియ్యా! ఎల్లా తోచిందో గాని ఈవేళ భలే పాయం టెత్తావోయ్!—అసలు నీకూ అతనికీ పోలికలున్నాయని ఎలా తట్టిందీ?' అన్నాడు స్ట్రయివర్—గ్లాసులో ద్రాక్షసారా పోస్తూ.

'మంచి అందమైన పడుచువాడుగా కనుపించాడు—ఏ మాత్రం అదృష్టమున్నా నేనుకూడా అలానే వుండేవాడి ననుకున్నాను.'

'నువ్వూ, నీ అదృష్టం సరేగాని—పనిసంగతి చూడు—చాలా ప్రొద్దుపోయినట్టుంది.'

నక్కకు కొంచెం కోపమొచ్చింది. అయిష్టంగానే లేచి, కోటూగీటూ విప్పి బల్లమీద పారేశాడు. ప్రక్క గదిలోకి వెళ్ళి ఒక బేసిన్‌తో చన్నీళ్ళూ తుండుగుడ్డా తెచ్చుకున్నాడు. తుండుగుడ్డ చన్నీళ్లలో తడిపి పిండి నెత్తిమీద వేసుకునివచ్చి బల్లదగ్గిర కూర్చున్నాడు: 'ఏవిటా కాయితాలు ఇలా పారెయ్యండి.'

'ఇవ్వాళ యెంతో పనిలేదులే భయ్యా—రెండే రెండు కేసులున్నయ్.'

'సరే ఇలా పారెయ్యండి.'

‘అయిగో కాయితాలు ఆ బల్లమీదే వున్నయ్ చూడు!’—

పని నక్కకు వప్పగించేసి సింహంపోయి కులాసాగా సోఫాలో యాలిగిలబడి కూర్చుని గ్లాసుతరవాత గ్లాసుపట్టించుతోంది. నక్క కాయితాల కట్టలతో సదమదమౌతోంది. నక్క కూర్చున్న బల్లమీద కూడా సీసాలూ గ్లాసులూ అమర్చివున్నయ్. గ్లాసుమీద గ్లాసు యిద్దరూ ఆరారగా గొంతు తడుపుకుంటున్నారు. సింహం, మెదడుకు యెక్కువగా పని తగలని తేలికపారు కాయితాలేవో తిరగ వేస్తోంది. నక్క మాత్రం బొమలు ముడివేసుకుని తీవ్రంగా ఆలోచిస్తోంది. ఆ ఆలోచనతో బుర్ర వేడెక్కి మళ్లా మళ్లా తడిగుడ్డలు తడిపి నెత్తిమీద వేసుకుంటున్నది.

అలా నానా తంటాలూపడి, నక్క, కావలసిన పాయింట్లన్నీ తయారుచేసి, వాటిని నివేదించటానికి సింహం దగ్గిరకొచ్చింది. సింహం వాటినన్నిటిని ఒకటొకటే చక్కగా అర్థం చేసుకుని తృప్తోస్మి అనుకుని హాయిగా సోఫామీద పడుకుని హఠయోగంపట్టింది.

నక్క మళ్లా పోయి రెండో కేసు కాయితాలు తిరగేసి అదేవిధంగా మళ్లాసింహానికి వ్యవహారమంతా అర్థం చేసింది.

‘అమ్మయ్యా! ఈవేళకు ఈ బెడదతీరిపోయింది!—అన్నాడు స్ట్రయివర్ ‘మళ్లా ఒక పెగ్ బిగించు భయ్యా!’—

నక్క నెత్తిమీది తడి తువ్వాళ్లు తీసి అవతల పారేసి, ఆవలించి వళ్లు విరుచుకుంది. మళ్లాపోయి మరోగ్లాసు బిగించుతోంది.

‘ఈవేళ ప్రాసిక్యూషన్ సాక్షుల క్లాసుపరీక్షలో మటుకు బలే ప్రశ్నలందించావులే—ప్రశ్న ప్రశ్నా తుపాకి గుండులా పనిచేసింది. బలే రంజింపజేశావ్!’

‘ఒకనాడు మాత్రం—నేను రంజింపజేసి యాడవం దెప్పుడు?’ అన్నాడ సిడ్నీ.

‘ఎందుకు భయ్యా! అంతకోపంగా వున్నావ్—మరో గ్లాసు పుచ్చుకో; ఆ రుస రుస అణుగుతుంది’

రుసరుసలాడుతూనే మరోగ్లాసు తగిలించాడు.

‘ఆ ష్రూస్‌బేరీస్కూల్లో చదువుతుండే రోజుల్లో ఎలా వుండేవాడివో ఇప్పుడూ అంతే—క్షణానికి ఆటూ క్షణానికి పోటు—అంతలో కోపం, అంతలో నైరాశ్యం—అదే సిడ్నీ కార్టన్—అదే కుర్రతనం—రవ్వంతేనా మార్పులేదు.’

‘అవును అదే సిడ్నీ-మార్పేమేడిసింది, అదృష్టంలోమటుకు! అప్పుడూ ఇంతే; ఎదటిపిల్లల హోంవర్కులన్నీ చేసిపెట్టి నాసంగతి నేను చూసుకునేవాణ్ణి కాదు’—

‘ఎందుకనంటావ్’

‘ఎందుకేఁవిటి కర్మ— జాతకస్వభావం’

‘అబ్బాయ్! నే నొకటి చెబుతావిను—నీలో వున్న లోపమేఁవిటంటే, జీవితాన్ని కుంటినడక నడిపిస్తావ్!’ ఏవిషయంలోనూ పట్టుమని శ్రద్ధలేదు—నా విషయం చూడు.’

‘చంపావ్!— ధర్మోపదేశం మొదలెడుతున్నావా యేఁవిటి?’ అంటూ నవ్వేశాడు సిడ్నీ.

‘నేనీస్థితికి ఎలా వచ్చాను—ఏ పని మొదలెట్టినా యెంత జాగ్రత్తగా పనిచేస్తాను’

‘నువ్వు ఈ స్థితికి యెలావొచ్చావో నాకు తెలీదనా—నాకేదో కూలి పారేసి చాకిరీచేయించి యీ స్థితికి వచ్చావ్. అందులో నువ్వు బడాయి చెప్పుకోవలసిందేమీ లేదు. నీకేమి కావాలో అదిచేస్తావు; నాకేం గావాలో నేను చూసుకోను అంతే తేడా; నువ్వెప్పుడూ ముందుపీటీసుంటావ్—నే నెప్పుడూ వెనకాలే యేడుస్తూవుంటాను.’

‘అగ్రశ్రేణిలోకి చొచ్చుకుపోవలసివుంది గనుక ప్రయత్నించాను—పొట్టటమే గొప్పవాణ్ణిగా పుట్టానంటావా?’

‘నువ్వు పుట్టినప్పుడు నేనక్కడ లేనుగాని—మొత్తానికి గొప్పవాడుగా పుట్టావనే నే ననుకోటం’—ఆ మాటని, సిడ్నీ, మళ్లా నవ్వేశాడు; స్ట్రయివర్ కూడా నవ్వాడు.

కార్టన్ మళ్లా మొదలుబెట్టాడు: ‘ష్రూస్‌బరీలో వుండగానూ అంతే, పారిస్‌లో ‘లా’ చదువుతున్నప్పుడూ అంతే—నీ వర్గంలో నువ్వుండే వాడివి; నా వర్గంలో నేనుండేవాణ్ణి. నువ్వెప్పుడూ ఎక్కడో నలుగురికీ కనుపించే యేదో ఒక చోట వుండేవాడివి, నే నెప్పుడూ, ఎక్కడా వుండేవాణ్ణి గాదు!

‘తప్పెవరిదంటావ్?’

‘తప్పు నీదికాదనటం మాత్రమెలా? నువ్వెప్పుడూ ప్రక్కనున్న వాణ్ణి మోచేతుల్తో వెనక్కునెట్టి ముందుకెళ్లి పోంతూ వుంటావ్—ఇంకా నాకుముందుకొచ్చే సావకాశం యెక్కడ దొరికేడిచింది? తెల్లవారిపోయింది గత విషాద జీవితాన్ని నెమరుకు తెచ్చుకుని చీకటి పెంచుకోవట మెందుకుగాని ఏదైనా సర్దాగా వుండేమాట చెప్పు—ఇంటికి జేరతాను.’

‘పోనీ నిన్న సాక్ష్యం చెప్పిన ఆ అందగత్తె సంగతి చెప్పమంటావ్—సర్దాగా వుంటుందేమో?—’

నిజంగా అతనికి సర్దా వెయ్యలేదు. ముఖంమీద మరింతగా విషాదచ్ఛాయలు అలుముకున్నయ్:

‘అందకత్తె యెవరు?’

‘లూసీ మానెట్’

‘ఆవిడేనా అందగత్తె’

‘ఏం? కాదా?’

‘ప్చ్!’—

‘అరే! అలా అంటావేం—కోర్టులోవున్న యావన్మందీ డంగైపోతే’

‘ఆ కోర్టుజనం మెచ్చుకోటాని కేఁవిటిలే—అదో బంగారు జుట్టు తగిలించిన రబ్బరుబొమ్మ’

‘నిజం చెబుతాను విను సిడ్నీ—నీకా బొమ్మమీద మోజు కలిగిందని అనుకున్నాను—ఆవిడ మూర్ఛపోవటం మా అందరికంటే ముందు నువ్వే చూశావు’

‘అరే! కళ్లెదట మనిషో, బొమ్మో, ఒరిగి పోతుంటే ఆ సంగతి గ్రహించటానికి టెలెస్కోపు కావాలా ఏఁవిటి—నువ్వు లక్షచెప్పు అది సౌందర్యమంటేమాత్రం నేనుచస్తే అంగీకరించను.—ఇక ఇక్కడికి త్రాగుడు సమాప్తి—వెళ్లి కాసేపు పడుంటాను.’

స్ట్రయివర్ అతనితోపాటు లేచి గుమ్మందాకా పంపించాడు. సిడ్నీ ఇంటోనుంచి బయటికి వచ్చేటప్పటికి చలిచలిగా వుంది. వాతావరణమంతా నిరుత్సాహ జనకంగానూ, విచారసూచకంగానూ వుంది. నదిమీద ఆకాశం ఇంకా మసక మసకగా దిగులేస్తోంది. ఆ దృశ్యమంతా నిర్జీవమైన యెడారిలా కనుపించుతోంది.

వ్యర్థమైన మానవశక్తులు హృదయంలోనూ చుట్టూ నిర్జీవమైన యెడారి; మౌనంగా సిడ్నీ మేడ మెట్లెక్కుతున్నాడు. ఈ అతని ధిని పొడసూపుతున్న ఆ నిర్జీవదృశ్యంలో ఎక్కడో దూరాన మహదాశయోజ్వలమైన ఒక నందనోద్యానం రేఖగా గోచరిస్తోంది—ఆత్మత్యాగ సౌందర్యసీమ!! ★



ఆలిండియా పిక్చర్సువారి "సాక్వీన్"లో

మధుబాల



"సింగారి తెలుగు చిత్రం"లో లలిత

ప్రజాభిరుచులు

భారతఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు చందూలాల్ షా ఇటీవల మద్రాసులో మాట్లాడుతూ సినిమా చిత్రాలు ప్రజల్లో అవినీతిని ప్రోత్సహిస్తున్నాయని అందరూ అనేవారేగాని, చిత్రాలెల్లా ఉండాలో చెప్పేవారొకరూ లేరనీ, ప్రజల అభిరుచుల ప్రకారమే నిర్మాతలు చిత్రాలు నిర్మిస్తున్నారనీ అన్నారు అక్కడితో ఆగక "దేశంలోని సినిమా లన్నిటినీ ప్రభుత్వం కొంతకాలంపాటు మూసివేసి చూడమనండి అరాజకం, దోపిడీలు, హత్యలు, స్త్రీమానభంగాలు విరివిగా జరక్కపోతే అప్పుడనండి సినిమాలు దేశంలోని దుష్టశక్తులకు కాలక్షేపం, వినోదం ప్రసాదిస్తున్నాయి కనకనే శాంతి భద్రతలు సురక్షితంగా ఉన్నాయి," అని కూడా ఆయన అన్నారు

ఈ మాట చందూలాల్ షావంటి బాధ్యత గల నిర్మాత బహిరంగంగా అనదగినదిగా కనిపించదు ఈ మాటలో "శాంతి భద్రతలను మీకంటే మేమే జాగ్రత్తగా రక్షిస్తున్నా"మని ప్రభుత్వానికి ఒక సవాల్ ఉండటమేకాదు తమ చిత్రాలు చూసే ప్రజానీకంపట్ల ఆయన కెలాటి గౌరవం ఉన్నదీ కూడా వ్యక్తమవుతున్నది

సినిమా చిత్రాలంటే ఏహ్యభావం, నిరసనగల ఛాందసులు, సినిమా చిత్రాలను అవినీతిలో "ఈక్వేట్" చేసే సనాతనవాదులు ఈనాటికీ దేశంలో లేకపోలేదు దీనికి కొంతవరకూ సినిమారంగంలోకల అవినీతి కారణం కాని సినిమా ఈనాడు ఒక లలితకళగా, ఒక ముఖ్యపరిశ్రమగా సంఘ జీవితంలో సుప్రతిష్ఠితమై ఉంది లలితకళలుగా సారస్వతం, సంగీతం మొదలైనవి ఎంతటి ఔన్నత్యాలకు పోగలవో, అనేక కళల మిశ్రమమైన సినిమాకళకూడా అంతటి ఔన్నత్యాలకు పోగలదు మిగతాకళలు వ్యక్తుల జీవితాలపై, నీతి అవినీతులపై ఎంత ప్రభావం ప్రసరిస్తాయో సినిమాకళ కూడా అంత ప్రభావం (బహుశా కొంత ఎక్కువ) ప్రసరిస్తుంది సంఘంలో అవినీతి ప్రబలటానికి అనేక కారణాలుంటాయి ఆ కారణాలు సంఘవ్యవస్థలో వెదికితే కనిపిస్తాయి ప్రత్యేకంగా సినిమాలవల్లనే అవినీతి పెరుగుతోందనటానికి ఆధారం లేదు


చందూలాల్ షా ప్రకటన ఎక్కడి విరుద్ధంగా ఉందంటే — అవినీతిపరులు రాత్రి పూట చెలరేగి హత్యలు, దోపిడీలు, ఇతర నేరాలు చెయ్యకుండా సినిమా

చిత్రాలు కాలక్షేపం కల్పిస్తున్నా యనటం ప్రస్తుతం వెలువడే చిత్రాలు నేరజీవనులైనవారికి మాత్రమే తగిఉన్నా యని దీని అర్థమా? లేక నేరం చెయ్యాలనే అభిలాష గలవారికి నేరాలు చేయకుండానే నేరాభిలాష తీరేటట్లుగా సినిమాలు ఒక రకమైన మానసిక సంతృప్తి కలిగిస్తున్నాయని అర్థమా?

ప్రజాభిరుచుల ప్రకారమే చిత్రాలు తీస్తున్నామనే వాదనకూడా సమర్థించ రానిదిగా ఉంది వెలువడే చిత్రాలలో సగానికి పైగా ఆర్థికంగా దెబ్బతినటం చూస్తే ప్రజాభిరుచులు నిర్మాతలకు సరిగా అర్థం కాలేదని అనుకోవలసివస్తుంది డబ్బు చేసుకున్న ఒక విదేశీ చిత్రాన్నో, స్వదేశీ చిత్రాన్నో ముక్కకి ముక్క అనుకరించినంతమాత్రాన ప్రజాభిరుచులను పాటించినట్లు కాదు అలాంటిచిత్రాలు విధిగా దెబ్బతింటున్నాయి. తతిమా కళలలో వలెనే సినిమాకళలో కూడా ఎప్పటికప్పుడు నూతనత్వం సాధించటానికి ప్రయత్నం జరగాలి

ప్రజాభిరుచులను డబ్బుతో కొలవటం పెట్టుబడిదారీ వ్యవస్థలోని గొప్పలోపం డబ్బు సంపాదించినదల్లా ఉత్తమమైనది, సంపాదించనిది, తద్వ్యతిరేకమైనది ఈ సూత్రాన్ని సినిమాచిత్రాలకు కూడా వర్తింపజేస్తే చిత్రనిర్మాతల దృష్టిలో డబ్బు బాగా సంపాదించటం ఉత్తమ చిత్ర లక్షణం కనుక ప్రత్యేకం డబ్బును మాత్రమే సంపాదించే సులభమార్గాలు వెదుకుతారు నిర్మాతలు సినిమా చిత్రాలను కళగా కాక కేవలం వ్యాపారవస్తువులుగా పరిగణించటంవలన వచ్చే సమస్య ఇది కళ అనగానే దానికి ఆర్థికలాభాన్ని మించిన ప్రయోజనం ఉన్నది ఏమిటా ప్రయోజనం? కళాకారుడు తన కళలో తన చుట్టూవున్న జీవితాన్ని, ప్రపంచాన్ని ప్రతిబింబింపజెయ్యటం ద్వారా జీవితాన్ని, ప్రపంచాన్ని మనకి సన్నిహితంగా తీసుకువస్తాడు జీవితం ఇంకా సునిశితంగా అర్థం అయ్యేలాగ చేస్తాడు. అంతేకాదు, జీవితపు విలువలను సృష్టిస్తాడు అందుచేత కళాకారుడు తన సోదర ప్రజానీకంకంటె ఒకమెట్టు పైన ఉంటాడు ఒక విధంగా అతడు ప్రజానాయకుడు. తన సోదర ప్రజల ఆశలను, ఆశయాలను తన కళలో వ్యక్తం చెయ్యటమే అతని ప్రత్యేకత

కళాకారుడిమీద ఇంత మహత్తరమైన బాధ్యత ఉన్నది కాని ఈ బాధ్యత నిర్వహించటానికి తగిన సదుపాయాలు నేటి సినిమాపరిశ్రమలో లేవు పాశ్చాత్య సినిమా పరిశ్రమలోని లోపాలు మన దేశానికి కూడా క్రమంగా పాకి వస్తున్నాయి మొదటిరోజుల్లో సినిమా చిత్రనిర్మాణం యావత్తూ దర్శకుని చేతిలో వుండేది. దర్శకుడే కథను, నటీనటులను,



లవ్ షాక్ తిన్న కృష్ణను సావిత్రి,
రాజశర్మ పరామర్శిస్తున్నారు. శుభోదయావారి "ఆదర్శం



అవర్ ఇండియావారి "నా యిల్లు"లో విలన్ లింగమూర్తి, వాంప్ మిస్ విద్య

ఇతరులను ఎంచుకోనేవాడు తరవాత ఈ బాధ్యత చిత్ర నిర్మాతే స్వీకరించాడు ఇప్పుడు చిత్రనిర్మాతనుకూడా తోసివేసి డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు అతని స్థానాన్ని ఆక్రమిస్తున్నారు కొన్ని కొన్ని చిత్రాల విషయంలో కథ దగ్గర్నించీ, స్క్రిప్టురచయిత, నటీనటులు, ఇతర టెక్నీషియన్ల వరకూ వీరి 'కళాభిరుచుల' ప్రకారం నాట్యం చెయ్యవలసిందే. చిత్రానికి పెట్టుబడి ఎవరు పెడితే వారికి ప్రతిబింబంగా తయారవుతుంది చిత్రం ఇటువంటి పరిస్థితుల్లో సినిమాకళ హత్యగావించబడుతోందంటే ఆశ్చర్యం లేదు

ఉన్నత కళాదర్శాలతో సంచిత్ర నిర్మాత ఆర్థికంగా ధ్వంసమైపోవాలని ఎవ్వరూ కోరరు ఆర్థికంగా ధ్వంసమైపోయినంత మాత్రాన, లేక విజయం పొందినంతమాత్రాన చిత్రం కళాస్థాయిని నిర్ణయించలేము. కాని ఆర్థికంగా జయప్రదమయ్యే ఉత్తమ కళాఖండాలు సాధించటానికి వీలున్నది ఇందుకు సినిమాచరిత్రలోనే అనేక ఉదాహరణలున్నాయి ఈలోగా ప్రజాభిరుచుల ప్రకారమే చిత్రాలు తీస్తున్నామనేవాదన చిత్రనిర్మాతల కొక్కరికే లాభిస్తుంది ఈ వాదన యొక్క అసలు అర్థం మోసంచేస్తేనేగాని, దోపిడీ చేస్తేనేగాని ఆర్థికంగాలాభించదని. మోసగింపబడే వాడెప్పుడూ తెలిసి తెలిసి మోసానికి లోబడడు, మోసగింపబడుతున్నాడు కనుక మోసగింపబడటం అతని అభిరుచి అని అంటే అంతకంటే 'సినిసిజమ్' వేరే ఉండదు

ఇటీవల ప్రసిద్ధ నటుడు నాగయ్యగారు ఒక సభలో ప్రసంగిస్తూ చెడ్డ చిత్రాలు వెలువడటానికి బాధ్యత నిర్మాతలదేనని, సినిమా పరిశ్రమను జాతీయంచేస్తే మంచి చిత్రాలు వెలువడే అవకాశం ఉందనీ ఒక అభిప్రాయం వెలిబుచ్చారు దేశంలోని స్టూడియోలను, పెట్టుబడి ధనాన్ని (కొంతవరకైనా) జాతీయం చేయటంవలన చిత్రనిర్మాణంలో క్రమపద్ధతి, సహకారం ఏర్పడే అవకాశం లేకపోలేదు ఇందువలన చిన్న నిర్మాతలకు, కార్మికులకు లాభం కలుగుతుంది కాని సినిమా పరిశ్రమను యావత్తూ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందువల్ల చిత్రాల కళాస్థాయి పెరుగుతుందనటానికి వీలులేదు ఆర్థికంగానూ, ఇతర విధాలను ఎన్నో సదుపాయాలు కలిగిన ప్రభుత్వం ఇన్నేళ్ళలోనూ కళా విషయికంగా అత్యుత్తమం అని చెప్పదగిన డాక్యుమెంటరీ చిత్రం ఒక్కటీ తీయలేదు కళ ప్రజలకు సందేశం ఇస్తుందన్నమాట నిజమే కాని ప్రభుత్వాలకు సందేశాలపై ఉన్నంత మమకారం కళమీద ఉండదు అందుచేత కళయొక్క స్థానాన్ని సందేశాలు మాత్రమే ఆక్రమించుకునే ప్రమాదం ఉన్నది. సందేశం కళావాహినిలో అంతర్నిహితంగా ప్రవహిస్తుంది కేవల సందేశం

సందేశంమాత్రమే అవుతుందిగాని కళ కాదు.

సినిమా-చిత్రం ఒకవంక ఆర్థిక విజయమూ పొందాలి; అంటే అసంఖ్యాకులైన ప్రేక్షకులు ఆసక్తితోవచ్చి చూసేదిగానూ ఉండాలి మరొకవంక ప్రజలను నైతికంగా, మానసికంగా మోసగించేది కాకుండా ఉత్తమ కళాఖండంగానూ ఉండాలి ఈసమస్యకు సమాధానం ఉన్నదా? లేదా? అసలిది ఒక సమస్యయేనా? అసంఖ్యాక జనానికి సన్నిహితంగా వచ్చే ఉత్తమ సినిమా కళ ఒకటున్నదా, లేదా? ఇవి తేలవలసిన ప్రశ్నలు. ★

సినిమా వార్తలు

ముక్కామలవారి "మరదలు పెళ్లి" చిత్రం చాలవరకు అయిపోయింది. ఇప్పుడు ఆఖరి సెట్టుమీద షూటింగ్ జరుగుతున్నది జూన్ నెల మధ్యలో విడుదలకావచ్చును ఈ చిత్రం ప్రేక్షకులను ఉర్రూతలూగించగలదని, దర్శకత్వం, సంగీతం ఇందులో ముఖ్యాకర్షణలని తెలుస్తున్నది "ది రివర్" చిత్రనిర్మాత కెన్నెత్ మెక్ ఎల్‌డౌనీ అమన్య మద్రాసు వచ్చినప్పుడు "మరదలు పెళ్లి" కొంతవరకూ చూసి గొప్పగా ఉన్నదని మెచ్చుకున్నారు కృష్ణకుమారి నాట్యంచేస్తూ పాడిన ఒక పాట తాలూకు ఫిల్ముభాగాన్ని తనతో తీసుకువెళ్లాడట కూడా.

* * *

ఆర్కాట్ నవాబు ప్రిన్స్ ఆర్ట్ ప్రొడక్షన్సు అనే సంస్థను కొత్తగా స్థాపించారు "తుఫాను" అనే చిత్రాన్ని ఈయన తెలుగులో తీయ సంకల్పించారు కెమేరామాన్ కొట్నీస్ దర్శకత్వం క్రింద ఈ చిత్రంలో వై వి రావు, సి. హెచ్ నారాయణరావు, లక్ష్మి ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు


హెచ్ ఎమ్ రెడ్డిగారు తెలుగు, అరవం, హిందీలలో తీస్తున్న "వెంజన్స్" చిత్రం మూడవవంతు పూర్తయింది గిరిజ, కాంతారావు ఈ చిత్రంలో నాయికా నాయకులు కొత్తగా తమిళ హాస్యనటుడు సారంగపాణిని కూడా బుక్ చేశారు సంగీతం అశ్వత్థామ. స్టుడియో రోహిణి రోహిణీ స్టూడియోలో రెడ్డిగారు రెండవ ఫ్లోర్‌ను కూడా ఇటీవలే నిర్మించుకున్నందున చిత్రనిర్మాణం చకచక సాగుతుందని తెలుస్తోంది

* * *

మద్రాస్ ఆర్ట్ ప్రొడక్షన్సు పేరిట మాధురీదేవి తెలుగులోను, అరవంలోను, తీస్తున్న "రోహిణి"లో మాధురీదేవి, జి. వరలక్ష్మి, ఎస్ ఎ నటరాజన్, కె రామస్వామి, ముత్తులక్ష్మి మున్నగువారు నటిస్తున్నారు దర్శకత్వం కమాల్ ఘోష్, స్టుడియో వాహిని

* * *

ప్రభుత్వం నియమించిన హోపన్



ప్రతిభావారి "చిన్నకోడలు"లో కృష్ణకుమారి



పరదేశి, కన్నతల్లి, దాన, రిక్షావాలా చిత్రాల్లో నటస్తున్న
కొత్తతార వసంత

సిక్కృర్సు ఎకాడమీవారు 1950 సంవత్సరంలో తమిళ ఉత్తమ చిత్రంగా 'ఏళై పడుంపాడు' (బీదలపాట్లు) చిత్రాన్ని, తెలుగు ఉత్తమచిత్రంగా "జీవితం" చిత్రాన్ని నిర్ణయించారు నాగయ్యగారిని ఉత్తమ నటుడుగాను, అంజలిని ఉత్తమనటిగాను నిర్ణయించారు

* * * *

మద్రాసు ఫిల్ము అభిమానుల సంఘంవారు ఇటీవల ఒక సభ జరిపి తమ ఫిల్ము బాలెట్‌లో ప్రథమస్థానాలు సంపాదించిన "ఏళై పడుంపాడు" (అరవం) "సంసారం" (తెలుగు) చిత్రాలకు 1950 సంవత్సరపు ఉత్తమ చిత్రాలుగా బహుమతు లిచ్చారు. తెలుగు, తమిళ ఉత్తమ నటుడుగా నాగయ్యకు, తమిళ ఉత్తమ నటిగా మాధురికి, తెలుగు ఉత్తమ నటిగా భానుమతికి కూడా బహుమతు లిచ్చారు

* * * * *

హిందీతార నర్గిస్ రాజ్‌కపూర్‌తో కలిసి అషియానా, అన్‌హోనీ, షాకీచిత్రాల్లోనూ, శేఖర్‌తో కలిసి సాహిల్‌లోనూ, భారత్ భూషణ్‌తో కలిసి పహలీ షాదీ లోను, నజీర్ ఖాన్‌తో అంగారేలోను, సజ్జన్‌తో కలిసి షీషాలోను నటిస్తోంది

* * * * *

సురయా నజీర్ ఖాన్‌తో లాల్‌కున్వార్, ఖూబ్‌సూరత్ చిత్రాల్లోను, ముఖేష్‌తో కలిసి మషూకాలోను నటిస్తోంది

* * * * *

ప్రముఖనటుడు అశోక్‌కుమార్ ప్రస్తుతం 20 చిత్రాల్లో ఒకే సారిగా నటిస్తున్నాడట.

* * * * *

లండన్ ఆర్. సి ఏ స్టూడియోలో 35 మిల్లి మీటర్ల ఫిల్ము మీద టెక్నికలర్‌లో ముద్రించబడిన "ఆన్" చిత్రం ఈ ఏడాది ఆగస్టువరకూ విడుదలకాదట ఈ చిత్రాన్ని విదేశాలలో విడుదలచేసేటప్పుడు ఇంగ్లీషు టైటిల్స్‌తో సహా విడుదల చేస్తారట. మొత్తం 200 కాపీలు ముద్రిస్తున్నారట

* * * * *

సొహ్రాబ్ మోడీ నిర్మించిన చారిత్రక చిత్రం "ఝాన్సీకీ రాణీ" భారత స్వాతంత్ర్య దినమైన ఆగస్టు 15 న విడుదల కానున్నది

* * * * *

ఫిల్మిస్తాన్‌వారు బంకించంద్ర చటర్జీ వ్రాసిన "ఆనందమఠ్" నవలను చిత్రం తీస్తున్నారు గీతాబాలీ, పృథ్వీరాజ్, భారత్ భూషణ్ ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు దర్శకుడు హేమేన్ గుప్త, సంగీతం హేమంతకుమార్ ముఖర్జీ

* * * * *

ఇటీవల భారతదేశమంతటా ప్రేక్షకుల ప్రశంస లందుకున్న "ఫాల్ ఆఫ్ బెర్లిన్" అనే సోవియెట్ చిత్రం హిందీలోకి డబ్ చేయబడుతున్నది. హిందీలో స్క్రిప్టు జి ఆత్రేకర్ రాస్తున్నాడు. "స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం" అనే మరొక సోవియెట్ చిత్రం హిందిలోకి డబ్ చేయటం పూర్తయి విడుదలకు సిద్ధంగా ఉన్నది

* * * * *

"కాపురం" అనే తెలుగు సాంఘిక చిత్రాన్ని ఎస్. మేడూరి బొంబాయి, జాగృతి స్టూడియోలో నిర్మిస్తున్నారు. ఇందులో సి హెచ్. నారాయణరావు, కృష్ణకుమారి, మేడూరి, సూర్యశ్రీ, సరోజ, సులోచన, స్వామి, సోరి మున్నగువారు నటిస్తున్నారు కథ, దర్శకత్వం, పర్యవేక్షణ భగవాన్ కవితాంద్రే ఈ చిత్రం ప్రారంభోత్సవం మే 29 న ప్రసిద్ధదర్శకుడు వి శాంతారాం జరుపనున్నా[రు]

ఋణానుబంధం

(7–వ పేజీ తరువాయి)

ఇక ఆఖరి అస్త్రం కూడా ప్రయోగించి, ఈ కథ ముగించా లనుకున్నాను.

ఆ మరుసటిరోజు కూడా అనుకున్నట్లుగానే మాకు డబ్బు రాలేదు. శంకరరావు దగ్గర డబ్బు కూడా అయిపోయింది. ఆ రాత్రి అంతా కలిసి పస్తు పడుకున్నాము. శంకరరావు మమ్మల్ని భోజనానికి పిలవనూ లేదు. మే మాతన్ని కదపనూ లేదు. సాయంకాలంమాత్రం అతన్ని యధావిధిగా బీచ్ కి తీసుకొనిపోయాను. ఈ పర్యాయం నేనే అతని ఆత్మహత్యా ప్రయత్నం గురించి కదిలించాను. అంతవరకు అతను ఆ విషయం తలపెట్టలేదు.

ఆరోజు ముఖ్యంగా చావడానికి ఉన్న మార్గాలు గురించి చర్చించడం ప్రారంభించాను. "చూడండి. చావడానికి చాలా మార్గాలే ఉన్నాయి వాటిని స్థూలంగా రెండురకాలుగా విభజించవచ్చునని నా అభిప్రాయం. ఒకరకం బాధించేవి. రెండవరకం ఏమాత్రం బాధలేకుండా క్షణమాత్రంలో సునాయాసమరణానికి దారితీసేవి. కార్లకిందపడడం, ట్రాములకింద పడడం, కాలవల్లోకి నదుల్లోకి దూకడం వంటివి బాధించేవి. కార్లకిందపడి ఒకవేళ చావకుండా ఏకాలుఅయినా, చెయ్యి అయినా పోగొట్టుకుంటే? ఇక వాడి అవస్థ ఆ భగవంతుడికే తెలియాలి. ఒకరకంగా ఎలక్ట్రిక్ వైర్సు ముట్టుకుని, స్విచెస్ లో చేతులుపెట్టి చావడానికి ప్రయత్నించడం కూడా అలాంటిదే. ఆ మధ్య నేనో శవాన్ని చూచాను. ఒళ్లంతా మాడిపోయి నల్లగా కొరివిలా తయారయింది" అన్నాను.

ఆ మాటలు వింటూ అతను కొంచెం కంపించాడు. సమాధానంకోసం ఎదురు చూడకుండా ఇంకా అదే ధోరణిలో చెప్పుకుపోసాగాను— "సముద్రంలోపడి చచ్చేవారి సంగతి కూడా అంతమాత్రమే. చటుక్కుని చావకుండా చేయడానికి ఏషార్కు అయినా మన్ని నీటిమీదికి తేల్చి పట్టుకుని, కొంచెం కొంచెం చప్పరించడం మొదలెడితే? ఎంత బాధ అని. అలాంటివి జరగవనుకోండి. షార్కులు ఉన్నాయే? అమాంతం పకోడీనమిలినట్లు నమిలేస్తాయి కాని ఆవిధంగా మనతో చెలగాటం ఆడేటంత తీరిక ఉండదు వాటికి..."

నా మాటలకి అడ్డువచ్చి "ఇతర విషయాలేమైనా మాట్లాడుకుందాం లెండి ఈవేళ ఏమిటో నా మనస్సు మనస్సులో లేదు" అన్నాడు శంకరరావు. ఇతర రకాల ఆయాస మరణాలు గురించి, సునాయాస మరణాలు గురించి చెబుతానన్నాను కాని శంకరరావు వినిపించుకోలేదు.

ఆ తరువాత సత్రానికి తిరిగివచ్చే దారిలో సంభాషణ మార్చి, రామాయణం గురించిన చర్చ తెచ్చాను. అతనికి పురాణాదులంటే కొంత భక్తి ఉంది. ప్రసంగవశాత్తు భర్త అన్నగారితో అరణ్యవాసానికి పోతే 14 సంవత్సరాలపాటు ఏకధాటిగా నిద్రపోయిన ఊర్మిళాదేవి చరిత్ర, కన్న కొడుకుతో వియోగం భరించలేక ప్రాణాలువీడిన దశరథ మహారాజు ఉదంతం, భర్తలతో ఎడబాటు భరించలేక ఆత్మహత్య చేసుకున్న పతివ్రతాశిరోమణుల ఇతివృత్తాలు, తండ్రులు ఇల్లు విడిచిపోతే దిక్కులేక బిచ్చగాళ్లుగా అనాధులుగా జీవిస్తున్న పిల్లల గాధలు ముచ్చటించాను. ఇంకా ఎన్నో చిత్రవిచిత్రమైన అనుభవాలు ఏకరువు పెట్టాను. అతను అలాగే నన్ను మాట్లాడనిచ్చి, మౌనంగా ఉండిపోయాడు.

ఆ రాత్రి అప్పటిదాకా జరిగిన కథ అంతా మావాడి (నరసింహం)తో చెప్పగా, "ఒరేయి, ఆట ఆడుతున్నావు. ఇది ఒక మనిషి నిండుప్రాణాలికి సంబంధించిన విషయంసుమా. వాడు (శంకరరావు) నిజంగానే చచ్చిపోయాడంటే నీ పీక నులిమేస్తానుసుమా" అని హెచ్చరించాడు.

తిరిగి కొంచెంసేపు ధ్యానముద్ర ధరించి తనను సమాశ్వసించుకోడానికి ఇలా అన్నాడు: "ఎవడిదగ్గర్నుంచి అయినా ఒక్కచిల్లి డబ్బు రాబట్టే ఆశఉంటే వాణ్ణి చావనివ్వవని నాకు తెలుసులే. నువ్వు చేసినదంతా వాళ్లనాన్నకి తెలియపరిచావంటే ఆయన నిన్ను బంగారంతో కప్పెయ్యడూ?"

నరసింహం అన్న మాటల్లో కొంత యథార్థం లేకపోలేదు. అయినా నాకు మాత్రం వాడి మాటలు మహా అవమానకరంగా తోచాయి. ఆరోజు మా నరసింహానికి పెళ్లి అయిందనీ, పిల్లవాడు కూడా పుట్టాడనీ శంకరరావుతో అబద్ధం చెప్పి, ఒకరకంగా ముందుగానే మా నరసింహం మీద ప్రతీకారం

తీర్చుకున్నందుకు మనసులో మహా ఆనందించాడు.

నిజమే. ఏదో ఒక వంక పెట్టి శంకరరావు తండ్రి అడ్రసు తెలుసుకుని, ఆయనను రప్పించవచ్చు కాని అలాంటిది శంకరరావు భవిష్యత్తుకి మంచిది కాదు. ఎప్పటికైనా అతనే తన ఆత్మహత్యోద్యోగం విరమించుకుని, కొంపకి చేరుకోవడం మంచిది. లేకపోతే తిరిగి అతను మరెప్పుడయినా ఇలాంటి ప్రయత్నం చేయవచ్చు. ఆనాడు నేను కాని తటస్థపడకపోతే అతని గతేం కాను? అని అనుకుని ఆ తలంపు విడిచిపెట్టాను.

మరి రెండు రోజులు అలాగే నిరాహారంగా గడిచాయి. మూడవ రోజు మధ్యాహ్నం అతను (శంకరరావు) కాలు కాలిన పిల్లిలా తిరగడం మొదలుపెట్టాడు. నెమ్మదిగా అతన్ని కదిలించి, నా దగ్గర బహు జాగ్రత్తగా మిగిల్చిఉంచిన డబ్బులతో మా ముగ్గురికి కాఫీ తెప్పించాను. ఎంతో బలవంతంమీద కాని శంకరరావు కాఫీ త్రాగడానికి ఒప్పుకోలేదు.

అతని ధోరణి ఏమీ గమనించనట్లు నటిస్తూ నేను మా నరసింహాన్ని ఉద్దేశించి కొంచెం తీవ్రంగా మాట్లాడడం మొదలుపెట్టాను. "ఓరి వరిసిగా, కొంపముంచావు కదరా? ఇంటికి డబ్బు పంపమంటూ ఉత్తరం వ్రాసినట్లు వారంరోజుల క్రితమే చెప్పావు. ఆ ఉత్తరం తలగడక్రింద పెట్టుకుని పడుకుంటే వాళ్లు డబ్బు ఎలా పంపుతారనుకున్నావురా? నీ తస్సాదియ్య. ఆ కార్డుముక్క ఈ రోజునయినా పోస్టు చెయ్యి మరి. నీకు పుణ్యం ఉంటుంది. మనతోపాటు ఈ పెద్దమనిషినికూడా బాధపెట్టాం కదురా! ఇప్పుడేమిటి చెయ్యడం? మన గతేమిటి? ముఖ్యంగా ఆయన గతేమిటి?" అని మావాణ్ణి నిందించాను. ఆ తరువాత శంకరరావువైపు తిరిగి "మీరు నిజంగా మమ్మల్ని క్షమించాలి. ఈ పొరపాటు తెలియక మీవద్ద డబ్బు తీసుకున్నాను. లేకపోతే తీసుకుని ఇంతటి పాపానికి ఒడిగట్టేవాణ్ణా? అయినా, ఇంతపని జరిగిన తరువాత ఏ మనుకుంటే ఏంలాభం" అన్నాను. అతను నాకేసి చూచి, "ఫరవాలేదు లెండి. ఎవరికైనా వస్తూ ఉంటాయి ఇలాంటివి" అన్నాడు.

మా నరసింహం ఈసారి అందుకుని "మావాడు పోస్టుచేసి ఉంటాడని నేను, నేను చేస్తానని మావాడు అనుకుని ఇలా చేశాం, శంకరంగారూ" అన్నాడు.

నేను మళ్ళీ అందుకుని "నిజం చెప్పాలిసి వస్తే నేనైనా జరిగిందానికి అట్టే అంతగా విచారించడంలేదు. ముందు జరగబోయే దానికే బాధ పడుతున్నాను. ఇప్పుడు మన ఉత్తరం ఈరోజు పోస్టులో వేస్తే రెండు రోజులికి కాని అందదు. ఒకవేళ వాళ్లు వెంటనే మనిఆర్డరు పంపినా మనకి మరి అయిదారు రోజులవరకు డబ్బు చేరదు. అంతవరకు తిండిలేకపోయినా, నీరు లేకపోయినా నేను, నా నరసింహం ఎలాగో ఒకలాగు ప్రాణాలు అంటి పట్టుకుని ఉండగలం. పాపం, మీ గతేమిటి శంకరంగారూ? ఒరేయి నరిసింహం, నన్ను ఈవేళ తిండిలేకపోయేసరికే ఆయన ముఖం ఎలా అయిపోయిందో చూచావా? ప్రాణాలు కడంటిపోయాయి పాపం. అందులోనూ ఆయన ఆరోగ్యం అసలే మంచిదికాదు. ఇప్పుడు మళ్ళీ ఆరోగ్యం చెడితే ఆయన పరీక్ష ఏంకాను? డిస్టింక్షన్ రావలసిన మనిషి కాదురా? ఎంతపని జరిగింది" అంటూ మావాడిమీద రుసరుసలాడాను.

మావా డేమీ చలించకుండా "ఆయన పరీక్షగురించి నా కేమీ బెంగలేదురా అబ్బాయీ. చదవకపోయినా డిస్టింక్షన్ తెచ్చుకుంటాడులే. ఇప్పుడు భుక్తిమాట చూడు మొదట" అన్నాడు.

నేనొక పెద్ద నిట్టూర్పు విడిచి, శంకరరావుని ఉద్దేశించి ఇలా అన్నాను: "ఇంతవరకు వచ్చిన తరువాత దీనికిమాత్రం బిడియమెందుకు? నేను కూడా ఈ ఆకలి బాధకి తాళుకోలేక పోతున్నాను. మా నరసింహానికేం? నేను పరిశ్రమించి ఎక్కడో అక్కడ నాలుగు డబ్బులు ఒడుక్కుని వచ్చేవరకు నిశ్చలంగా సమాధిలో ఉంటాడు. ఆ తరువాత పీకలదాకా మెక్కి మళ్ళీ యోగనిద్రలో పడతాడు.

ఎవరూ ఏమీ బదులు చెప్పలేదు. స్వరం మార్చాను. అదోలా పోజుపెట్టి సోలిలక్వీ ధోరణిలో "ఈ సమయంలో ఈ ఊళ్లో మా మామగారి తోడల్లుడే కనుక ఉంటేనా? ఒక్కనాటికి తిండిలేకుండా చావడానికి ఒప్పుకోను. నాతో ఉండే వాళ్లని కూడా చావనివ్వను. అమాంతం ఆ తోడల్లుడిగారి కొంపమీదపడి, డబ్బుఇచ్చేదాకా వదలక, ఆఖరికి సత్యాగ్రహమైనా చేసి, దారిఖర్చులకి కూడా డబ్బు ఒడికి అక్కడినుంచి జెండా పీకెయ్యనూ? ఆ శంకరరావుగారి సంగతి చూడండి. ఊళ్ళో

మామగారి తోడల్లుడూ ఉన్నాడు. ప్రియమైన మరదళ్ళూ ఉన్నారు. వాళ్లకి డబ్బూ ఉంది. ఈయనకి పరపతీ ఉంది. అలాంటప్పుడు తిండికి కూడా లేక బాధపడుతూ, ఈ దిక్కుమాలిన సత్రంలో మనలాంటి జోగులతో బుజంబుజం రాసుకు తిరుగుతూ నానా అవస్థా పడుతున్నాడు. అంతేలే. లేక మనలాంటి నిర్భాగ్యులు ఏడిస్తే ఉండి కొందరు..."అంటూ మావాడు యోగనిద్రనుంచి లేచి సంజ్ఞాసూచకంగా దగ్గడం మొదలుపెట్టగా నే విరమించాను.

ఆ తరవాత మాలో మాకు ఏలాంటి సంభాషణలులేవు. మధ్యాహ్నం 3 గంటల వరకు అలాగే ఎవరి మూల వారు కూర్చుని ఉండిపోయాం. మా వాడు (నరసింహం)

సమాధిలోంచి నిజంగానే బయటపడి, తువ్వాలు భుజంమీద వేసుకుని, పనిఉందనైనా ఎవరితోటీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. నేను కడుపు నింపుకోడం కోసం కుళాయిదగ్గరికి చేరాను. అక్కడినుంచి అలా సెంట్రల్ స్టేషన్ చేరుకుని, ముఖాలవేట సాగించి తిరిగి సత్రం చేరుకునేసరికి కొంచెం ఆలస్యమయింది. నేను వచ్చేసరికి శంకరరావు అక్కడ లేడు. అదృశ్యమయ్యాడు. అతని బెడ్డింగుమాత్రం చక్కగా చుట్టబెట్టబడి ఉంది.

ఆ రాత్రి మెయిల్ టైమ్ గంట ఉందనగా నరసింహం సత్రం చేరుకున్నాడు. పక్కబట్టలు అన్నీ సర్ది, మెయిల్ కి బయలుదేరడానికి సిద్ధంగా ఉండమని నాతో చెప్పి, టిక్కెట్లు కొనడానికి సెంట్రల్ కి వెళ్లిపోయాడు. వాడు తిరిగి వచ్చేసరికి నేను సిద్ధంగా ఉన్నాను. ఆవెంటనే బెండా పీకేసి మా ఊరికి బయలుదేరి పోయాం.

దారిలో నేను బాధింపగా బాధింపగా మావాడు నాతో శంకరరావు కథ ఎలా ముగిసింది ముక్తసరిగా నాలుగుమాటల్లో చెప్పాడు. వాడు చెప్పినదిది - నరసింహానికి మొదటినుంచి శంకరరావు సంగతంతా తెలుసు. ముఖ్యంగా అతని పినమామగారితో పరిచయం ఉంది. మేము (నేను, శంకరం) విహారార్థం బీచ్ కి వెళ్ళినప్పుడల్లా నరసింహం శంకరరావు పినమామగారి ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడి శంకరరావు, విషయంలో ధైర్యం చెప్పివస్తూ ఉండేవాడు. ఆయన ద్వారానే శంకరరావు తలిదండ్రులకు కూడా ఇక్కడి కబుర్లు అందచేయించి, వారు ఎవరూ ఇక్కడికి రాకుండా మాత్రం చూడమనీ, లేకపోతే పరిస్థితి చెడుతుందనీ శంకరం పినమామగారితో చెప్పి, ఆ విషయంలో తగిన కట్టుదిట్టం చేశాడు. చివరకి ఆఖరిరోజు మధ్యాహ్నం ఆయన ఇంటికే వెళ్ళాడు. శంకరరావుకి చచ్చే ఉద్దేశ్యం ఏనాడో పోయిందని చెప్పాడు. ఇప్పుడు తిండిలేకపోవడంతో మనిషి బెంబేలుపడే స్థితివచ్చిందని కూడా అన్నాడు. కాని అవేవి తలపెట్టకుండా "పరీక్షలకోసమని రా బాబూ, నీకు ఇష్టం లేకపోతే మీ ఇంటికి వెళ్లి, మీవాళ్లని కలవనక్కర్లేదులే. ముందు పరీక్షకి వెడుదువుగాని, నీ ఇష్టంవచ్చినట్లు అన్నీ జరిగించే బాధ్యత నాది" అని శంకరరావుతో చెప్పి, అతన్ని ఎలాగో ఒకలాగు ఇంటికి తీసుకునిపోయి, ముందు కడుపునిండా ఇంత తిండి పెట్టమని నరసింహం శంకరరావు పినమామగారికి ఉపదేశించాడు.

అదే సమయంలో స్వవిషయం కూడా అందులోనే కలిపిచెప్పి, దారిఖర్చుకి మాత్రం ఆయనదగ్గర డబ్బు తీసుకున్నాడు. శంకరం పినమామగారికి మా అడ్రసు ఇచ్చి, ఇల్లు చేరుకోగానే డబ్బు తిరిగి పంపుతామని హామీ ఇచ్చి నరసింహం సత్రానికి బయలుదేరాడు.

శంకరం పినమామగారు, నరసింహము చెరొక దారిని సత్రంగుమ్మం చేరుకునేసరికి శంకరం అప్పుడే సత్రంగుమ్మం దాటి రోడ్ ఎక్కాడు. పినమామగారు కనపడగానే తన జీవితం ఇలా తయారయిందన్న దుఃఖమో, లేక సత్రంలో ఉంటున్నాననే అభిమానమో శంకరరావు సిగ్గు విడిచి ఒక్కసారి ఘొల్లుమని పడ్డాడు. నరసింహం మాటలు బుర్రలో మెదుల్తున్నాయేమో శంకరాన్ని వాళ్ళ పినమామగారు వెంటనే ఆపక్కనే ఉన్న హోటల్ కి తీసుకొని పోయారు. "శంకరరావు బెడ్డింగు సర్దుకుని ఉండడము, పినమామగారిని చూసి ఇక్కడికి ఎలాగ వచ్చాడా అని ఆశ్చర్యపడక పోవడము, పిల్లిలా ఆయనవెంటపడి పోవడము చూస్తే అతను వాళ్ల మామగారిఇంటికి బయలుదేరిఉంటాడనిపిస్తోంది. నా రాయబారంవల్ల మన పని అయిందికాని శంకరం పినమామగారి కేమీ సహాయం జరుగ లేదురా" అన్నాడు మా నరసింహం.

నా కథ మాత్రం ఇంకా ముగియలేదు. ఆ తరువాత ఏణ్ణర్థం అయిఉంటుంది. మద్రాసులోనే ఒక పెద్ద బట్టల దుకాణంలో సేల్స్మన్‌గా పని చేసుకుంటున్నాను. నరసింహం కూడా అక్కడే ఒక కంపెనీలో టైపిస్టుగా ఉన్నాడు.

ఒకరోజు దుకాణంలో ప్రవేశిస్తూ ఉండగానే శంకరరావు నాదగ్గరికి వచ్చాడు. మునుపటికన్న ఆరోగ్యంగా బలంగా కనపడుతున్నాడు. అతని క్షేమసమాచారాలు అవీ తెలుసుకుని, కొంచెం సేపు పిచ్చాపాటీ చెప్పుకుని, కులాసాగా గడుపుదామనుకున్నాను. అతను నా ధోరణేమీ గమనించకుండా ముందుగానే "వెనక నాదగ్గర పుచ్చుకున్న పన్నెండు రూపాయల పదకొండు అణాలు ఇవ్వండి" అంటూ నిలదీసి గట్టిగా అడిగాడు. దుకాణంలో గట్టిగా మాట్లాడుకోటం బాగా ఉండదని, ఎలాగో బయటికి తీసుకువెళ్ళి "ప్రస్తుతం చేతిలో ఎర్రని రాగిదమ్మిడీ కూడా లేదు. అడ్రసు ఇచ్చివెళ్ళండి. తరువాత పంపుతాను" అని బ్రతిమాలాను. అతను ససేమిరా వల్లకాదు ఇప్పుడే ఇచ్చేయాలి అని కూర్చున్నాడు. అతని వరస చూస్తే మా యజమానిదగ్గరికికూడా వెళ్ళి, ఈ గొడవఅంతా చెప్పి, నా ఉద్యోగానికే ఎసరు పెట్టేలా ఉన్నాడు. ఇక లాభం లేదనుకుని "మధ్యాహ్నం 3 గంటలకి రండి. ఎక్కడో అక్కడ పుట్టించి మీకు ఇచ్చేసుకుంటాను" అని నచ్చచెప్పి అతన్ని పంపించేసరికి నా తాతలు దిగివచ్చారు.

టంచన్‌గా మధ్యాహ్నం 3 గంటలకే వచ్చిడబ్బు గుంజుకుపోయాడు. నామీద జాలివేసిందేమో కొంచెం నోరు విప్పి, "పరీక్షలో ఫస్టుక్లాస్ వచ్చింది. గవర్నమెంటులో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టి ఇంటర్వ్యూకోసం వచ్చాను. మగపిల్లవాడు పుట్టాడు" అని మాత్రం చెప్పి వెళ్ళిపోయాడు.

దుర్మార్గుడు. ప్రాణదాతపట్ల కృతజ్ఞత అణుమాత్రంకూడా లేదు. ఇలాంటివాళ్ళకి ఉపకారమే చేయకూడదు. ఆనాడు చావనివ్వవలసింది. అబ్బాయికి తెలిసొచ్చును అనుకున్నాను.

ఆ తరువాత కలుసుకున్నప్పుడు శంకరరావు ఎప్పుడు వచ్చింది. నా అడ్రసు ఎలా తెలుసుకున్నది మా నరసింహం చెప్పాడు.

నరసింహం అన్నదిది:

"శంకరరావు ఒకనాడు యాదృచ్ఛికంగా ట్రామ్‌లో తారసిల్లాడురా. నేనంటే కొంచెం గౌరవం ఉందేమో (నేనంటే లేనట్లు) బాగానే మాట్లాడాడు ముందు చెయ్యబోయే ఘనకార్యాలు కూడా చెప్పాడు. నేనే నీ అడ్రసు ఇచ్చి దారి చెప్పి నీ దగ్గరికి పంపాను. జాగ్రత్తగా అడ్రసు తెలుసుకున్నట్లు, నువ్వు వెనకటి బాకీ అణాపైసలతో తీర్చివేసినట్లు చెప్పి ఈ ఊరునుంచి వెళ్లిపోయాడు.


"నా పెళ్లాం బిడ్డల ఆరోగ్యంగురించి అడిగాడు. ఘోటక బ్రహ్మచారిని నన్ను పట్టుకుని నాకు పెళ్లయినట్లు పిల్లలు కూడా ఉన్నట్లు చెప్పావటగా? ముక్కుపిండించి నీ దగ్గర డబ్బు వసూలు చేయించాను. దొంగ వెధవ్వి, నీకు తగ్గశాస్తి అయిందా?" ★

Edited, Printed&Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



ఏటిగట్టు—చిత్రకారుడు: శ్రీ గూడూరి నారాయణమూర్తి.

Regd No. M. 4479



అనువాదం

నండూరి రామమోహనరావు

వెల రూ. 1-8-0

పోస్టుఖర్చులు ప్రత్యేకం

విక్రేతలు

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు 1.